Pubilshed from Ananthapuramu

PRGI NO : APTEL/2023/90641

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com



మనిషి మనుగడలో అతిముఖ్యమైనది
శాంతి సుఖం సంతోషం ఆర్థికాభివృద్ధిఎదుగుదల,
ఇలాంటివి సాధించుకోవటానికి ఎదురయ్యే సమస్యలకు
గృహవాస్తు. జాతకదోషాలు,
అనేక రకాల సందేహాల నివృత్తి కోసం
చక్కటి పరిష్కారం కోసం సంప్రదించగలరు.

వాస్తు - జ్యోతిష పండితులు
మహామంత్రోపాసకులు
శ్రీ లలితాంబికా పీఠం వ్యవస్థాపకులు
బ్రహ్మశ్రీ మాడుగుల శివప్రసాద్ గురూజీ
79970 39039

| అనంతపురము ANATHAPURAMU | సంపుటి : 04 | సంచిక : 79 | శుక్రవారం | అక్టోబర్ 2, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ |
|---|---|---|---|---|---|---|---|
| | Vol.No : 04 | Issue No : 79 | Friday | 2 OCTOBER 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/- |

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakinkada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

## రిజర్వేషన్లు అడ్డుకునేలా కోర్టుల్లో
# గొడ్డలి పార్టీ పిటీషన్లు

### బీసీలకు అండగా నిలిచింది...నిలిచేది మేమే

- 34 శాతం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో అప్పీల్
- రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు రేపు శ్రీకారం
- సంక్షేమం-అభివృద్ధి- సుపరిపాలనతో ప్రతిచోటా ఫలితాలు
- రేపల్లె ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన సీఎం

ప్రజాభూమి ప్రతినిధి,రేపల్లె : బీసీలకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అండగా నిలిచింది... నిలిచేది తామేనని ముఖ్యమమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. బీసీలకు చేయూతను అందించే విషయంలో ఎక్కడా రాజీ పడబోమని తేల్చి చెప్పారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళ్లనున్నట్లు తెలిపారు. బీసీలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. బాపట్ల జిల్లా రేపల్లెలో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రజావేదికలో సీఎం ప్రసంగించారు.



నాడు బీసీలకు రాజకీయంగా ఎన్టీఆర్ గుర్తింపు తెచ్చారని.. తాను వారికి అండగా నిలబడి ప్రోత్సహించానని సీఎం అన్నారు. 1995లో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు తెచ్చామని ముఖ్యమంత్రి వెల్లడించారు. గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చాక రిజర్వేషన్లను 24 శాతానికి కుదించిందన్నారు. తద్వారా 16,800 మంది పదవీ అవకాశాలు కోల్పోయారని ముఖ్యమంత్రి అన్నారు. దీనిపై సీఎం మాట్లాడుతూ.." ఇప్పుడు మళ్లీ మేం అధికారంలోకి వచ్చాక బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తే గొడ్డలి పార్టీ కోర్టుకు వెళ్లింది. హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసింది. 50 శాతం కంటే రిజర్వేషన్లు పెరగకూడదని కోర్టులో వాదించారు. కోర్టు ఆ జీవోలను కొట్టేసింది.

2 లో



## అఫ్ఘానిస్థాన్‌లో భూకంపం..

### రిక్టర్ స్కేలుపై 5.3 తీవ్రత

కాబూల్: అఫ్ఘానిస్థాన్‌లోని హిందూకుష్ ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున భూకంపం సంభవించింది. జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ (GFZ) ప్రకారం భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.3గా నమోదైంది. భూకంపం సుమారు 10 కిలోమీటర్ల లోతులో సంభవించినట్లు తెలిపింది. భూకంప కేంద్రం సుమారు 36.05 డిగ్రీల ఉత్తర అక్షాంశం, 68.87 డిగ్రీల తూర్పు రేఖాంశం వద్ద ఉన్నట్లు GFZ పేర్కొంది. కేంద్రానికి సమీప ప్రాంతాల్లో ప్రకంపనలు బలంగా అనిపించినట్లు సమాచారం. GFZ తొలుత భూకంప తీవ్రతను వేరుగా నమోదు చేసి, అనంతరం 5.3గా సవరించినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటివరకు భూకంపం కారణంగా ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టానికి సంబంధించిన సమాచారం అందలేదు. అధికారులు పరిస్థితిని పరిశీలిస్తున్నారు.

## లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక
# యూపీఎస్సీ

### ప్రధాని నరేంద్ర మోదీ

- యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ
- స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన ప్రధాని
- లక్షలాది మంది యువత ఆశయాలకు యూపీఎస్సీ ప్రతీక అని వ్యాఖ్య
- సర్దార్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలను స్మరించుకున్న ప్రధాని
- భారత పైలట్ స్మిత్ ధైర్యాన్ని కొనియాడిన మోదీ

న్యూఢిల్లీ : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపం లో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తో పాటు '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.



ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నిన్న జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

2 లో



## మమతా బెనర్జీ వర్గానికి సుప్రీంకోర్టులో
# చుక్కెదురు

న్యూఢిల్లీ : మమతా బెనర్జీ నేతృత్వంలోని టిఎంసి వర్గానికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. స్తంభింపచేసిన నాలుగు డెబిట్ బ్యాంకుల ఖాతాలను నిర్వహించేందుకు అనుమతించాలని కోరుతూ ఆ వర్గం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు గురువారం తిరస్కరించింది.

2 — పేజీలో..

ఆ అభ్యర్థనను అనుమతించడానికి నిరాకరించిన కోల్‌కతా హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవడానికి తాము సుముఖంగా లేమని జస్టిస్ ఎం.ఎం. సుందరేష్, జస్టిస్ పి.బి. వర్లేలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఎన్నికల కమిషన్ (ఈసి) పార్టీ గుర్తును స్తంభింపచేసిందని, దీంతో ఆ మొత్తాన్ని పొందే అర్హత ఎవరికి ఉందనే ప్రధాన అంశంపై నిర్ణయం ఇంకా పెండింగ్‌లో ఉందని కోర్టు గుర్తించింది. తాము కేసులోని వాస్తవ అంశాల్లోకి వెళ్లాలనుకోవడం లేదని, ఆర్టికల్ 136కింద తమ అధికార పరిధిని వినియోగించుకోవడానికి తాము సుముఖంగా లేమని ధర్మాసనం పేర్కొంది.

## డ్వాక్రా రుణంతో వ్యాపారం...
# వాట్సాప్‌తో విస్తరణ

- వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్ స్ఫూర్తితో వ్యాపారవేత్తగా రేపల్లె మహిళ
- రేపల్లెలో డ్వాక్రా మహిళ జేజమ్మతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖాముఖి
- గ్రామంలో ఓ లబ్ధిదారునికి వృద్ధాప్య పింఛను అందజేసిన ముఖ్యమంత్రి



2 — పేజీలో..

ప్రజాభూమి ప్రతినిధి,రేపల్లె : స్వయం సహాయక సంఘాల ద్వారా అందుతోన్న రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. డ్వాక్రా రుణాలు, ప్రభుత్వ ప్రోత్సాహంతో చిన్న వ్యాపారాలను ప్రారంభించి వాటిని క్రమంగా విస్తరించుకోవచ్చని సూచించారు. బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. రేపల్లెలోని 4వ వార్డులో శ్రీలక్ష్మి కిరాణా జనరల్ స్టోర్‌ను సందర్శించి దుకాణా యజమాని జి.జేజమ్మతో పాటు స్వయం సహాయక సంఘాల మహిళలతో సీఎం ముఖాముఖి మాట్లాడారు.

## నెలాఖరు నుంచి జంతర్‌మంతర్‌లో ఆందోళన

### (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే



ముంబయి : ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెలాఖరు నుంచి ఢిల్లీలోని జంతర్‌మం తర్‌లో ఆందోళన చేపడతామని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. గురువారం ముంబయిలో మీడియాతో మాట్లాడుతూ, సీఈసీ రాజీనామా చేసే వరకు నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అక్టోబర్ 2న ముంబయిలోని శివాజీ పార్క్‌లో నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. గోవా, కర్ణాటక, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లోనూ ఆందోళనలు నిర్వహిస్తామని చెప్పారు. సీఈసీ నియామక ప్రక్రియలో పౌర సమాజానికి భాగస్వామ్యం కల్పించాలని, నియామకాల్లో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. 2025 ఓటర్ల జాబితాను స్తంభింపజేసి, దానిలో ఇకపై ఎలాంటి మార్పులూ చేయరాదని కోరారు.




## గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా
# రాయలసీమ

### సీమలో ఉద్యాన విప్లవం-రూ. 1 లక్ష కోట్లతో బృహత్తర ప్రాజెక్ట్

- సీమను ఫ్రూట్ బౌల్ గా మార్చేలా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు
- సీడ్ టు షిప్మెంట్ విధానంతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు
- మదనపల్లెలో గ్లోబల్ హార్టి కల్చర్ హబ్‌కు శ్రీకారం, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన
- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా పనులకు అంకురార్పణ

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: రాయలసీమ ప్రాంతాన్ని ఫ్రూట్ బౌల్ గా తీర్చిదిద్దేలా గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. విత్తనం నుంచి విదేశాలకు ఉద్యాన ఉత్పత్తులు ఎగుమతి చేసే వరకు రైతులకు అండగా నిలిచేలా ప్రణాళికాబద్ధంగా గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం రూపకల్పన చేసింది. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తో కలిసి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లు హార్టీకల్చర్ హబ్ కు శ్రీకారం చుట్టనున్నారు.

2 లో..

రూ.1 లక్ష కోట్ల వ్యయంతో మూడు దశల్లో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఆవిష్కృతమయ్యేలా పనులు చేపట్టనున్నారు. ఇందులో ఎన్డీఏ ప్రభుత్వం రూ.40,352 కోట్లు సమకూరుస్తుండగా, ప్రైవేట్ రంగం నుంచి రూ.60,000 కోట్లు పెట్టుబడులు రాబట్టేలా ప్రణాళికలు రూపొందించారు. అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు, నంద్యాల, సత్యసాయి, తిరుపతి, కడప, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో ఈ ప్రాజెక్టు కింద వివిధ పనులను చేపట్టనున్నారు.



## 'సంజీవని'పై 1.02 లక్షల మందికి శిక్షణ

- ఆశాల నుంచి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక-
- 2008 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక సదుపాయాలు
- 2,277 మంది పేషెంట్ కోఆర్డినేటర్ల నియామకం
- వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్

2 పేజీలో..

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి : రాష్ట్రంలో 'సంజీవని' కింద వైద్య సేవలను జనవరి 1 నుంచి ప్రారంభించేందుకు వీలుగా వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేసే అన్ని స్థాయిలోని వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, అధికారులు కలిఎ



## ఫారం-6లో మార్పులపై ఈసిని
# నిలదీసిన రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్ ఫారం--6లో చేసిన మార్పులపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఎన్నికల సంఘం (ఈసి)ని నిలదీశారు. ఓటరు నమోదు కోసం ఉపయోగించే ఫారం--6లో మార్పులు చేయాలని ఎవరు ఆదేశించారు? వాటిని ఎవరు ఆమోదించారు? అని ఆయన గురువారం సోషల్‌మీడియా ఎక్స్‌లో ప్రశ్నించారు.

"ఆన్‌లైన్ ఫారం--6ను చట్టవిరుద్ధంగా మార్చారు. ఈ మార్పు చేయాలని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) ను ఈసిఐలో ఎవరు ఆదేశించారు? టిసిఎస్‌లో దానిపై ఎవరు సంతకం చేశారు? అందుకు వారిపై ఏమైనా ఒత్తిడి తెచ్చారా?" అని రాహుల్‌గాంధీ ప్రశ్నించారు.

వివరాలు 2లో..

# సంపాదకీయం

## డ్రాగన్‌తో చర్చలు సఫలీకృతం అయ్యేనా!?

భారత్ తో డ్రాగన్ మళ్లీ కలిసేందుకు సిద్ధమైంది. గత విద్వేషాలకు స్వస్తి పలుకుతూ భారత్ తో సుస్థిర బంధం ఏర్పరుచుకోవడానికి చైనా తహతహ లాడుతోంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్, తదనంతర పరిణామాలతో భారత్ విమానయాన సంస్థలకు పాకిస్తాన్ తన గగనతలాన్ని మూసేసింది. దీంతో పాకిస్తాన్ మీదుగా వెళ్లాల్సిన భారత విమానాలు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఐరోపా, ఉత్తర అమెరికా వైపు వెళ్లే విమానాలు ఇతర మార్గాల్లో వెళ్తున్నాయి. దీనివల్ల ప్రయాణ సమయం, నిర్వహణ ఖర్చు పెరగడం వల్ల విమానయాన సంస్థలపై ఆర్థిక భారం పడుతోంది. ఈ నేపథ్యంలో భారత్ గత ఏడాది కాలంగా ప్రత్యామ్నాయ మార్గాల్ని అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా చైనాలోని హోటాన్ మీదుగా విమానాలు నడిపేందుకు అనుమతివ్వాలని డ్రాగన్ ను కోరుతోంది.అయితే ఇన్నాళ్లూ భారత్ చేసిన ఈ ప్రతిపాదనపై చైనా స్పందించడం లేదు. కానీ తాజాగా బ్రిక్స్ సదస్సు సందర్భంగా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ భారత్‌లో పర్యటించినప్పుడు.. ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చైనా అధికారులతో భారత అధికారులు చర్చలు జరుపుతున్నారు. భారత విమానయాన సంస్థలకు ప్రత్యామ్నాయ మార్గంగా జిన్‌జియాంగ్ గగనతలాన్ని ఇచ్చేందుకు భారత్.. చైనాతో చర్చలు జరుపుతోందని అధికారులు తెలిపారు. ప్రత్యామ్నాయ మార్గాలపై విదేశాంగ మంత్రిత్వ శాఖ చైనా ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతోందని వారు స్పష్టం చేశారు.జిన్‌పింగ్ ఢిల్లీ పర్యటనకు ముందు, చైనా సదరన్ ఎయిర్‌లైన్స్, ఆరు సంవత్సరాలుగా నిలిపివేసిన మార్గాన్ని పునరుద్ధరిస్తూ.. సెప్టెంబర్ 21 నుండి గ్వాంగ్‌జౌ-న్యూఢిల్లీ మధ్య ప్రత్యక్ష విమాన సర్వీసులను తిరిగి ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. కోవిడ్ మహమ్మారి, భారత్-చైనా సరిహద్దు వెంబడి నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష విమాన సంబంధాలను పునరుద్ధరించే ప్రయత్నంలో ఇదొక భాగం. భారత్-చైనా మధ్య పునఃప్రారంభించిన తొలి భారతీయ విమానయాన సంస్థ ఇండిగో. గత అక్టోబర్‌లో కోల్‌కతా-గ్వాంగ్‌జౌ మధ్య ఇండిగో సర్వీసులను పునఃప్రారంభించింది. నవంబర్‌లో ఢిల్లీ-గ్వాంగ్‌జౌ మధ్య కూడా భారత్-చైనా ప్రత్యక్ష విమాన సర్వీసులను తిరిగి ప్రారంభించింది. ఆ తర్వాత ఎయిర్ ఇండియా ఫిబ్రవరి 1న ఢిల్లీ-షాంఘై సర్వీసులను నడిపింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు చైనా మీదుగా ఇతర దేశాలకు వెళ్లేందుకు భారత్ అనుమతులు కోరుతోంది. మరోవైపు భారత్- చైనా మధ్య సంబంధాలు గతంతో పోలిస్తే నేడు మెరుగ్గా ఉన్నాయని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అభిప్రాయ పడ్డారు. సరిహద్దు సమస్యలు పరిష్కారం కావడంతో ఇరు దేశాల సంబంధాలు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని అన్నారు. సోమవారం న్యూయార్క్‌లో 'ఆసియా సొసైటీ'లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న జైశంకర్ ఈ మేరకు స్పందించారు. "గతంతో పోలిస్తే ప్రస్తుతం సంబంధాలు మెరుగ్గా ఉన్నాయా అని నన్ను అడిగితే, 'అవును' అని అంటాను. 2024తో పోలిస్తే అవి మరింత మెరుగ్గా ఉన్నాయి." అన్నారు. 2020లో భారత్- చైనా మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు తలెత్తిన తర్వాత రెండు దేశాల మధ్య సాధారణ సంబంధాలు నిలిచిపోయాయని జైశంకర్ చెప్పారు. వాణిజ్యం కొనసాగినప్పటికీ, అధికారిక రాకపోకలు, వీసా జారీ, విమాన సర్వీసులు మాత్రం ప్రభావితమయ్యాయని వివరించారు. ఈ క్రమంలోనే సరిహద్దు ఉద్రిక్తతలు పరిష్కారం కాగానే, సంబంధాలు మెరుగుపడటం సహజమని అన్నారు. మేము ఒక అత్యంత ప్రాథమిక సూత్రానికి వచ్చాం. సరిహద్దు పరిస్థితే మన సంబంధాల స్థితిని నిర్ణయిస్తుంది. సరిహద్దులో ఉద్రిక్తతలు కొనసాగుతుండగా, సంబంధాలు మాత్రం సాధారణంగా ఉండాలని ఆశించడం సాధ్యం కాదు. సరిహద్దు పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంటున్న కొద్దీ, మన సంబంధాలు కూడా సాధారణ స్థితికి వస్తాయి. సంబంధాలు సాధారణ స్థితికి రావడం వల్ల మన ఇద్దరికీ ప్రయోజనం చేకూరుతుంది. ఒక నిర్దిష్ట సమస్యపై మాత్రమే పూర్తిగా దృష్టి సారించి, తద్వారా నష్టపోయే పరిస్థితిని నేను కోరుకోను. నాకు అనుకూలమైన పరిష్కారం దొరికితే, దానినే ఎంచుకోవడానికి నేను ప్రాధాన్యం ఇస్తానని అన్నారు. మన మధ్య సంబంధాల్లో ప్రతిష్టంభన లేదా క్షీణత అనేది వాస్తవానికి మనలో ఎవరికీ ప్రయోజనం చేకూర్చదు. పైగా దీనివల్ల మూడో పక్షాలే లాభపడతాయి. ఇదే విషయాన్ని భారత్? చాలా కాలంగా చైనాకు చెబుతోంది. అలాగే, 'ఇతరులకు ప్రయోజనం చేకూర్చే సమస్యలో మనం చిక్కుకుపోకూడదు' అనే అత్యంత ప్రాథమిక దౌత్య సూత్రాన్ని కూడా మేము నిలకడగా పాటించాం. ఏ కారణం చేతనో, చైనా పక్షం దీనిని అంగీకరించడానికి కొంత సమయం పట్టింది. అయితే, ఆ సుదీర్ఘ ప్రతిష్టంభన మన ప్రయోజనాలకు ఏమాత్రం ఉపయోగపడలేదని నా అభిప్రాయం. అది వారికి కూడా ఏ విధంగానూ మేలు చేయలేదు. మన సంబంధాల్లో మెరుగుదల అనేది కేవలం చైనాతోనే కాకుండా, ప్రపంచ దేశాలతో మనకున్న సంబంధాల్లోనూ మన స్థానాన్ని బలోపేతం చేస్తుందని నేను భావిస్తున్నాను." అని జైశంకర్? అన్నారు. ఇటీవల కాలంలో ఇరు దేశాల సంబంధాల్లో సానుకూల మార్పులు కనిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే బ్రిక్స్ ( సదస్సు కోసం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించడం వంటి పరిణామాలు జరిగాయి. మరోవైపు సీమాంతర ఉగ్రవాదమే భారత్‌కు ఉన్న ప్రధాన ఆందోళన అని విదేశాంగమంత్రి ఎ.జైశంకర్ అన్నారు. దశాబ్దాలుగా పొరుగు దేశం ఉద్దేశపూర్వకంగా ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తోందని పాకిస్థాన్‌ను ఉద్దేశించి తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రపంచంలో మరే దేశం కూడా భారత్‌లా ఉగ్రవాద బాధితురాలిగా లేదన్నారు. కీలకమైన ఈ ఆందోళనలను భాగస్వామ్య దేశాలు అర్థం చేసుకోకపోతే ద్వైపాక్షిక సంబంధాలపై కచ్చితంగా ప్రతికూల ప్రభావం పడుతుందని జైశంకర్ హెచ్చరించారు. మరోవైపు భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ఖరారైతే ఇరు దేశాల సంబంధాలు మరింత మెరుగు పడతాయని జైశంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రంప్ హయాంలో అమెరికా-పాకిస్థాన్ మధ్య బంధం బలపడుతున్న నేపథ్యంలో జైశంకర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఏదిఏమైనా ఇరు దేశాల మధ్య చర్చలు ఫలించి గగనతలంపై విమానాల రాకపోకలు మళ్లీ పునఃప్రారంభం కావాలి. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఇతర సమస్యలపై కూడా అధికారులు దృష్టి సారించి సామరస్యంగా పరిష్కరించుకోవాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

## లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

"నిన్న జరిగిన ఘటనలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా, 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడు" అని మోదీ అన్నారు. స్మిత్ ఘనత మనందరికీ గర్వకారణమని, తాను ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు. యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. "ఇది కేవలం ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదు, ఇది లక్షలాది యువత ఆశయాల వేడుక. ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దం. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు" అని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోదీ గుర్తుచేసుకున్నారు. "1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆనాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ ఆయన సంస్కృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూశాను. అదేవిధంగా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని నడపడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు. స్వతంత్ర భారతానికి అవసరమైన 'ఉక్కు చట్రాన్ని' (స్టీల్ ఫ్రేమ్) సర్దార్ పటేల్ అందించారు. ఈ సంస్థను దేశానికి ఒక ప్రధాన స్తంభంగా తీర్చిదిద్దారు" అని మోదీ వివరించారు.
1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన ఈ సంస్థ, శతాబ్ద కాలంలో ఎన్నో మార్పులకు లోనై స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని ప్రధాని గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 1న ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు ఈ కార్యక్రమంతో ముగిశాయి.
సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, విద్యావేత్తలు, యూపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

## ఫారం-6లో మార్పులపై ఈసిని నిలదీసిన రాహుల్‌గాంధీ

ఓటర్ల జాబితాలో పేర్ల నమోదుకు ఉపయోగించే ఆన్‌లైన్ ఫారం--6లో చేసిన మార్పులపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ఇటీవల వెల్లడించింది. ఆ నివేదిక ప్రకారం, ఈసిఐనెట్ పోర్టల్‌లోని ఆన్‌లైన్ ఫారం--6లో అదనంగా ఒక డిక్లరేషన్ భాగాన్ని చేర్చారు. ఇందులో దరఖాస్తుదారు పేరు, వారి తల్లిదండ్రులు లేదా తాత, అమ్మమ్మల పేర్లు చివరిసారిగా జరిగిన ఎస్ఐఆర్ సమయంలోని ఓటర్ల జాబితాలో ఉన్నాయా అనే వివరాలను తెలియజేయాల్సి ఉంటుంది. ఈ మార్పుపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేసి, దీనిని అనధికారికమైనదిగా పేర్కొన్నట్లు నివేదిక తెలిపింది.

## రిజర్వేషన్లు అడ్డుకునేలా కోర్టుల్లో గొడ్డలి పార్టీ పిటీషన్లు

దీనిపై రేపే ఈ సుప్రీం కోర్టులో అప్పీలుకు వెళ్తున్నాం. వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా రాజకీయంగా పైకి తీసుకురావటమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. ఒక్క టీచర్ ఉద్యోగం కూడా ఇవ్వని వ్యక్తులు.. మేం మెగా డీఎస్సీ తో ఉద్యోగాలు ఇస్తే ఆరోపణలు చేస్తున్నారు. 350 కేసులు కోర్టుల్లో వేసి నియామక ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నం చేశారు. వెనుకబడిన వర్గాలపై ద్వేషంతో కోర్టులకు వెళ్లి అడ్డంకులు సృష్టించే రిజర్వేషన్లు రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏది ఏమైనా బీసీలను రాజకీయంగా అండగా నిలబడే బాధ్యతను మేం తీసుకుంటాం. ఈ ప్రాంతంలో బీసీ బిడ్డ అనగాని భగవంతరావు చక్కగా పనిచేశారు. ఇప్పుడు మంత్రిగా అనగాని సత్యప్రసాద్ ప్రజల కోసం పనిచేస్తున్నారు. బీసీలుగా నాయకులు రాజకీయంగా ఎదిగే అవకాశాలు కల్పించేది కూటమి ప్రభుత్వమే." అని ముఖ్యమంత్రి అన్నారు.

**జీవన ప్రమాణాలు పెంచటమే లక్ష్యం :** "గడచిన 28 నెలలుగా ప్రతీ నెలా మొదటి తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కార్యక్రమంలో పాల్గొంటున్నాను. చీఫ్ మినిస్టర్ అంటే కామన్ మ్యాన్ అని నేను విశ్వసిస్తున్నాను. ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకుంటూ పనిచేస్తున్నాను. పేదలకు న్యాయం చేయాలన్న బాధ్యతతో మేం పనిచేస్తున్నాం. ప్రతినెలా నాలుగు మార్లు ప్రజల ముందుకు వస్తున్నాం. ప్రతీ నెలా 1 తేదీన పేదలకు ఆర్థిక భద్రత కల్పించే పెన్షన్ల కార్యక్రమం, 9 తేదీన మీ భూమి- మీహక్కు కార్యక్రమంలో పాల్గొంటున్నాం. గత పాలకులు సృష్టించిన భూ వివాదాలను పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నాం. ఇక ప్రతిమూడో శనివారం పర్యావరణాన్ని కాపాడే స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి , 4వ శనివారం సంజీవని కార్యక్రమానికి హాజరవుతున్నాను. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని బాధ్యతగా తీసుకుని నిత్యం ప్రజా సేవకులుగా పనిచేస్తున్నాం. గడచిన రెండేళ్లుగా ప్రతీ వ్యక్తికి, ప్రతీ కుటుంబానికి సాధికారిత తీసుకువస్తున్నాం. రాష్ట్రంలో ఆ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. గొడ్డలి పార్టీ నేతలు ప్రజలు కొట్టిన దెబ్బకు అలిగి అసెంబ్లీకి కూడా రాకుండా ముఖం చాటేస్తున్నారు. గత పాలకులు అన్ని వ్యవస్థల్నీ భ్రష్టు పట్టించారు. రాష్ట్రాన్ని విధ్వంసం సృష్టించారు. కష్టంతో సంకల్పంతో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ఒక్కో ఇటుకా పేరుస్తూ రాష్ట్ర పునర్నిర్మాణం చేస్న?న్నాం. ఆర్థిక సవాళ్లు అధిగమించి సంక్షేమం అందిస్తున్నాం. పెన్షన్లకే ఇప్పటికి రూ.76 వేల కోట్లు ఖర్చు చేశాం. వెంటిలేటర్ పై ఉన్న ఆర్థిక వ్యవస్థను కేంద్ర సహకారంతో ఆక్సిజన్ ఇచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నాం. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు, బుల్లెట్ స్పీడ్ తో సుపరిపాలన అందిస్తున్నాం. పేదరికాన్ని ఆర్థిక కోణంలో కాదు మానవీయ కోణంలో ఆలోచించి జీవన ప్రమాణాలు పెంచడానికి చూస్తున్నాం. సంక్షేమంతో పాటు పీ4 కార్యక్రమం ద్వారా అట్టడుగున 20 స్థాయి మందికి చేయూత అందించేలా చర్యలు చేపట్టాం. బంగారు కుటుంబాలను ఎంపిక చేసి వారి జీవన ప్రమాణాలు పెంచేలా చర్యలు తీసుకున్నాం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**సంపద సృష్టికి మూలధన వ్యయం పెంచాం :** "రాష్ట్రవ్యాప్తంగా విశాఖ, విజయవాడ, మంగళగిరి తదితర ప్రాంతాల్లో నివాసస్థలాల్లో పేదలకు పట్టాలు ఇచ్చాం. రూ.52 వేల కోట్ల విలువైన నివాస స్థలాలకు పట్టాలు ఇచ్చి వారి సమస్యలు పరిష్కరించాం. పేదల కుటుంబాలకు చేయుతను ఇచ్చే అంశాన్ని ఆర్థిక కోణంలో చూడటం లేదు. పేద కుటుంబాల్లో 3-4 పథకాల ద్వారా ఆర్థిక సహకారం చేయూత అందుతోంది. స్త్రీశక్తి, తల్లికి వందనం, దీపం, మత్స్యకార సేవలో, ఆటోడ్రైవర్ల సేవలో ఇలా వేర్వేరు పథకాలు అందుతున్నాయి. రాష్ట్రంలో ప్రతీ వర్గాన్ని ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలో 1 లక్ష మంది డ్వాక్రా మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చాం. మరో 5 లక్షల మందిని కూడా వ్యాపారవేత్తలుగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రతీ నెలా డబ్బులు ఇచ్చేసి వెళ్లడానికి రాలేదు. ప్రజలను కలిసి వారి బాగోగులు తెలుసుకోడానికి వస్తున్నాను. అట్టడుగుస్థాయి వ్యక్తికి ఆర్థిక స్థోమత ఇచ్చి జీవన ప్రమాణాలు పెంచినప్పుడే అభివృద్ధి అదే నా సిద్ధాంతం. సంక్షేమాన్ని, అభివృద్ధిని సమానంగా చేపడుతున్నాం. పట్టణ ప్రాంతాల్లో రూ.50 వేల కోట్లు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.11వేల కోట్ల పనులు చేపడుతున్నాం. గత పాలనలో రోడ్లన్నీ గోతులు తవ్వేశారు. గడచిన రెండేళ్లుగా వాటిని పూడ్చి రోడ్లు బాగు చేశాం. సంజీవని కార్యక్రమం ద్వారా ప్రతీ పౌరుడి ఆరోగ్య రికార్డులను డిజిటల్ గా పర్యవేక్షిస్తాం. ఏపీ బ్రాండ్ ను పునరుద్ధరించటం ద్వారా పారిశ్రామిక వేత్తలు రాష్ట్రానికి క్యూ కడుతున్నారు. రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు, 20 లక్షల మందికి ఉద్యోగాలు గడచిన రెండేళ్లలో వచ్చాయి. సంపద సృష్టించేలా క్యాపిటల్ ఎక్స్ పెండిచర్ పెంచాం. రోడ్లు, రైల్వే, పోర్టులు, ఎయిర్ పోర్టులు పూర్తి చేస్తున్నాం.రాయలసీమ జీవనాడి హంద్రీనీవా మొదటి దశ పనులు పూర్తి అయ్యాయి. వంద రోజుల్లో రూ.3,500 కోట్ల ఖర్చు చేసి చిట్టచివరి ప్రాంతమైన కుప్పం వరకూ నీళ్లు తీసుకెళ్లాం. వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ పూర్తి చేసి మార్కాపురం వరకూ నీళ్లు తీసుకువచ్చాం. శ్రీశైలం మల్లన్న పాదాల నుంచి మార్కాపురం చెన్నకేశవ స్వామి చెంతకు కృష్ణమ్మ నీళ్లు తీసుకెళ్లాం. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకూ గోదావరి నీళ్లు తీసుకువెళ్లాం. ఎల్ నినో కారణంగా వర్షాలు పడక రాష్ట్రంలో కరవు వచ్చింది. డ్రామాలు ఆడటానికి గొడ్డలి పార్టీ బయల్దేరింది. వరుణ దేవుడి కృపవల్ల మనకు సరైన సమయంలో కాస్త వర్షాలు పడ్డాయి. కృష్ణానదిలో నీళ్లు రాకపోయినా గోదావరి నీళ్లు పట్టిసీమ ద్వారా డెల్టాకు తెచ్చాం. గతంలో కేవలం 13 నెలల్లోనే పట్టిసీమ పూర్తి చేసి కృష్ణా డెల్టాకు నీళ్లు తెచ్చాం.పోలవరం పూర్తి అయితే కృష్ణా, గోదావరి డెల్టాలకూ నీటి సమస్యే ఉండదు. పట్టిసీమ అనే నిర్ణయం ఇక్కడి రైతుల జీవితాల్లో వెలుగులు తీసుకువచ్చింది. గొడ్డలి పార్టీ విమర్శలకు భయపడితే కృష్ణాడెల్టాకు నీళ్లు వచ్చేవి కావు. ప్రతిపక్ష పార్టీ అంటే పోటీ తత్వం ఉండాలి. కాని గొడ్డలి పార్టీకి కుట్రతత్వం ఉంది.అభివృద్ధికి ఆటంకాలు కలిగించటమే గొడ్డలి పార్టీ పని" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

**పర్యాటక ల్యాండ్ మార్క్‌గా సూర్యలంక :** "వచ్చే మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. అభివృద్ధితో పాటు పర్యావరణాన్ని కూడా మనం కాపాడుకోవాల్సి ఉంది. అన్ని ప్రాంతాల్లోనూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలి. రాయలసీమ ప్రాంతాన్ని గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్ గా మారుస్తున్నాం. రూ.1 లక్ష కోట్లతో ప్రకాశం జిల్లాతో కలిపి 10 జిల్లాలను గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్ గా అభివృద్ధి చేస్తాం. ఉద్యాన పంటలతో పాటు లాజిస్టిక్స్ , పర్యాటకం ఇలా అన్ని రంగాల్లో పెట్టుబడులు వస్తాయి.బాపట్లలోని సూర్యలంక బీచ్ దీనిని గోవా తరహాలో అభివృద్ధి చేస్తాం. పర్యాటకుల్ని ఆకర్షించేలా దీనిని తీర్చిదిద్దాలని ప్రణాళికలు చేస్తున్నాం. ఆ పర్యాటకుల్ని ఆకర్షించటం ద్వారా సూర్యలంక దేశ చిత్రపటంలో ఓ ల్యాండ్ మార్క్ గా మారాలి. వాన్ పిక్ ప్రాంతాన్ని గొడ్డలి పార్టీ అధినేత సర్వనాశనం చేశారు. అభివృద్దే రాకుండా పోయింది. ఇష్టానుసారం అవినీతి చేసి సీబీఐ, ఈడీ కేసుల్లో ఇరుక్కున్నాడు. వాన్ పిక్ ద్వారా అద్భుతమైన పారిశ్రామిక టౌన్ షిప్ తయారు కావాల్సిన ప్రాంతాన్ని నాశనం చేశారు. ప్రజలకు జవాబుదారీ పరిపాలన ఇవ్వాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్యాలు కల్పించి మెరుగైన పౌరసేవలు అందించేలా చర్యలు చేపడుతున్నాం. ఐగాట్- మిషన్ కర్మయోగి కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఈ నైపుణ్యాలను పెంచుతోంది. మన ఉద్యోగులు 2.2 కోట్ల కోర్సులు చేసి దేశంలోనే ఏపిని అగ్రస్థానంలో నిలిపారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఓ ఉపాధ్యాయురాలు 4 వేల పైచికులు కోర్సులు చేసి నైపుణ్యాలు సాధించింది. ఇప్పుడు తన విద్యార్థులకు ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా విద్యను అందించేందుకు ఆ నైపుణ్యాలు ఆమెకు ఉపయోగ పడుతున్నాయి. వ్యక్తిగతంగా మనం కూడా మనమన రోజువారీ కార్యక్రమాలను మరింత మెరుగ్గా నిర్వహించుకోవాలంటే నైపుణ్యాలు పెంచుకోవాలి. సామాజిక మాధ్యమాల్లో రీల్స్ చూడటం కాకుండా నైపుణ్యాలు పెంచుకునే అంశంపై సమయం కేటాయించాలని కోరుతున్నాను." అని సీఎం సూచించారు.

**అభివృద్ధి అంశంలో రాజీలేదు :** "గత పాలకులు పట్టాదారు పాస్ పుస్తకాలు, సర్వేరాళ్లపై బొమ్మలు వేసుకోడానికి రూ.800 కోట్లు ఖర్చు పెట్టారు. రీసర్వే 2.0 ద్వారా భూవివాదాలు పరిష్కరించి రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నాం. శెట్టిపల్లి, కంగుమంది, అమలాపురం తదితర ప్రాంతాల్లో దశాబ్దాలుగా ఉన్న భూసమస్యల్ని పరిష్కరించాం. బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా రెవెన్యూ రికార్డులను భద్రంగా పెడుతున్నాం. ఇప్పటికే 5.5 లక్షల ఇళ్లను పూర్తి చేసి పేదలకు అందించాం. మరో 5.5 లక్షల ఇళ్లను త్వరలోనే నిర్మించి ఇస్తాం. పౌర సేవల్ని ప్రజలకు దగ్గర చేసేలా వాట్సప్ గవర్నెన్సు ద్వారా సేవలు అందిస్న?న్నాం. డీప్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక రోజులు, నెలలు పట్టాల్సిన పనులు ఇప్పుడు నిముషాల్లోనే పూర్తి అవుతోంది. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ వివిధ రంగాల్లో అభివృద్ధి సాధిస్తోంది. రాష్ట్రంగా మనం అవకాశాలను అందిపుచ్చుకోవాలి. విశాఖకు డేటా సెంటర్లు తీసుకువస్తే గొడ్డలి పార్టీ నీటి సమస్య అంటూ అడ్డుపడుతోంది. అమరావతి అంటే ఎడారి అని, శ్మశానమని, మావిగన్ అంటున్నారు. అడ్డంకులకు ఆగిపోను, అభివృద్ధి విషయంలో రాజీ పడను. నాయకుడంటే ప్రజల రేపటి భవిష్యత్ గురించి ఆలోచన చేయాలి. అందుకే 2047 స్వర్ణాంధ్ర లక్ష్యంతో పనిచేస్తున్నాను. సమాజంలో చిట్టచివరి వ్యక్తి జీవన ప్రమాణాలు పెంచేలా చర్యలు చేపట్టాం. ఆదాయం, ఆరోగ్యం, ఆనందం అనే విధానంతో ముందుకు వెళ్తున్నాం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశానికి మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ కృష్ణప్రసాద్, నేతలు మోపిదేవి వెంకటరమణ తదితరులు హాజరయ్యారు.

## డ్వాక్రా రుణంతో వ్యాపారం... వాట్సాప్‌తో విస్తరణ

**రూ.2 లక్షల రుణంతో విస్తరించిన వ్యాపారం :** డ్వాక్రా రుణంతో కిరాణా దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని నిర్వహిస్తున్నామని జి.శ్రీనివాసరావు, జి.జేజమ్మ దంపతులు ముఖ్యమంత్రికి వివరించారు. 2003 నుంచి పెయింటర్‌గా పనిచేస్తున్నారని శ్రీనివాసరావు వివరించారు. 2025 ఫిబ్రవరిలో రూ.1 లక్ష పెట్టుబడితో చిన్న దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నామని, అదే ఏడాది జూన్‌లో రూ.2 లక్షల గ్రూప్ లింకేజీ రుణం లభించడంతో వ్యాపారాన్ని కొంత విస్తరించినట్లు వారు తెలిపారు. సాంకేతికతను సైతం వినియోగించుకుంటూ తమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు జెజమ్మ, శ్రీనివాసరావు తెలిపారు. స్మార్ట్‌ఫోన్లు, వాట్సాప్ ద్వారా వినియోగదారుల నుంచి ఆర్డర్లు తీసుకుంటూ నెలవారీ కిరాణా సరుకుల అవసరాలను వినియోగదారులు వాట్సాప్‌లో పంపుతుండగా, ఆర్డర్ చేసిన సరుకులను తన భర్త వారి ఇళ్లకు వెళ్లి అందజేస్తున్నట్లు జేజమ్మ తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన 'వన్ ఫ్యామిలీ--వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం తనకు ఎలా స్ఫూర్తిని ఇచ్చిందో జేజమ్మ సీఎంతో పంచుకున్నారు.

**వ్యాపార నిర్వహణపై మహిళలకు సీఎం దిశానిర్దేశం :** తమ వ్యాపార ఆలోచనలు, అనుభవాలు, భవిష్యత్ ప్రణాళికలను డ్వాక్రా మహిళలు సీఎంకు వివరించారు. వివిధ రంగాల్లో ఉన్న వ్యాపార అవకాశాలను మహిళలు అన్వేషించి స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సీఎం చంద్రబాబు వారికి సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు వాట్సాప్ బిజినెస్‌పై ఉన్న అవగాహనను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాసరావు తండ్రి వెంకటరావుకు సీఎం చంద్రబాబు వృధ్యాప్య పింఛన్‌ను అందజేశారు. అనంతరం స్వయం సహాయక సంఘాల మహిళలతో కలిసి సీఎం ఫొటో దిగారు.

## గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమ

10 జిల్లాల పరిధిలోని మొత్తం 303 మండలాలు, 5,869 గ్రామాల్లో 201 క్లస్టర్ల ద్వారా అభివృద్ధి పనులు జరిగేలా ప్రణాళికలను సిద్ధం చేశారు.
ప్రస్తుతం 8.41 లక్షల హెక్టార్లలో ఉన్న ఉద్యాన సాగును మరో 6 లక్షల హెక్టార్లు విస్తరించి 14.41 లక్షల హెక్టార్లకు చేర్చనున్నారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్రస్తుతం 222 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 435 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రాజెక్టు కోసం పని చేయనున్నారు దీని ద్వారా సుమారు 9.6 లక్షల మంది రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరనుంది. కొత్తగా 9 లక్షల ఎకరాల ఆయకట్టును సాగులోకి తీసుకురావటంతో పాటు , 4.3 లక్షల ఎకరాలను స్థిరీకరించనున్నారు. ప్రభుత్వం వెచ్చించే రూ.40,352 కోట్లలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.20,884 కోట్లు, ఉద్యాన అభివృద్ధికి రూ.15 వేల కోట్లు, రహదారులకు రూ.4,562 కోట్లుగా విభజించుకుని ప్రణాళిక బద్ధంగా ప్రాజెక్టును అమలు చేయనున్నారు. దీంట్లో భాగంగా భారీ ఎత్తున ఇరిగేషన్ ప్రాజెక్టులు, డ్రిప్ ఇరిగేషన్, రహదారులు, లాజిస్టిక్స్ వంటి అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. రైస్ బౌల్‌గా పేరొందిన ఆంధ్రప్రదేశ్‌కు ఫ్రూట్ బౌల్ కీర్తి సాధించేలా గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రణాళిక రూపొందింది. మామిడి, అరటి, టమాటా, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, బెర్రీలు వంటి పంటలకు ప్రోత్సాహం ఇస్తూ ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఎగుమతులకు ప్రైవేట్ రంగంలో పెట్టుబడులు రాబట్టేలా చర్యలు చేపట్టనున్నారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ అమలు కోసం దాదాపు ఆరు నెలలుగా పెద్ద ఎత్తున కసరత్తు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ..వ్యవసాయ, ఉద్యాన, ఆర్థిక, ఇరిగేషన్ శాఖలతో నిరంతరం సమీక్షలు నిర్వహించారు. కేంద్రంతో సంప్రదింపులు జరిపి ఈ ప్రాజెక్టును సాకారం చేసుకున్నారు. రాయలసీమ రైజింగ్‌లో భాగంగా ఉద్యాన వెలుగులు నింపేలా గ్లోబల్ హార్టికల్చర్ హబ్ రూపుదిద్దుకుంటోంది.

**మదనపల్లెలో భారతదేశ తొలి ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ :** వ్యవసాయ, అనుబంధ రంగాలను లాభసాటిగా తీర్చిదిద్దేందుకు సరికొత్త వ్యవస్థ ఏర్పాటుకు వేదిక కానున్న ఆంధ్రప్రదేశ్. మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు కేంద్ర ఆర్థిక మంత్రి, సీఎం, డిప్యూటీ సీఎంలు శంకుస్థాపన చేయనున్నారు. పారిశ్రామికాభివృద్ధికి ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలో వ్యవసాయాభివృద్ధికి ఈ సంస్థ ఏర్పాటు కానుంది. సీఎం చంద్రబాబు సూచనలతో ఈ స్కూల్ ఏర్పాటు, నిర్వహణకు ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు రిలయన్స్ సంస్థ ముందుకు వచ్చింది. వ్యవసాయ రంగంలోని సవాళ్లకు పరిష్కారం చూపేలా రైతులకు టెక్నాలజీ ఆధారిత సలహాలు అందించనున్న ఈ స్కూల్...ఆధునిక సాంకేతికత, శాస్త్రీయ అధ్యయనం, డిజిటల్ అగ్రికల్చర్, ప్రెసిషన్ ఫార్మింగ్, క్రాప్ మానిటరింగ్, స్మార్ట్ ఇరిగేషన్, మార్కెట్ ఇంటెలిజెన్స్ వంటి అంశాలపై దృష్టి సారించనుంది. అగ్రిసైన్స్, డిజిటల్ టెక్నాలజీ, ఏఐ, క్లైమేట్ సైన్స్, అగ్రిబిజినెస్, ప్రాసెసింగ్, మార్కెట్ ఇంటెలిజెన్స్ సహా వివిధ అంశాల్లో ఐఎస్ఏ ద్వారా సేవలు అందుతాయి. డేటా డ్రివెన్ ప్రిడిక్టివ్ అగ్రికల్చర్ ద్వారా సంప్రదాయ వ్యవసాయాన్ని ఆధునీకరించేలా ఐఎస్ఏ సేవలు అందించనుంది. ఉద్యాన, వ్యవసాయ రంగాల్లో డిమాండ్ ఆధారిత పంటలను సాగు చేసేలా రైతులకు ఐఎస్ఏ నుంచి ఎప్పటికప్పుడు సూచనలు సలహాలు స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అందిస్తుంది. వ్యాల్యూచైన్, ధరలు, కార్పోరేట్ సంస్థలు, వ్యవస్థీకృత మార్కెట్లకు రైతులను, ఎఫ్ పీఓలను అనుసంధానించేలా ఐఎస్ఏ సేవలు అందిస్తుంది. వ్యవసాయరంగంలో స్టార్టప్ లకు ప్రోత్సాహంతో పాటు ఇంక్యుబేషన్ సెంటర్లను ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అభివృద్ధి చేస్తుంది.

## మమతా బెనర్జీ వర్గానికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

కేసు విచారణను వేగవంతం చేయాలని హైకోర్టును ఆదేశించింది.సుమారు రూ.804 కోట్లు కలిగి ఉన్న నాలుగు స్తంభింపచేసిన బ్యాంకు ఖాతాలను మమతా బెనర్జీ నేతృత్వంలోని టిఎంసి వర్గం నిర్వహించుకోవడానికి అనుమతించే మధ్యంతర ఉత్తర్వును జారీ చేసేందుకు కోల్‌కతా హైకోర్టు ఆగస్టు 27న నిరాకరించిన సంగతి తెలిసిందే.



## 'సంజీవని'పై 1.02 లక్షల మందికి శిక్షణ

1.02 లక్షల మందికి శిక్షణ ఇవ్వబోతున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. డిసెంబరు 10న సంజీవని సేవలను ట్రయల్ రన్ కింద ప్రారంభిస్తామని వెల్లడించారు, 2027 జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమలు చేస్తామని వెల్లడించారు. ఈమేరకు సంజీవని ప్రాజెక్టు అమలు కింద తీసుకుంటున్న చర్యలపై ఉన్నతాధికారులతో మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారంనాడు సమీక్ష జరిపారు. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 2,008 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సంజీవని సేవల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిలో 537 కేంద్రాల్లో సంజీవని సేవల కోసం ప్రత్యేక గదులను సిద్ధం చేస్తున్నారు. మరో 1,726 కేంద్రాల్లో నిరంతర విద్యుత్తు సరఫరా ఉండేలా యూపీఎస్ లేదా ఇన్వర్టర్ సదుపాయాలను కల్పించనున్నారు. ఈ ఏర్పాట్లను నవంబరు 30 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సంజీవని సేవలకు అవసరమైన కంప్యూటర్లు, ట్యాబ్లెట్లు, ప్రింటర్లు, స్కానర్లు, యూపీఎస్‌లు, వెబ్ కెమెరాలు, స్పీకర్లు, హెడ్‌ఫోన్లు తదితర పరికరాలను ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ద్వారా సమకూరుస్తున్నారు. సంజీవని ప్రాజెక్టు అమలులో భాగంగా రాష్ట్రంలోని వైద్య కేంద్రాల్లో 2,277 మంది రోగి సేవల సమన్వయకర్తల(సిపిహెచ్ ఓలు-పేషెంట్ కోఆర్డినేటర్లు) గుర్తించి నియమించే ప్రక్రియ చేపట్టారు. వీరు రోగులకు అందించే సేవల సమన్వయం, వైద్య సమాచార నమోదు, సంబంధిత ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల మధ్య సమన్వయం చేస్తారు. వీరిని ప్రధానంగా సామాజిక ఆరోగ్య అధికారులు, మధ్యస్థాయి ఆరోగ్య సేవల సిబ్బంది(డిజిగ్నేషన్ రాయాలి) నుంచి ఎంపిక చేస్తున్నారు. అదనంగా 76 మంది జిల్లా స్థాయి సేవల సమన్వయకర్తలను గుర్తించారు. ప్రాథమిక, ద్వితీయ, తృతీయ స్థాయిల్లోని ఆసుపత్రుల మధ్య సమన్వయం మెరుగుపరిచేందుకు వీరిని వినియోగించనున్నారు. సంజీవని సేవల అమలులో ఎదురయ్యే సమస్యలను గుర్తించడం, సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకోవడం, సేవలు సజావుగా సాగేలా చూడటం వీరి బాధ్యతల్లో భాగంగా ఉంటుంది. టాటా సంస్థ వారు సంజీవని కింద చేపట్టే కార్యక్రమాల వివరాలను అన్‌లైన్‌లో ఎలా నమోదు చేయాలి, రోగులకు ఎలాంటి సర్వీసులు అందించాలి, పరీక్షలు ఎలా జరపాలి, అపాయింట్‌మెంట్లు ఎలా ఇప్పించాలి, తీసుకోవాల్సిన ఇతర చర్యలపై శిక్షణా కార్యక్రమాల ద్వారా వైద్యులు, ఇతర సిబ్బందికి శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ కార్యక్రమాలను రాష్ట్ర, జిల్లా స్థాయుల్లో ప్రత్యక్షంగా, వర్చువల్ విధానంలో నిర్వహించనున్నారు. రోగి సేవల సమన్వయకర్తలకు అక్టోబరు 12 నుంచి నవంబరు 6 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. అనంతరం నవంబరు నెలలో వైద్యులు, వైద్య సహాయక సిబ్బంది, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ అందించనున్నారు. డిజిటల్ పద్ధతిలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం, పని విధానాలను అనుసంధానించడం, ఆరోగ్య గుర్తింపు సంఖ్య నమోదు చేయడం వంటి అంశాల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు శిక్షణ ఇవ్వనున్నారు. సంజీవని వ్యవస్థలో నిర్దేశించిన విధానాలను సిబ్బంది సక్రమంగా అనుసరించేలా శిక్షణ ఇస్తారు. మరోవైపు మంగళగిరి ఎయిమ్స్‌లో డాక్టర్ ఎన్టీఆర్ జిల్లా, కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు, కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల అధికారులకు సంజీవని అమలుపై శిక్షణ ఇచ్చారు. సంజీవని ప్రాజెక్టుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సుమారు 74 వైద్య అప్లికేషన్స్(పోర్టల్ ఇతర), అనుసంధానం చేయనున్నారు. తొలి దశలో వైద్య సేవలు, క్షేత్రస్థాయి కార్యకలాపాలు, పర్యవేక్షణకు అవసరమైన ముఖ్యమైన వ్యవస్థలను అనుసంధానించనున్నారు. ఈ ప్రక్రియను డిసెంబరు 10 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో నెక్స్ట్‌జెన్, ఈ-ఔషధి వంటి వ్యవస్థలు ఉన్నాయి. తదుపరి దశల్లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవల ట్రస్టు వ్యవస్థలు, ప్రజల ఆరోగ్య పరీక్షలకు సంబంధించిన వివరాలు, వైద్య నిర్ధారణ వ్యవస్థలు, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య సమాచార వేదికలను అనుసంధానించనున్నారు. ఈ అనుసంధానం ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, క్షేత్రస్థాయిలో నమోదు చేసిన సమాచారాన్ని వివిధ వైద్య సేవలకు ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. ఒకే సమాచారాన్ని పలుమార్లు నమోదు చేయాల్సిన అవసరాన్ని తగ్గించి, వైద్య సేవల నిర్వహణలో సమన్వయం పెంచడం ఈ చర్యల లక్ష్యం మంగళగిరిలో టాటా ఎండీ సంస్థ ఆధ్వర్యంలో 'స్టేట్ సంజీవని ఇంటిగ్రేటెడ్ అండ్ కంట్రోల్ సెంటర్ ' ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సంజీవని సేవల నిర్వహణను పర్యవేక్షించి, అవసరమైన సమన్వయం చేయనున్నారు. ఇందుకోసం 275 మంది సిబ్బందిని నియమించి, శిక్షణ ఇచ్చే ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లా స్థాయి సాంకేతిక సిబ్బందికి ప్రత్యక్షంగా, విధుల్లో భాగంగా శిక్షణ అందించనున్నారు. నవంబరు 30 నాటికి ఈ కమాండ్ కంట్రోల్ సేవలు వేగాన్ని అందుకుంటాయి

# క్రాఫ్ట్స్ కౌన్సిల్ సేవలు అభినందనీయం

## సంస్కృతి, వారసత్వ సంపద పరిరక్షణకు కృషి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:
రాష్ట్ర చేనేత, హస్తకళల వైభవాన్ని ముందుకు తీసుకెళ్లడంతో పాటు నేత కార్మికులు, కళాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్ర మాలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.విజయవాడలోని పీవీపీ స్క్వేర్ మాల్‌లో క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సీసీఏపీ) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చేనేత బజారును గురువారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. ఆయన సతీమణితో పాటు సీసీఏపీ కార్యదర్శి ఎస్.రంజన, వైస్ ఛైర్‌పర్సన్ బి.సుజాత తదితరులతో కలిసి ప్రారంభించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 1 నుంచి 4వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ బజారు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేనేత, హస్తకళలు మన సం స్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ముఖ్యంగా యువతలో చేనేత, హస్తకళలపై అవగాహన పెంచి, మన సంప్రదాయ కళలను భావితరాలకు అందించేందుకు ఇటువంటి కార్యక్ర మాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. చేతివృత్తులు, చేనేత వస్త్రాల సుస్థిర అభివృద్ధి కోసం ఎలాంటి లాభాపేక్షా లేకుండా క్రాఫ్ట్స్ కౌన్సిల్ కృషిచేస్తోందన్నారు. చేనేత కార్మికులు, హస్తకళాకారుల సంక్షేమం, డిజైన్ అభివృద్ధి, శిక్షణ, మార్కెటింగ్ తదితరాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వెంకటగిరి, పొందూరు, పెడన తదితర ప్రాంతాల చేనేత వస్త్రాలతో పాటు సంప్రదాయ కళాకృతులను ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. చేనేత, హస్తకళల పరిరక్షణ, ప్రోత్సాహానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలో విజయవాడలో జాతీయ సరస్ అజీవిక మేళా



జరగనుందని వెల్లడించారు. కొండపల్లి, ఏటికొప్పాక వంటి అపురూప కళా సంపద పరిరక్షణకూ విశేష కృషిచేస్తున్నట్లు పేర్కొ న్నారు. ప్రజలు చేనేత బజారును సందర్శించి చేనేత వస్త్రాలు, హస్తకళా ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా నేత కార్మికులు, కళాకారులకు చేయూ తనివ్వాలని కోరారు. కార్యక్రమంలో సీసీఏపీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సామాజిక భద్రతకు ఎన్టీఆర్ భరోసా

❖ జిల్లాలో 2,23,883 మంది లబ్ధిదారులకు రూ. 86.59 కోట్లు ❖ పెన్షన్ల పంపిణీలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:



స్వర్ణాంధ్ర @ 2047 లక్ష్యాల సాధనకు అనుగుణంగా పేదలకు సామాజిక భద్రత కల్పించేందుకు, పేదరిక నిర్మూలనకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ఫలాలను అర్హుల ఇంటివద్దకే అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.గురువారం విజయ వాడ అర్బన్, మధురానగర్ లో ఎన్టీఆర్ భరో సా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్న వారు వాటిని సద్వినియోగం చేసుకుని తమ కుటుంబాల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. జిల్లాలో 2,23,883 మంది లబ్ధిదారులకు రూ. 86.59 కోట్లు మేర పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, ఇతర లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఇంటిదగ్గరే పెన్షన్లు అందిస్తున్నట్లు వివరించారు. పంపిణీ సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

# స్నేహాలయ వృద్ధాశ్రమంలో ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి:






అంతర్జాతీయ వృద్ధుల దినోత్స వాన్ని పురస్కరించుకుని ఆకూరి శ్వేతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మచిలీపట్నంలోని స్నేహాలయ వృద్ధాశ్ర మంలో గురువారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి జిల్లా యువజన అధికారి బి. ప్రదీప్ కుమార్, మహిళా ఎస్‌ఐ జాస్మిన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పద్మావతి కళా శాల విద్యార్థినులు కూడా కార్యక్రమంలో పాల్గొని వృద్ధులతో ఆత్మీయంగా మమేకమయ్యారు.ఈ సంద ర్భంగా వృద్ధు లకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వారితో కలిసి కేక్ కట్ చేసి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు ఎదు ర్కొంటున్న సమస్యలు, వారి సంక్షేమం, సామాజిక భద్రత తదితర అంశాలపై అవగా హన కల్పిం చారు. వృద్ధులకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని నిర్వాహకులు భరోసా ఇచ్చారు. వృద్ధుల సంక్షే మం, వారి గౌరవప్రదమైన జీవనం కోసం ఆకూరి శ్వేతా ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తుందని ఫౌండే షన్ నిర్వాహకురాలు ఆకూరి శ్వేతా తెలిపారు. సమాజంలో వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని ఆమె కోరారు.కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, స్నేహాలయ వృద్ధాశ్రమ సిబ్బంది, పద్మావతి కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

# పెన్షన్ల పంపిణీలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శం : విక్కుర్తి

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ



పేదలకు పెన్షన్ల పంపిణీలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం అవనిగడ్డ ,కొత్తపేటలో విక్కుర్తి ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకొని, కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, డ్వాక్రా సంఘాల బలోపేతం వంటి పథకాల ద్వారా మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. ప్రతి పేద కుటుంబానికి అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని విక్కుర్తి పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా ప్రభుత్వం తమకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని, జీవనోపాధికి ధైర్యాన్ని అందిస్తోందని లబ్ధిదారులు తెలిపారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు,కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.



# వయోవృద్ధులు సమాజానికి అమూల్య సంపద

❖ వారి అనుభవాలు భావితరాలకు బంగారు బాటలు ❖ వయోవృద్ధుల రక్షణ, గౌరవం, సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటోంది
❖ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:
వయోవృద్ధులు సమాజానికి అమూ ల్య సంపద అని, వారి జీవిత అనుభ వాలు భావితరాలకు ఎంతో విలువైన మార్గదర్శకాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. వయోవృద్ధులు ఎలాంటి పరిస్థితుల్లోనూ అధైర్యపడవద్దని, వారి రక్షణకు చట్టపరమైన రక్షణలు ఉన్నాయని తెలిపారు.అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కార్యక్రమాన్ని గురువారం విజయవాడ బందర్ లాకులలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. డీసీపీ కేజీవీ సరిత, రెండో అదనపు జిల్లా జడ్జ్ ఎం.సునీల్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వయోవృద్ధులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని పేర్కొన్నారు. పిల్లలు తమ తల్లిదండ్రులను గౌరవించాలని.. వారిపట్ల ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని సూచించారు. వయోవృద్ధుల పట్ల నిర్లక్ష్యం లేదా చట్టవిరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. వయో వృద్ధుల జీవితానుభవాలు కుటుంబానికి, నేటి తరానికి, సమాజానికి ఎంతో విలువైనవని పేర్కొన్నారు. డీసీపీ కేజీవీ సరిత మాట్లాడుతూ వయోవృద్ధులు భావితరాలకు మార్గదర్శకులని, వారి అనుభవాలు సమాజానికి ఎంతో విలువైనవని తెలిపారు. వయోవృద్ధుల భద్రత, గౌరవం, సంక్షేమానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా 80 నుంచి 100 సంవత్సరాల వయ సున్న పలువురు వయోవృద్ధులతో పాటు వృద్ధాశ్రమాల నిర్వాహకులను ఘనంగా సన్మానిం చారు. జిల్లా వయోవృద్ధుల సంఘాలు, వృద్ధాశ్రమాలకు చెందిన సుమారు 200 మంది వయోవృద్ధులు కార్య క్రమంలో పాల్గొన్నారు.కార్యక్రమాన్ని ఎన్టీఆర్ జిల్లా విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వాడ్రేవు కామరాజు, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షులు వేమూరి బాబూరావు, కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**అర్హులందరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందాలి**
**'పేదల సేవలో 2.0'లో భాగంగా డోకిపర్రులో లబ్ధిదారురాలికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందజేసిన కలెక్టర్ డీకే బాలాజీ**



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి:
అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను నేరుగా అందించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు.'పేదల సేవలో 2.0' కార్యక్రమంలో భాగంగా గురువారం గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు గ్రామంలో కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కనుమూరి సారమ్మకు ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను స్వయంగా అందజేశారు.అనంతరం సారమ్మతో కలెక్టర్ మాట్లాడి ఆమె కుటుంబ పరిస్థితులు, పింఛన్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు ప్రయోజనాలు సకాలంలో అందుతున్నాయా లేదా అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలపై సమాచారం చేరేలా గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లడంతో పాటు ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు.కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



# పేద కుటుంబాల జీవనోపాధికి 'మార్గదర్శి బంగారు కుటుంబం'

❖ డోకిపర్రులో 70 కుటుంబాలకు సీఎస్ఆర్ నిధులతో ఆర్థిక చేయూత
❖ లబ్ధిదారులతో ముఖాముఖిగా మాట్లాడిన కలెక్టర్ డీకే బాలాజీ

గుడ్లవల్లేరు, ప్రజాభూమి ప్రతినిధి :
పేద కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడంతో పాటు వారికి స్థిరమైన జీవనోపాధి కల్పించి స్వయం సమృద్ధి సాధించేలా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలకు కార్పొరేట్ సంస్థలు సీఎస్ఆర్ నిధుల ద్వారా సహకారం అందించడం అభినందనీయమని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు.గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు గ్రామంలో 'P4 మార్గదర్శి బంగారు కుటుంబం' కార్యక్రమంలో భాగంగా మెగా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థ దత్తత తీసుకున్న కుటుంబాల జీవనోపాధి కార్యక్రమాలను గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సంద ర్భంగా అధికారులు వివరాలను కలెక్టర్‌కు వెల్లడించారు.గ్రామంలోని సుమారు 70 పేద కుటుం బాలను సంస్థ దత్తత తీసుకుని, ఆయా కుటుంబాల ఆర్థిక పరిస్థితి, ఆసక్తి, నైపుణ్యాలను పరిగణనలోకి తీసుకుని ఒక్కో కుటుంబానికి రూ.35 వేల నుంచి రూ.70 వేల వరకు ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సహాయంతో పలువురు లబ్ధిదారులు కూరగాయల వ్యాపారం, కిరాణా దుకాణాలు, గొర్రెల పెంపకం, వస్త్ర వ్యాపారం తదితర చిన్నతరహా జీవనోపాధి యూనిట్లను ఏర్పాటు చేసుకున్నట్లు వివరించారు.




**లబ్ధిదారులతో కలెక్టర్ ముఖాముఖి...** డోకిపర్రు స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర వ్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ డీకే బాలాజీ లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కుటుంబాలకు అందిన ఆర్థిక సహాయాన్ని ఏ విధంగా విని యోగించారు, ప్రస్తుతం వ్యాపారం ద్వారా ఎంత మేర ఆదాయం లభి స్తోంది, ఎదురవుతున్న సమస్యలు, భవిష్యత్తులో వ్యాపారాన్ని విస్తరించేందుకు అవసరమైన సహాయం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.జీవనోపాధి కార్యక్రమాలను కేవలం ఆర్థిక సహాయానికే పరిమితం చేయకుండా నైపుణ్యాభివృద్ధి, మార్కెటింగ్ సదుపాయాలు, బ్యాంకింగ్ సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అనుసంధానం, అవసరమైన సాంకేతిక సహకారం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఏర్పాటు చేసిన జీవనోపాధి యూనిట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, లబ్ధిదారులు వాటిని విజయవంతంగా నిర్వహించేలా అవసరమైన సహకారం అందించాలని సూచించారు. పేద కుటుంబాల అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు కార్పొరేట్ సంస్థలు సీఎస్ఆర్ నిధులతో సహకరించడం ద్వారా మరిన్ని కుటుంబాలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయడానికి అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

**లబ్ధిదారుల జీవనోపాధి యూనిట్ల పరిశీలన...** అనంతరం కలెక్టర్ డీకే బాలాజీ ఐదు లబ్ధిదారు కుటుం బాల ఇళ్లకు వెళ్లి వారు ఏర్పాటు చేసుకున్న జీవనోపాధి యూనిట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. వ్యాపారం ప్రారంభించిన తర్వాత ఆదాయంలో వచ్చిన మార్పులు, ఎదురవుతున్న ఇబ్బందులు, కుటుంబ ఆర్థిక పరిస్థితిలో చోటుచేసుకున్న మార్పులను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ల బ్ధిదారులు తమకు అందిన ఆర్థిక సహాయంతో ప్రా రంభించిన వ్యాపా రాలు, వాటి ద్వారా పొం దుతున్న ఆదాయం, భవిష్యత్తులో వ్యా పారా న్ని విస్తరించేందుకు అవసరమైన సహాయాన్ని కలెక్టర్‌కు వివరించారు.ఒక్కో కుటుంబానికి అనువైన జీవనోపాధి మార్గాన్ని గుర్తించి, అవసరమైన శిక్షణ, ఆర్థిక సహాయం, మార్కెటింగ్ అవకాశాలు కల్పించేలా సంబంధిత శాఖలు సమ న్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడంలో ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, స్వయం సహాయక సంఘాలు సమన్వయంతో పనిచేస్తే మరిన్ని కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి కల్పించవచ్చని కలెక్టర్ తెలిపారు.కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మెగా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు, గ్రామస్థాయి సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.





ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

శుక్రవారం 2 అక్టోబరు 2026

# పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- దేశాభివృద్ధికి మోదీ, రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు, పవన్, లోకేష్ కృషి.
- కొత్తపేట నియోజకవర్గంలో 41,248 మందికి రూ.18.11 కోట్ల పింఛన్లు.
- కొత్తగా మంజూరైన 56 స్పౌజ్ పింఛన్ల పంపిణీ
- లబ్ధిదారులతో ముఖాముఖిలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

దేశాభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కట్టుబడి పనిచేస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. కొత్తపేట మండలం బొరుసువారి సావరంలో గురువారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. అనంతరం 'పేదల సేవలో కూటమి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పింఛన్లను ప్రతి నెలా ఒకటో తేదీన అందించడంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ఒకటో తేదీన సెలవు వస్తే ముందురోజే పింఛన్ అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొత్తపేట నియోజకవర్గంలో 41,248 మంది పింఛన్ లబ్ధిదారులకు ప్రతినెలా రూ.18.11 కోట్ల మేర పింఛన్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. దివ్యాంగుల పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచినట్లు తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పింఛన్ల కోసం నూతనంగా దరఖాస్తులు స్వీకరించామని,



అర్హత ఉన్న వారికి త్వరలో కొత్త పింఛన్లు మంజూరవుతాయని చెప్పారు. ఈ నెల కొత్తగా మంజూరైన 56 స్పౌజ్ పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల లబ్ధిదారులతో మాట్లాడి పథకాల అమలుపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. మహిళలకు భరోసా కల్పించే స్త్రీ శక్తి పథకం ద్వారా కలుగుతున్న ప్రయోజనాలను కూడా అడిగి తెలుసుకున్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంటిలో చదువుతున్న అర్హులైన పిల్లలకు ప్రయోజనం కల్పిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రైతుల సంక్షేమానికి అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు డ్వాక్రా వ్యవస్థ కీలకంగా నిలిచిందని, మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలపై కూడా ఎమ్మెల్యే విమర్శలు చేశారు. పింఛన్ల పెంపు, రైతు భరోసా, అమ్మఒడి, జాబ్ క్యాలెండర్ తదితర అంశాల్లో గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. దీనికి భిన్నంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బాలయోగి సేవలు చిరస్మరణీయం

75వ జయంతి సందర్భంగా ఘన నివాళులు.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

కోనసీమ ముద్దుబిడ్డ, కోనసీమ ప్రగతి ప్రదాత, మాజీ లోక్‌సభ స్పీకర్ స్వర్గీయ జి.ఎం.సి. బాలయోగి 75వ జయంతి సందర్భంగా రావులపాడు గ్రామంలో ఆయనకు ఘన నివాళులు అర్పించారు. గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు కలిసి బాలయోగి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు రావులపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ, కోనసీమ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి బాలయోగి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితరులకు ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రతా పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఎన్టీఆర్ భరోసా.. కూటమి ప్రభుత్వమే అండ

-త్వరలో అర్హులందరికీ కొత్త పెన్షన్లు: ఎమ్మెల్యే బడేటి చంటి

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు



ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతో పేదలకు ఎనలేని భరోసా లభిస్తోందని జిల్లా టీడీపీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ప్రతినెలా మొదటి తేదీనే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందిస్తూ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. స్థానిక 29వ డివిజన్ కుమ్మరి రేవులో గురువారం నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆర్టీసీ విజయవాడ జోన్-2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడుతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ సొమ్ములు అందజేసి, వృద్ధులు, దివ్యాంగులు, బెడ్ పేషెంట్ల బాగోగులను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం మేరకు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. త్వరలోనే అర్హులైన వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని తెలిపారు. కుమ్మరి రేవులోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, కచ్చా డ్రైన్ల ఏర్పాటుపై అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. స్థానికులకు పట్టాల పంపిణీ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, జనసేన నగర అధ్యక్షులు వీరంకి పండు, టీడీపీ ప్రధాన కార్యదర్శి రెడ్డి నాగరాజు, మాజీ కార్పొరేటర్ వుచుల సన్నీ చైతన్య, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు కూటమి ప్రభుత్వమే కొండంత అండ

-దెందులూరులో 28 నూతన స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే చింతమనేని

ప్రజాభూమి ప్రతినిధిదెందులూరు



భర్తను కోల్పోయిన నిరుపేద మహిళలకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం స్పౌజ్ పింఛన్లు మంజూరు చేస్తోందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. గురువారం దెందులూరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని నూతనంగా మంజూరైన 28 స్పౌజ్ పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భర్త మరణించిన వెంటనే తదుపరి నెల నుంచే భార్యకు స్పౌజ్ పింఛన్ అందేలా నిబంధనలను సులభతరం చేశామని తెలిపారు. దెందులూరు నియోజకవర్గంలో 34,565 మంది లబ్ధిదారులకు రూ.15.57 కోట్లకు పైగా పింఛన్ మొత్తాన్ని గురువారం ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తున్నట్లు చెప్పారు. పెంచిన సామాజిక పింఛన్లు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసాతో పాటు ఆత్మగౌరవాన్ని కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన ఉత్పత్తుల ప్రదర్శనను ఎమ్మెల్యే పరిశీలించి మహిళలను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, టీడీపీ నాయకులు, కూటమి నేతలు, అధికారులు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్‌క్రాస్ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణానికి ఫుడ్ ఫెస్టివల్

ప్రజాభూమి ప్రతినిధిఏలూరు

ఆశ్రమం హాస్పిటల్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణానికి సహాయార్థం హెలపురి మహిళ ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల రుచికరమైన ఆహార పదార్థాలను ఏర్పాటు చేసి, ఫుడ్ ఫెస్టివల్ ద్వారా వచ్చే ఆదాయాన్ని హాస్టల్ నిర్మాణానికి వినియోగించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆశ్రమం హాస్పిటల్ డైరెక్టర్ రతీదేవి, సీఈవో హనుమంతరావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. మహిళల కోసం వసతి సదుపాయం కల్పించేందుకు చేపడుతున్న హాస్టల్ నిర్మాణానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఫుడ్ ఫెస్టివల్‌కు పలువురు మహిళలు, ఆసుపత్రి సిబ్బంది, సందర్శకులు హాజరై వివిధ రకాల ఆహార పదార్థాలను కొనుగోలు చేసి కార్యక్రమానికి తమ వంతు సహకారం అందించారు. హాస్టల్ నిర్మాణానికి సహాయపడే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది.



## విలువలకు పట్టం కట్టిన మహా నాయకుడు బాలయోగి

- నేటి యువత ఆయన ఆదర్శాలను పుణికిపుచ్చుకోవాలి
- కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

కోనసీమ ముద్దుబిడ్డ, మాజీ లోక్‌సభ స్పీకర్ గంటి మోహనచంద్ర బాలయోగి రాష్ట్ర, దేశ రాజకీయాలపై వేసిన ముద్ర చెరగనిదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బాలయోగి 75వ జయంతిని పురస్కరించుకుని కొత్తపేట బస్టాండ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విలువలతో కూడిన రాజకీయాలకు కట్టుబడి, తన నడవడిక, ప్రవర్తనతో దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన మహానాయకుడు బాలయోగి అని కొనియాడారు. ప్రజా జీవితంలో ఆయన పాటించిన విలువలు, క్రమశిక్షణ, అంకితభావం నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు. కోనసీమ అభివృద్ధికి బాలయోగి విశేష కృషి చేశారని, ఆయన చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు నేటికీ గుర్తు చేసుకుంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. పదవులు శాశ్వతం కాదని, వ్యక్తి తన వ్యక్తిత్వం, నడవడిక, ప్రజలకు చేసిన సేవల ద్వారా శాశ్వతంగా గుర్తుండిపోతాడని బాలయోగి తన జీవితం ద్వారా నిరూపించారని అన్నారు. లోక్‌సభ స్పీకర్‌గా బాలయోగి వ్యవహరించిన తీరు ఆయన రాజకీయ విలువలకు నిదర్శనమని బండారు సత్యానందరావు పేర్కొన్నారు. వాజపేయి ప్రభుత్వం ఒక్క ఓటుతో అవిశ్వాస తీర్మానంలో నిలిచిన సందర్భంలో అప్పటి కాంగ్రెస్ ఎంపీ గిరిధర్ గమాంగ్ ఓటు విషయంలో బాలయోగి రాజ్యాంగపరమైన విజ్ఞతతో వ్యవహరించారని గుర్తు చేశారు. తన నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం పడిపోయే పరిస్థితి వచ్చినప్పటికీ, స్పీకర్‌గా నిష్పాక్షికత, సభా సంప్రదాయాలు, విలువలకు బాలయోగి ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. రాజకీయాల్లో విలువలు, ప్రజాసేవ, నిబద్ధతకు బాలయోగి ప్రతీకగా నిలిచారని ఎమ్మెల్యే అన్నారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలను నేటి యువత పుణికిపుచ్చుకుని ప్రజా జీవితంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, బాలయోగి అభిమానులు తదితరులు పాల్గొని ఆయనకు ఘన నివాళులర్పించారు.

## ఈనెల 5 వ తేదీన భవన నిర్మాణ కార్మికులధర్నా

ఐఎఫ్ టియు నేత కె.వి.రమణ.



ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం.

భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 5వ తేదీన ఏలూరులో తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.రమణ పిలుపునిచ్చారు. మండలం లోని దొరమామిడిలో ఆదర్శ తాపీ వర్కర్స్ యూనియన్ (ఐ ఎఫ్ టి యు అనుబంధం) సమావేశం యూనియన్ అధ్యక్షుడు ముకుందం నారాయణస్వామి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ముద్రించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఐ ఎఫ్ టి యు అనుబంధం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవి రమణ మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా గతంలో అమలు చేసిన 14 సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల ఐదో తారీఖున రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేయాలని ప్రగతశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని అన్నారు. ఈనెల ఐదో తారీకు ఏలూరు జిల్లా లేబర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో అధిక సంఖ్యలో కార్మికుల పాల్గొవాలని పిలుపునిచ్చారు. నిర్మాణ కార్మికులందరూ పాల్గొని ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రమణ కోరారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి కలపాల రవి. పాకిరం రాజేష్ .షేక్ బాజీ .కొండపల్లి శ్రీనివాస్ .పల్లి సుబ్బారావు. రెడ్డి సురేష్ కొప్పాల నాగరాజు దొంగ వరప్రసాద్ షేక్ మొహిద్దీన్ భాష టేకు మంగారావు, నాగరాజు, గురుగుంట్ల బాబుల్ రెడ్డి కలపాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## పైలట్...స్మిత్ భారతీయుడు కావటం గర్వకారణం.

ప్రజాభూమి బ్యూరో-ఏలూరు జిల్లా.



పై దుబాయ్ ఎయిర్ లైన్స్ బోయింగ్ విమాన పైలట్‌గా ఉండి, ప్రాణాలకు తెగించి 174 మంది ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన స్మిత్ మచ్చార్ పై కేంద్ర ప్రభుత్వ పారిశ్రామిక మండలి మాజీ సభ్యులు పులి శ్రీరాములు ప్రశంసల వర్షం కురిపించారు. ఒమన్ దేశ కో-పైలట్ విమానాన్ని కూల్చటానికి చేస్తున్న ప్రయత్నాన్ని అడ్డుకుని, కత్తిపోట్లకు గురైనప్పటికీ, కూలిపోతున్న విమానాన్ని నియంత్రించి ఆత్మస్థైర్యంతో సురక్షితంగా సౌదీ విమానాశ్రయంలో దింపిన పైలట్ స్మిత్ ని రియల్ హీరోగా పులి అభివర్ణించారు. ప్రపంచ మంతా స్మిత్‌ను అభినందించటం భారతీయులకు గర్వకారణమన్నారు. 11 సంవత్సరాలు స్పైస్ జెట్ లో పనిచేసి, 9,500 గంటలు విమానం నడిపిన, బోయింగ్ 737 పైలట్ల కు శిక్షణ నిచ్చిన స్మిత్ లాంటి సమర్థుడు, మేధావి విదేశీ విమానయాన సంస్థ పై దుబాయ్ లో ఎందుకు చేరాడో? భారతీయ మేధావులు విదేశాలకు వలస ఎందుకు వెళ్తున్నారో ఆలోచించవలసిన సమయం ఆసన్నమైందని పులి శ్రీరాములు పేర్కొన్నారు.

## ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు.



ప్రజాభూమి బ్యూరో-ఏలూరు జిల్లా

ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్ ఆదేశాలపై ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు, సిబ్బంది సంయుక్తంగా ఏలూరులో ఆటోల నిబంధనలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రెండు రోజుల పాటు చేపట్టిన ఈ తనిఖీల్లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తున్న ఆటోలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆటోలపై ప్రత్యేక డ్రైవ్ లో ఆటోలకు సరైన నెంబర్ ప్లేట్లు లేని వాటిని గుర్తించి, నిబంధనల ప్రకారం ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఆటోల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను, పాఠశాల విద్యార్థులను తరలిస్తున్న ఆటో డ్రైవర్లను హెచ్చరించి, భద్రతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఆటో నడుపుతున్న డ్రైవర్ల వద్ద సరైన డ్రైవింగ్ లైసెన్స్ ఉందా లేదా అని పరిశీలించారు. ఆటో డ్రైవర్లు విధిగా యూనిఫాం ధరించేలా నిబంధనలను గుర్తుచేశారు. ఆటోకు సంబంధించిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, పర్మిట్ వంటి అన్ని రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న పాత ట్రాఫిక్ చలానాలను ఆటో డ్రైవర్ల చేత కట్టించి, ఇకపై నిబంధనలు ఉల్లంఘించకుండా తగు హెచ్చరికలు జారీ చేశారు. క్యూ ఆర్ కోడ్ కలిగిన నెంబర్ ప్లేట్ లేని ఆటో లు పైనా కూడా చర్యలు తీసుకొన్న ఏలూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్. తాగి వాహనాలు నడపడంపై మరియు రాత్రి సమయాల్లో ఇతరులకు ఇబ్బంది కలిగించే అదనపు ఎల్ఈడీ/హై బీమ్ లైట్ల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల సందర్భంగా ప్రయాణికుల భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు హెచ్చరించారు.

## వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల పట్ల కూటమి ప్రభుత్వం మానవత్వం మంత్రి నిమ్మల రామానాయుడు

దగ్గులూరు లో ఇంటికి వెళ్లి పెన్షన్ సొమ్ము అందజేత.



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అండగా నిలుస్తూ కూటమి ప్రభుత్వం మానవత్వంతో పనిచేస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు మండలం దగ్గులూరులో గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛను సొమ్మును అందజేశారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు ముఖ్యంగా మహిళలు పాల్గొన్నారు. వారితో మమేకమై సమస్యలను పరిష్కార దిశగా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మంత్రికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా అత్యధిక మొత్తంలో సామాజిక భద్రత పింఛన్లను ఆంధ్రప్రదేశ్‌లో అందిస్తున్నామని తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలి నెలలోనే వృద్ధులు, వితంతువుల పింఛనును రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచి అందించారని చెప్పారు. దివ్యాంగుల పింఛనును రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచడంతో పాటు అర్హతను బట్టి రూ.15 వేల వరకు అందిస్తున్నట్లు తెలిపారు. పాదయాత్రలో జగన్ వృద్ధులు, వితంతువుల పింఛనును రూ.వెయ్యి పెంచుతామని చెప్పి, అధికారంలోకి వచ్చాక ఐదేళ్లు పట్టిందని మంత్రి విమర్శించారు. దివ్యాంగుల పింఛనును ఒక్క రూపాయి కూడా పెంచని గత ప్రభుత్వానికి, కూటమి ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనించాలని అన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ , మోదీలు మానవత్వంతో పనిచేస్తున్నారన్నారు. చేనేత కార్మికుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మంత్రి తెలిపారు. చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, పవర్ లూమ్‌లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. సంక్షేమ పథకాల ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో దగ్గులూరు గ్రామంలో అనేక సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చేపట్టామని, మళ్లీ కోటమీ ప్రభుత్వం లోను అభివృద్ధి పనులు ముందుకు వెళ్తున్నాయన్నారు. డ్రైన్లకులకు సంబంధించి ప్రాధాన్యత నిచ్చేలా అధిక నిధులు మంజూరు చేస్తానని మంత్రి రామానాయుడు తెలిపారు. దగ్గులూరు గ్రామం టిడిపికి కంచుకోటని, తనకు గౌరవం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ఉన్నమట్ల కబర్ధి, పాముల రజని కుమార్, కలిదిండి రామచంద్ర రాజు, కామి శెట్టి అయ్యప్ప నాయుడు, సమంత పుడి అవతార్ రాజు, వాస మహేష్, నేక్కింటి ఆదినారాయణ, మల్ల వెంకట మురళి, ఎల్లప్పు లోకేష్, సాగ సత్యనారాయణ, అందే కోటి వీరభద్రం, బొర్ర మాధవి, కురేళ్ల కోటేశ్వరి, బొప్పే నానాజీ, గ్రామ ప్రజలు తదితర నాయకులు పాల్గొన్నారు.

# పీ-4 కార్యక్రమం అమలు, వస్తున్న ఫలితాలు చరిత్రాత్మకం

ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

నూజివీడు మండలం పల్లెర్లమూడి గ్రామంలో గురువారం పేదల సేవలో ఎన్టీఆర్ బరోసా సామాజిక పింఛన్లు పంపిణీ అనంతరం, రెండున్నర ఏళ్లలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో ఏ మార్పు వచ్చింది, గ్రామాలకు ఏమి కావాలి, ప్రజలకు ఉన్న సమస్యలు, ప్రజలతో అవగాహన సదస్సులు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు ప్రకారం పీ-4 కార్యక్రమం అవగాహన సదస్సులో మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సంయుక్తంగా పాల్గొన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ఇతర సమస్యలుపై గ్రామస్తులు తమ అభిప్రాయాలను, సమస్యలను వెల్లడించారు. దీంతో స్పందించిన మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సంయుక్తంగా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అర్హులందరికీ అందిస్తామని, అభివృద్ధి కార్యక్రమాలు దశలు వారీగా పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. బంగారు కుటుంబాలను దత్తత చేసుకున్న మార్గదర్శులను మంత్రి, జిల్లా కలెక్టరు సంయుక్తంగా పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆశయాలు ప్రకారం సమాజంలో వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా పైకి తీసుకురావడానికి పీ-4 కార్యక్రమంకు మొదట్లో ఎన్నో విమర్శనలు వచ్చాయని, ఫలితాలు ఊహించిన దానికన్నా ఎక్కువగా వచ్చాయని దేశంలో అన్ని రాష్ట్రాలు ఈ కార్యక్రమాలు




వైపు చూసి, ఆలోచన చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి ఏ నిర్ణయం తీసుకున్నను నిరుపేదలకు ఒక వరం అని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కేవలం తాత్కాలిక సాయంగానే కాకుండా, ప్రతి నిరుపేద కుటుంబం ఆర్థికంగా స్థిరపడి, స్వంతంగా ఆదాయ వనరులను సృష్టించుకునేలా మార్గదర్శకత్వం చేయడం దీని ప్రధానఉద్దేశమని అన్నారు. సదస్సులు నిర్వహణ, పింఛన్ల పంపిణీతో పాటు గ్రామ/వార్డు సచివాలయాలు పరిధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ పీ-4 అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. పీ-4 కార్యక్రమం ద్వారా అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి, వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వ చేయూతను ఎలా ఉపయోగించు కోవాలో, మార్గదర్శిలకు వివరించి, బంగారు కుటుంబాలను దత్తత కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలన్నదే ఉద్దేశమని అన్నారు. పారదర్శక గృహనిర్మాణంలో రాష్ట్రంలో అర్హులైన ప్రతి నిరుపేదలకూ, పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వడమే తమ శాఖ ప్రధాన బాధ్యత అని, కాలనీల్లో మౌలిక వసతులు కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. సమాజంలోని దాతలు, పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములై పేదకుటుంబాలకు చేయూతనివ్వాలని పిలుపు నిచ్చారు. గత ప్రభుత్వ నేతలకు అభివృద్ధి, సంక్షేమం, ఇటువంటి మంచి కార్యక్రమాలు గురించి అసలు తెలియదని, వాళ్ళకు అరాచకం, విధ్వంసం మాత్రమే తెలుసునని అన్నారు. రెండున్నర ఏళ్లలో నూజివీడు నియోజక వర్గంలో 41 వేల మందికి వివిధ రకాలు పెన్షన్లు రూ 495.20 కోట్లు పింఛన్లు అందించామని, గత ప్రభుత్వం రూ 337.87 కోట్లు మాత్రమే ఇచ్చారని, అన్ని పథకాలు రెండంతలు పైగా నిరుపేదలకు లబ్ధిఅందిస్తున్నామని బహిరంగ చర్చకు రావాలని గత పాలకులకు మంత్రి సవాల్ విసిరారు. జిల్లాలో 4871 మంది మార్గదర్శిలు 44,119 బంగారు కుటుంబాలకు స్వీకరించారని తెలిపారు, రానున్న కాలంలో ఈ సంఖ్యలు మరింత పెరిగేలా మనమంతా కలిసికట్టుగా కృషిచేద్దామని అన్నారు. నూజివీడు వర్గంలో 7,706 మార్గదర్శిలు 11,758 బంగారు కుటుంబాలుగా స్వీకరించారని, నిరుపేదలు పీ-4 లో ధరఖాస్తులు చేసుకుంటే శక్తివంచన లేకుండా మార్గదర్శిలు ముందుకు వచ్చేలా మా వంతు కృషిచేసి, బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులకు అందించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, అభివృద్ధి కార్యక్రమాలు దశలు వారీగా పూర్తి చేస్తామని అన్నారు. రెండున్నర సంవత్సరాలలో జిల్లాలో 407 కిలోమీటర్లు రహదారులు ఏర్పాటు చేసుకున్నామని, పల్లె పండుగ 3.0 జిల్లాలో రూ 155 కోట్లతో గ్రామసీమలు రూపురేఖలు మారపోతున్నాయని అన్నారు. వచ్చే సంవత్సరం మార్చి నాటికి భూసమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుటకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సమాజంలోనిరుపేదటుంబాలను గుర్తించి, వారిని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడమే పీ-4 కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అన్నారు. క్షేత్రస్థాయిలో అర్హులైన పేదకుటుంబాలను గుర్తించి, వారికి అవసరమైన వనరులు, శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యతను అధికారులు చిత్తశుద్ధితో నిర్వహించాలని అన్నారు. దాతలు, ప్రైవేటు భాగస్వామం విధానంలో సమాజంలోని దాతలు, పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిపేద కుటుంబాలకు చేయూతనిచ్చేలా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, నియోజకవర్గం ప్రత్యేక అధికారి రవికుమార్, డిఆర్డిఏ అడిషనల్ పిడి ఇ.అనిత, డియల్డివో పి.అనురాధ, డివిజనల్ పంచాయతీ అధికారి యం.పి. యన్.సుందరి, తహాశీల్దారు షేక్ సంసిద్దీన్, యంపిడివో పి.సాంబశివ రావు, వివిధ శాఖలు అధికారులు, స్థానిక నాయకులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 15-20 ఏళ్లు కూటమి ప్రభుత్వం ఉంటేనే రాష్ట్రానికి సమగ్ర అభివృద్ధి

-ఎంపీ పుట్టా మహేష్ కుమార్



ప్రజాభూమి ప్రతినిధి-చింతలపూడి

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలంటే కూటమి ప్రభుత్వానికి ప్రజల మద్దతు అవసరమని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అయ్యపరాజుగూడెం నుంచి కలరాయణగూడెం వరకు రూ.2.50 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం అయ్యపరాజుగూడెంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ వర్గాలకు నెలకు రూ.4 వేల నుంచి రూ.15 వేల వరకు పెన్షన్లు అందిస్తూ, ఏటా రూ.32 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, స్మశానవాటికల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు త్వరలో ప్రారంభంచింతలపూడి ఎత్తిపోతల పథకానికి అడ్డంకులు తొలగిపోయాయని, త్వరలోనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీ తెలిపారు. ప్రాజెక్టు పూర్తయితే చింతలపూడి, నూజివీడు మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందడంతో పాటు చెరువులు నిండుతాయని, భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్యలు కూడా పరిష్కారమవుతాయని పేర్కొన్నారు.

## బుట్టాయిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి

### ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం

బుట్టాయగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణం ప్రారంభమై ఐదేళ్లు గడుస్తున్నప్పటికీ, నేటికీ పూర్తి కాకపోవడం ప్రభుత్వ విద్యా రంగంపై ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ విమర్శించారు. గిరిజన ప్రాంతాల్లో విద్యా సంస్థల సందర్శనలో భాగంగా గురువారం పాఠశాలలు, కళాశాలలు హాస్టళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రసన్న కుమార్ మాట్లాడుతూ బుట్టాయగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని అన్నారు. కళాశాల విద్యార్థుల వసతి గృహం కూడా తాత్కాలిక భవనంలో నడుస్తుందని తెలిపారు. ఇటు కళాశాల



విషయంలోనూ హాస్టల్ విషయంలోను విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. .ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి కళాశాల భవనాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. గతంలో వసతి గృహం ఉన్న పాత భవనం స్థానంలోనే కొత్త భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు అందుబాటులో ఉండే ప్రాంతంలో వసతి గృహం నిర్మించాలని కోరారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవాలి తప్ప, వారికి ఇబ్బందులు కలిగించే విధంగా నిర్మాణాల ప్రదేశాలను నిర్ణయించకూడదు. ప్రజాధనంతో చేపట్టే భవన నిర్మాణాలు విద్యార్థులకు ఉపయోగపడేలా అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే జోక్యం చేసుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు, బాలుర వసతి గృహాన్ని పాత భవనం ఉన్న ప్రదేశంలోనే నిర్మించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే విద్యార్థులను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ప్రసాద్, సూరిబాబు, రాష్ట్ర కమిటి సభ్యులు లోవరాజు, ఏలూరు జిల్లా కన్వీనర్ అమూల్య, నాయకులు పవన్, దినేష్, సతీష్ పాల్గొన్నారు.

## అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మెడికల్ క్యాంపు.

ప్రజా భూమి బ్యూరో-ఏలూరు జిల్లా.

జాతీయ న్యాయసేవాధికార సంస్థ న్యూఢిల్లీ , రాష్ట్రన్యాయ సేవాధికార సంస్థ, అమరావతి వారి ఆదేశాలు ప్రకారం, గురువారం అంతర్జాతీయ వృద్ధులు దినోత్సవం సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి యన్.శ్రీలక్ష్మి ప్రభుత్వ పట్టణ నిరాశ్రయులు వసతి గృహం నందు ఏలూరు జిల్లా మెడికల్ అండ్ హెల్త్ కార్యాలయము వారి సహకారంతో మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యన్.శ్రీలక్ష్మీ మాట్లాడుతూ నిరాదారానికి గురై ఆశ్రమంలో ఉంటున్న వృద్ధులు యొక్క సంక్షేమం నిమిత్తం, వారి ఆరోగ్యం పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మెడికల్ నిర్వహించామని ఈరోజు సాధారణ, మానసిక, కంటి, దంత



వైద్యశిబిరాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. వృద్ధులను పరీక్షించి అవసరమైన మందులు, కళ్ళజోడులను సరఫరా చేయడం జరుగుతుందని తెలియజేశారు. అలాగే మరి ఇతర న్యాయ సహాయం కావాల్సిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థను నేరుగా కాని 15100 ద్వారా సంప్రదించవచ్చని తెలియజేశారు. జిల్లా వైద్యాధికారి శ డా.యు.శోభ మాట్లాడుతూ ఈ నిరాశ్రయులను గృహము నందు మెడికల్ క్యాంపును నిర్వహించడమే కాకుండా తరచుగా వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను సరఫరా చేయడం జరుగుతుందని తెలియజేశారు.

జిల్లా వైద్యాధికారికి, వైద్యులకు సిబ్బందికి జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి యన్. శ్రీలక్ష్మి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది, వసతిగృహం నిర్వాహకులు, వృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా.

### మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

నూజివీడు మండలం పల్లెర్లమూడి గ్రామంలో గురువారం పేదలు సేవలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను ఇంటింటికి వెళ్ళి స్వయంగా లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరిస్తూ పింఛన్లు నగదును రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సంయుక్తంగాలబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారులతో మమేకమై వారి ఆరోగ్య పరిస్థితులు, జీవన విధానం, స్వంత గృహం ఉందా లేదంటే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. పింఛన్లు సొమ్మును జాగ్రత్తగా వినియోగించుకోవడంతో పాటు కొంతమేర పొదుపు చేసుకోవాలని సూచించారు. వ్యక్తిగత, గ్రామ సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొలుసు పార్థసారథి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న " పేదలు సేవలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ చేస్తున్నామని, రాష్ట్రంలో, జిల్లాలో పింఛన్లు పంపిణీ కార్యక్రమం ఒక పండుగ వాతావరణంలో జరుగు చున్నాయని అన్నారు. జిల్లాలో అక్టోబరు నెలలో 2,53,360 మంది ఫించన్లు దారులకు రూ 111.69 కోట్ల రూపాయిలు, నూజివీడు నియోజక వర్గంలో 40,233 మందికి రూ 17.40 కోట్లు, ఒక్క చిన్న గ్రామం పల్లెర్లమూడి గ్రామంలో 670 మందికి రూ 28.72 లక్షలు రూపాయలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. అర్హులైన పేదలకు సకాలంలో పారదర్శకంగా సామాజిక భద్రతా పింఛన్లు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఒకటవ తేదీ ఉదయాన్నే లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వారి ఇంటి వద్దకే వెళ్ళి నగదును అందజేసేలా జిల్లా యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టిందని తెలిపారు. ?పింఛన్ల పంపిణీ ప్రక్రియను జిల్లా వ్యాప్తంగా పర్యవేక్షిస్తున్నామని, నూరుశాతం పంపిణీ వేగవంతంగా పూర్తి చెయ్యాలని క్షేత్రస్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని అన్నారు. ప్రతి నెల మొదటి తేదీన పింఛన్లు



అందజేయడం జరుగుతుందని, ఒకవేళ మొదటి తేదీ ప్రభుత్వ సెలవు అయితే లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పేదలు సేవలో ఎన్టీఆర్ బరోసా సామాజిక పింఛన్లను ఉదయం 7:00 గంటలు నుండి అందించడం జరుగుతుందని, నూటికినూరుశాతం పింఛన్లు ఈ రోజు పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. ఒక్క రోజు ముందుగానే డబ్బులు డ్రా చేసి 1వ తేదీ ఉదయాన్నే అందిస్తున్నామని, 1వ తేదీ సెలవు దినం అయితే ముందురోజునఅందిస్తున్నామని అన్నారు. నిరుపేదలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందన్నారు. ఏ కారణం చేతనైనను ఈ రోజు పింఛన్లు తీసుకోలేని వారికి 02వ తేదీన పంపిణీ చేయబడుతుందని అన్నారు. జిల్లాలో 4925 మంది స్వర్ణవార్డు, స్వర్ణగ్రామ సచివాలయ మరియు ఇతర ప్రభుత్వ సిబ్బందితో పింఛన్లను పంపిణీకి ఏర్పాటులు చేయడమైనదన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, నియోజకవర్గం ప్రత్యేక అధికారి రవికుమార్, డిఆర్డిఏ అడిషనల్ పిడి ఇ.అనిత, డియల్డివో పి.అనురాధ, డివిజనల్ పంచాయతీ అధికారి యం.పి. యన్.సుందరి, తహాశీల్దారు షేక్ సంసిద్దీన్, యంపిడివో పి.సాంబశివ రావు, వివిధ శాఖలు అధికారులు, స్వర్ణగ్రామ ఉద్యోగులు, స్థానిక నాయకులు, కూటమి నాయకులు, లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## విశ్వ కళాశాలలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్‌నెస్ డే సందర్భంగా పాలకొల్లులోని విశ్వ కళాశాలలో యునైటెడ్ కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ కావలి ఉమాదేవి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. డాక్టర్ ఉమాదేవి మాట్లాడుతూ మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించడం ద్వారా చికిత్సతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. మహిళలు తమ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని, అనుమానాస్పద లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. అలాగే హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాముఖ్యత, దాని వల్ల కలిగే ప్రయోజనాలపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు కార్యక్రమాన్ని శ్రద్ధగా విని, తమ కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో కూడా ఆరోగ్య అవగాహన పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు దేవరపు కాంచనమాల, కార్యదర్శి సిద్దిరెడ్డి శైలజారాణి, ట్రెజరర్ తోట గాయత్రి, రీజినల్ చైర్‌పర్సన్ మంగిన అరుణ, పాస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ కావలి మౌని, బోర్డు సభ్యులు కుసుమ, అర్చన, పద్మ, మణి, రామలక్ష్మి, లక్ష్మి, దేవి, భార్గవి, జ్యోతి, శ్రీదేవి, ధన తదితరులు పాల్గొన్నారు.

## హోటల్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తుంది: ఎమ్మెల్యే బడేటి చంటి




ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

స్థానిక ఆర్నా ఫంక్షన్ హాల్‌లో పశ్చిమగోదావరి జిల్లా హోటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు, నియోజకవర్గ ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) హాజరయ్యారు. ఈ సందర్భంగా హోటల్ యజమానులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, హోటల్ రంగం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. హోటల్ నిర్వాహకులకు ఎదురవుతున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే చంటి తెలిపారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, సెక్రటరీ కె.రమణ, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ వై.కొండయ్య నాయుడు, ట్రెజరర్ లక్ష్మీనారాయణ, పశ్చిమగోదావరి జిల్లా హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు కాశి రాజు, సెక్రటరీ బిర్లాభవన్ రాజా, ట్రెజరర్ రమణ భాస్కర్‌తో పాటు పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఘనంగా రక్తదాన శిబిరం

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు




జాతీయ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆధ్వర్యంలో కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శోభ, డాక్టర్ నారాయణతో పాటు వైద్య సిబ్బంది పాల్గొని రక్తదానం ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం ద్వారా ప్రాణదానం చేయవచ్చని వారు తెలిపారు. కళాశాల ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సేవాభావాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల యాజమాన్యం పేర్కొంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, అధ్యాపకులు, ఎన్ ఎస్ ఎస్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా రక్తదానం చేసి సమాజ సేవ పట్ల తమ బాధ్యతను చాటుకున్నారు.

## క్వాలిటీలో రాజీ లేకుండా నాణ్యత పెంచాలి

-మంత్రి కొలుసు పార్థసారథి



ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

నూజివీడు పట్టణంలో గత 15 ఏళ్లుగా జరగని అభివృద్ధిని నేడు శరవేగంగా చేస్తూ ప్రజల కళ్ళల్లో ఆనందాన్ని నింపుతున్న రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి గురువారం పట్టణంలోని హనుమాన్ జంక్షన్ రోడ్డులో జరుగుతున్న డ్రైనేజీ, సీసీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూఒక ప్రణాళికాబద్ధంగా పనిచేసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాలు చేరాలంటే అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. పనుల నాణ్యతతో రాజీ పడకుండా పనిచేయాలి. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు. పట్టణంలో జరిగే పనులన్నీ నాణ్యతలో పారదర్శకంగా ఉండాలి, ఇప్పటికే నగరంలో సెంట్రల్ లైటింగ్, డివైడర్, రోడ్ల వెడల్పు, డ్రైనేజీ పూడికతీత, ఇండోర్ స్టేడియం ఇలా పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. సుమారు రూ.42 లక్షలతో పీజీ కళాశాల నుండి ద్వారకా సినీ థియేటర్, సింగ్ హోటల్ వరకు డ్రైనేజీ, బీటి రోడ్ల పనులు శరవేగంగాజరుగుతున్నాయని తెలిపారు. రానున్న కొన్ని నెలల్లో పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు అంకితం చేసి నూజివీడు నగరానికి ఒక కొత్త రూపు తెచ్చి స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడంలో అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మంత్రివర్యుల వెంట మున్సిపల్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6
శుక్రవారం 02 అక్టోబరు 2026

## 90 శాతం సబ్సిడీతో పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేయాలి

- తీవ్ర వర్షాభావంతో అల్లాడుతున్న రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి.
- ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వి.టి.రామాంజనేయులు

ప్రజాభూమి, పుట్లూరు.



పుట్లూరు మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులతో తీవ్రంగా నష్టపోతున్న రైతులు, కౌలు రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, రబీ సీజన్‌కు అవసరమైన పప్పుశనగ విత్తనాలను 90 శాతం సబ్సిడీతో వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో పుట్లూరు మండల తహసీల్దార్ గారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వి.టి. రామాంజనేయులు మాట్లాడుతూ పుట్లూరు మండలంలో వర్షాలు సకాలంలో కురవక రైతాంగం తీవ్ర సంక్షోభంలో చిక్కుకుందని అన్నారు. ఇప్పటికే ఖరీఫ్ పంటశ్రీసాగు దెబ్బతిని రైతులు పెట్టుబడులు కోల్పోయి అప్పుల ఊబిలో కూరుకుపోయారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో రబీ పంటల సాగుకు అవసరమైన పప్పుశనగ విత్తనాలను కూడా రైతులు మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తే రైతులపై మరింత ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాలను కేవలం ప్రకటనలతో పరిష్కరించలేరని, ప్రభుత్వం చేతల్లో సహాయం చూపించాలని వి.టి. రామాంజనేయులు డిమాండ్ చేశారు. పుట్లూరు మండలంలోని ప్రతి గ్రామానికి అవసరమైన మేరకు పప్పుశనగ విత్తనాలను కేటాయించి, 90 శాతం సబ్సిడీతో రైతులు, కౌలు రైతులందరికీ పారదర్శకంగా పంపిణీ చేయాలని కోరారు. విత్తనాల కొరత పేరుతో దళారులు కృత్రిమ కొరత సృష్టించి రైతులను దోచుకునే పరిస్థితి రాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పుట్లూరు మండల అధ్యక్షులు ఎన్. గోపాలకృష్ణ మాట్లాడుతూ, పుట్లూరు మండలంలో రైతులు తీవ్ర వర్షాభావ పరిస్థితులతో అల్లాడుతున్నారని, సాగు చేయడానికి పెట్టుబడులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు ప్రభుత్వం రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని విత్తనాలను 90% సబ్సిడీతో అందించి రవి సాగుకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు ప్రతి గ్రామంలో రైతుల అవసరాలకు అనుగుణంగా విత్తనాలను అందుబాటులో ఉంచాలని కోరారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పుట్లూరు మండల కార్యదర్శి సత్తార్ గోపాల్ యాదవ్ మాట్లాడుతూ విత్తనాల పంపిణీలో ఎలాంటి అక్రమాలకు దళారుల జోక్యానికి అవకాశం ఇవ్వకుండా అధికారులు పటిష్టమైన తీసుకోవాలని అన్నారు అర్హులైన ప్రతి రైతుకు సకాలంలో విత్తనాలు అందేలా గ్రామాల వారిగా ప్రత్యేక ఏర్పాటు చేయాలని కోరారు తీవ్ర వర్షాభావ పరిస్థితిలో రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే రైతాంగం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని వెంటనే 90 శాతం సబ్సిడీతో పప్పుచానుగా విత్తనాలు పంపిణీ చేపట్టి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్నికోరారు రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మరియు ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పుట్లూరు మండల గౌరవ అధ్యక్షులు బుసగాని చిన్నికృష్ణ యాదవ్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు సత్తార్ వెంకటరమణయ్య, రైతు సంఘం నాయకులు చిన్న ఓబుళపతి, టి.మారుతి, టీ.వెంకటరాముడు, రైతులు అంకిరెడ్డి,నాగలింగారెడ్డి, పుల్లారెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

## ముస్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సాధారణ నిధులతో చేపట్టనున్న సిమెంట్ రోడ్లకు భూమి పూజ కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం





అనంతపురం నగరంలోని రాంనగర్‌లో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సాధారణ నిధులతో చేపట్టనున్న సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు గురువారం భూమి పూజ కార్యక్రమంలో అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అర్బన్ శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్, ఎమ్మెల్సీ దలవాయి రమాదేవితో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అనంతపురం నగరంలో మౌలిక వసతులను మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా రహదారులు, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు, మెరుగైన పారిశుద్ధ్య వసతులు అందించేందుకు చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులను సూచించారు. అనంతపురం నగరాన్ని మరింత అభివృద్ధి చెందిన, సౌకర్యవంతమైన నగరంగా తీర్చిదిద్దేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందుకు సాగుతాం. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వెంకటేశ్వర్ రెడ్డి, బంధువుకు రాజా కార్యకర్తలు, కార్పొరేషన్ డైరెక్టర్లు, చైర్మన్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సుదీర్ఘ పోలీసు సేవలు అందించిన ట్రాఫిక్ ఎస్సై రామచంద్రారెడ్డికి జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ఘన సన్మానం

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



అనంతపురం ట్రాఫిక్ ఎస్సై రామచంద్రారెడ్డి శాంతిభద్రతల పరిరక్షణ, తదితర విధి నిర్వహణలో 36 ఏళ్లకు పైగా నిబద్ధతతో సేవలు అందించి పదవీ విరమణ పొందిన అనంతపురం ట్రాఫిక్ ఎస్సై రామచంద్రారెడ్డిని జిల్లా ఎస్పీ పి. జగదీష్ గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఘనంగా సన్మానించారు. ఆయన సుదీర్ఘ సేవా ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి. జగదీష్ మాట్లాడుతూ.. 1990 జూలై 31న పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా చేరిన రామచంద్రారెడ్డి 36 ఏళ్ల 2 నెలల పాటు అంకితభావంతో విధులు నిర్వహించారని కొనియాడారు. పోలీసుశాఖ పట్ల ఆయన చూపిన క్రమశిక్షణ, ప్రజలకు అందించిన సేవలను ఈసందర్భంగా గుర్తు చేశారు. ప్రతిభకు గుర్తింపుగా రివార్డులు విధి నిర్వహణలో రామచంద్రారెడ్డి చూపిన సమర్థతకు గాను తన సర్వీసు కాలంలో 4 ప్రశంసా పత్రాలు, 20 జీఎస్ఈలు (గుడ్ సర్వీస్ ఎంట్రీలు), 15 నగదు రివార్డులను అందుకున్నట్లు ఎస్పీ తెలిపారు. 2011లో హెడ్ కానిస్టేబుల్‌గా, 2017లో ఏఎస్ఐగా పదోన్నతి పొందిన ఆయన సెప్టెంబర్ 2026లో ఎస్ఐగా పదోన్నతి సాధించి అనంతపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు నిర్వర్తించి పదవీ విరమణ పొందారు. పోలీసు శాఖకు ఆయన అందించిన సేవలను ప్రశంసిస్తూ, పదవీ విరమణ అనంతరం రామచంద్రారెడ్డి భావి జీవితం కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో, సంతోషకరంగా సాగాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.నాగభూషణం, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్ , లక్ష్మినారాయణ, తబితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



అనంతపురం జిల్లా కూడేరు మండల పరిధిలోని ఎం.ఎం.హళ్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ నేరుగా ఇంటి వద్దకు వెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల



ప్రయోజనాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా నేరుగా వారి ఇంటి వద్దకే పింఛన్ అందిస్తూ ప్రజా సేవలను మరింత చేరువ చేస్తున్నామని పేర్కొన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హులైన లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులకు కొత్త పింఛన్లు కూడా మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తెలుగుదేశం పార్టీ నాయకులు గుండారపు శ్రీధర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురం రూరల్‌లోని రాయల్ కాలనీఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా గురువారం అనంతపురం రూరల్‌లోని రాయల్ కాలనీతో పాటు అనంతపురం నగరంలోని 2వ రోడ్‌లో పింఛన్ లబ్ధిదారులకు అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎమ్మెల్సీ దలవాయి రమాదేవి లతో కలిసి పింఛన్లు అందజేశాము. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, మొదటి రోడ్డు శివాలయం అధ్యక్షులు నరేంద్ర చౌదరి, మున్సిపల్ కమిషనర్, మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్, కార్యకర్తలు, పింఛన్ లబ్ధిదారులు, సచివాలయ సిబ్బంది, మండల పరిషత్ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. నెలలో మొదటి రోజే పింఛన్లు అందిస్తున్న దేశంలోనే ఏకైక ప్రభుత్వం మన కూటమి ప్రభుత్వం అని అన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు వివిధ రకాల సామాజిక పింఛన్లను అందిస్తూ వారి జీవనానికి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. నిరుపేదలు ఎవరి మీదా ఆధారపడకుండా గౌరవంగా జీవించేందుకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఎంతో ఉపయోగపడుతున్నాయి. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా నిరంతరం కృషి చేస్తానన్నామరు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు వెంకటేశ్వర్ రెడ్డి, బంధువుకు రాజా, పింఛనుదారులు తదితరులు పాల్గొన్నారు.

## గాలివాన బీభత్సం.. అరటి రైతులకు భారీ నష్టం

**గడ్డంనాగేపల్లిలో ఏడుగురు రైతుల అరటి తోటల పరిశీలన- పంట నష్టాన్ని అంచనా వేసి బీమా, పరిహారం అందేలా చర్యలు: ఎమ్మెల్యే శ్రావణిశ్రీ**

ప్రజా భూమి నార్పల



మండలపరిధిలోని గడ్డంనాగేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం, ఈదురుగాలులకు అరటి తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. గ్రామంలో 42.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈదురుగాలుల ధాటికి ఏడుగురు రైతులకు చెందిన అరటి తోటల్లో పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యం సంభవించడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

**రైతుల తోటలను పరిశీలించిన ఎమ్మెల్యే**

అరటి పంట నష్టాన్ని తెలుసుకునేందుకు శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గడ్డంనాగేపల్లిలో పర్యటించారు. రైతులు వెంకటేష్, నవీన్, వెంకటనాయుడు, సందీప్, నారాయణస్వామి, భారతి, వెంకటయ్యలకు చెందిన అరటి తోటలను పరిశీలించి, పంటకు జరిగిన నష్టం, సాగు కోసం చేసిన పెట్టుబడుల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తమకు జరిగిన నష్టాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పంట చేతికొచ్చే సమయంలో తోటలు దెబ్బతినడంతో పెట్టుబడులు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**బీమా, పంట నష్టపరిహారం అందేలా చర్యలు**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణిశ్రీ మాట్లాడుతూ అరటి పంటకు జరిగిన నష్టాన్ని వెంటనే అంచనా వేయించి, బీమా, పంట నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించి, పరిహారం త్వరగా మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ప్రకృతి వైపరీత్యం కారణంగా నష్టపోయిన రైతులు ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

**నష్టాన్ని పరిశీలించిన అధికారులు**

ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా అధికారులు కూడా దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించి పంట నష్ట వివరాలను నమోదు చేశారు. నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందించేందుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ నాయకుడు అలం వెంకట నరసా నాయుడు, రాష్ట్ర వాల్మీకి బోర్డు డైరెక్టర్ కుల్లాయప్ప, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు మహేష్ నాయుడు, ఎంపీడీవో మమతాదేవి, తహసీల్దార్ అరుణకుమారి, ఆర్ఐ అఫ్జల్ అలీ, వీఆర్వో రవి, హెచ్ఓ నెట్టికంటయ్య, ఏవో చెన్నవీరనారప్ప, గ్రామ వ్యవసాయ సహాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి, ఎస్సై సాగర్ తదితర అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## పల్లె పండుగ 3.0 కార్యక్రమం

**-1.70 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డుకు భూమి పూజ**

**-కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి జరుగుతుంది**

**-ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ**

ప్రజా భూమి శింగనమల



శింగనమల మండలం పరిధి చీలేపల్లి గ్రామంలో పల్లె పండుగ 3.0 లో భాగంగా నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని బీసీ కాలనీలో రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. గ్రామంలోని అంతర్గత రహదారులు మెరుగు పడటంతో ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయి. అలాగే పెద్దజలాలపురం నుంచి చీలేపల్లి వరకు 2.3 కిలోమీటర్ల మేర రూ.1.70 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు భూమిపూజ చేశారు. ఈ రహదారి పూర్తయితే గ్రామ ప్రజల రాకపోకలతో పాటు రైతులు తమ పంటలను మార్కెట్లకు తరలించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.గ్రామంలో పాడి రైతు రాజేశ్వరి స్థలంలో నిర్మించనున్న గోకులం షెడ్డుకు భూమిపూజ. పాడి రైతులకు, పశుపోషణపై ఆధారపడే కుటుంబాలకు అవసరమైన వసతులు కల్పించేందుకు ఇలాంటి నిర్మాణాలు దోహదపడతాయి. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ మరియు అనంతపురం జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు , ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, దిసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసనాయుడు కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలలో ఘనంగా శ్రమదానం

**స్వచ్ఛతాహి సేవలో భాగంగా 'ఏక్ దిన్--ఏక్ ఘంటా--ఏక్ సాత్' కార్యక్రమం**

ప్రజా భూమి నార్పల



స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా 'ఏక్ దిన్--ఏక్ ఘంటా--ఏక్ సాత్--శ్రమదానం' కార్యక్రమాన్ని నార్పల మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి, ఎంపీడీవో మమతాదేవి, డిప్యూటీ ఎంపీడీవో, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు, నార్పల గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది పాల్గొని శ్రమదానం చేశారు. కళాశాల పరిసరాలను శుభ్రం చేస్తూ పారిశుధ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని అధికారులు సూచించారు. అనంతరం నార్పల గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్ షాప్‌ను జిల్లా పంచాయతీ అధికారి సందర్శించి దాని నిర్వహణ, డ్రై వేస్ట్ సేకరణ, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, పారిశుధ్య కార్మికులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున కడప మేయర్ పదవి కోరిన రాయల్ బాబు

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



కడప మేయర్ రేస్ లో మరో నేత వైసీపీ తరఫున అవకాశం ఇవ్వాలని వైఎస్ జగన్ ను కోరిన కడపకు చెందిన రాయల్ ఫర్నిచర్ అధినేత రాయల్ బాబు కడప నగరపాలక సంస్థకు త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున మేయర్‌గా పోటీ చేసేందుకు మరో నేత తెరపైకి వచ్చారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున ఇప్పటికే పలువురు అభ్యర్థులు మేయర్ టికెట్ ఆశిస్తుండగా కొత్తగావైసీపీలో వాణిజ్య విభాగం కార్యదర్శిగా కొనసాగుతున్న రాయల్ ఫర్నిచర్ అధినేత రాయల్ బాబు తనకు మేయర్ టికెట్ ఇవ్వాలంటూ వైఎస్ జగను కలిసి అభ్యర్థించారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్ జగన్ గెస్ట్ హౌస్ లో కలిసిన ఆయన ఈ మేరకు వైఎస్ జగన్ కోరారు. తానుహొఎంతోకాలంగా పార్టీ కోసం విధేయుడిగా నమ్మకస్తుడిగా పనిచేస్తున్నానని, ఇప్పటివరకు తనకు ఎలాంటి పదవి లేకపోయినా పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేస్తున్నానని, ఇప్పుడు కడప నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని అభ్యర్థించినట్లు సమాచారం. కడప మేయర్ అభ్యర్థి ఎంపిక విషయమె జిల్లాలో ఇప్పటి ఒక కమిటీ నియమించడం జరిగిందని, కమిటీ నివేదిక మేరకు ఏ కొద్దీ మాత్రం అవకాశాలు ఉన్నా టికెట్ ఇస్తామని వైఎస్ జగన్ రాయల్ బాబుకు భరోసాను ఇచ్చినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురం జిల్లా వ్యాప్తంగా 3న గాంధీ విగ్రహాల ఎదుట ఆందోళన

ప్రజా భూమి ప్రతినిధి, అనంతపురం



ఈ నెల 3వ తేదీన వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా గాంధీ విగ్రహాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. గురువారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (సిపిఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి కేశవరెడ్డి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (సిపిఎం) జిల్లా కార్యదర్శి క్రిష్ణమూర్తి, రైతు కూలి సంఘం (సిపిఐ యంల్ ) జిల్లా కార్యదర్శి పెనకచర్ల కృష్ణ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (సిపిఐ ) జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు ఎస్.నాగరాజులు, రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాయుడు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత వ్యవసాయ కూలీలకు, పేదలకు, ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. ఉపాధి హామీ పథకం కోసం అదనంగా రెండు లక్షల కోట్ల రూపాయలు నిధులను విడుదల చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా విస్తృతతంగా పనులు చేపట్టాలన్నారు. పై డిమాండ్ల సాధన కోసం ఈ నెల 3వ తేదీన జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గాలలో గాంధీ విగ్రహాల ఎదుట ఆందోలన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఏడాదిలో 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. రోజు వేతనం 700 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి -గాలివానకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి: డి.చిన్నప్పయాదవ్

ప్రజా భూమి నార్పల



నార్పల మండలం గడ్డంనాగేపల్లిలో గాలివానకు నేలకొరిగిన అరటి తోటలను జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు డి.చిన్నప్పయాదవ్, రైతుసంఘం నాయకులు, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నప్పయాదవ్ మాట్లాడుతూ నష్టపోయిన అరటి రైతులకు వెంటనే పంట నష్టపరిహారం, బీమా అందించాలని డిమాండ్ చేశారు. నేలకొరిగిన అరటి గెలలను ఉద్యాన శాఖ టన్నుకు రూ.22 వేలతో కొనుగోలు చేయాలని కోరారు.అలాగే పంట నష్టాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో అంచనా వేసి ఎకరాకు రూ.లక్ష పరిహారం అందించాలని, రైతు సేవా కేంద్రాల పరిధిలో కోల్డ్‌స్టోరేజీలు ఏర్పాటు చేయాలని, నాణ్యమైన విత్తనాలు, మొక్కలను సబ్సిడీపై అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మధుయాదవ్, సాకే గంగాధర, పెదపెద్దయ్య, వీఆర్వో రవి, సీపీఐ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# రైతు బజార్ కాదు.. రైతును దోపిడీ చేసే బజార్

## - కిలో ఉల్లి రూ.35కే అన్ని రైతు బజార్లలో విక్రయించాలి - ఏపీసీసీ మీడియా చైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె

కూటమి పాలనలో రాష్ట్రంలోని రైతు బజార్లు రైతులు, వినియోగదారులను దోపిడీ చేసే బజార్లుగా మారడం దురదృష్టకరమని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. గురువారం ఉదయం వేంపల్లిలో రైతు బజార్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించి రైతులు, వినియోగదారులు, చిరు వ్యాపారులతో మాట్లాడారు. రాష్ట్రంలో నిత్యావసర సరుకుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయని, కూరగాయలు, పప్పులు, వంట నూనెలు, ఉల్లి తదితర ధరలు పెరిగిపోయాయని తులసి రెడ్డి అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని పేర్కొన్నారు. రైతు బజార్లు రైతులకు మెరుగైన ధర, వినియోగదారులకు తక్కువ ధరకు సరుకులు అందించేలా ఉండాలని, దళారీ



వ్యవస్థకు తావు ఉండకూడదన్నారు. అయితే రైతు బజార్‌లో రైతుల నుంచి మూటకు రూ.40, 25 కిలోల టమోటా బాక్సుకు రూ.20 చొప్పున వసూలు చేస్తున్నారని ఆరోపించారు. చిరు వ్యాపారుల నుంచి అద్దెలు, ఇతర రుసుముల రూపంలో వసూళ్లు జరుగుతున్నాయని తెలిపారు. రైతు బజార్ నిర్వహణలో రైతులు, వినియోగదారుల ప్రయోజనాలను కాపాడాలని, రైతు బజార్‌పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. బహిరంగ మార్కెట్‌లో ఉల్లి ధరలు పెరిగిన నేపథ్యంలో రైతు బజార్ల ద్వారా కిలో ఉల్లిని రూ.35కే విక్రయించే విధానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, పులివెందుల నియోజకవర్గ సమన్వయకర్త ధ్రువకుమార్ రెడ్డి, మండల అధ్యక్షుడు రామకృష్ణ, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, వేమయ్య, బద్రీనాథ్, రమణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో సత్తా చాటిన శ్రీ చైతన్య విద్యార్థులు

## - మండల స్థాయి పోటీల్లో ప్రతిభ.. నియోజకవర్గ స్థాయికి పలువురి ఎంపిక- కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె



స్థానిక పట్టణంలోని శ్రీ చైతన్య హైస్కూల్ విద్యార్థులు మండల స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి, పలు క్రీడా విభాగాల్లో నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ బి. చక్రపాణిరెడ్డి తెలిపారు. ఖో-ఖో, వాలీబాల్, యోగా, చెస్, అథ్లెటిక్స్ విభాగాల్లో విద్యార్థులు సత్తా చాటారని పేర్కొన్నారు. ఖో-ఖో అండర్-14లో బి. శ్రీకాంత్, యు. జగన్, అండర్-17లో ఎస్. మేఘనాథ్, టి. తరుణ్ సాయి ఎంపికయ్యారు. వాలీబాల్ అండర్-14లో టి. దినేష్, బి. ప్రణీత్, ఎ. పవన్, అండర్-17లో ఎం. అనిరుధ్, ఎ. సిద్ధార్థ, యు. కార్తిక్ ఎంపికయ్యారు. చెస్ అండర్-14లో ఓ. గీతాశ్రీ, అభినవ్, అండర్-17లో టి. తనుశ్రీ నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యారు. అథ్లెటిక్స్‌లో పి. కాశేశ్వర్, బి. గౌతమ్‌రెడ్డి, సి. నిషిత ప్రథమ స్థానాలు సాధించగా, పి. ప్రణీత్, బి. మైనావతి ద్వితీయ స్థానాలు, ఎం. గంగ తులసీధర్, పి. కాశేశ్వర్, బి. మైనావతి తృతీయ స్థానాలు సాధించారు. డి. హేమలత అండర్-17 200 మీటర్ల పరుగులో నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థులు క్రీడలతో పాటు విద్యలోనూ రాణించాలని, నియోజకవర్గ స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని చక్రపాణిరెడ్డి ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, క్రీడా ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

# రాగిమానిపల్లె, స్వర్ణ గ్రామంలో వర్మీకంపోస్ట్ తయారీపై అవగాహన

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల మండలంలోని రాగిమానిపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి, స్వర్ణ గ్రామ సిబ్బందికి వర్మీకంపోస్ట్ (వానపాముల ఎరువు) తయారీ విధానంపై సూచనలు, సలహాలు అందించినట్లు పులివెందుల మండల ఎంపీడీఓ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు.గ్రామాల్లో తడి చెత్త, పశువుల వ్యర్థాలు, ఇతర జీవ వ్యర్థాలను సమర్థవంతంగా వినియోగించుకుని సేంద్రీయ ఎరువును తయారు చేయడంపై సిబ్బందికి అవగాహన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. వర్మీకంపోస్ట్ తయారీ ద్వారా గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు, వ్యర్థాలను విలువైన సేంద్రీయ ఎరువుగా మార్చుకోవచ్చని వివరించారు.ఈ సందర్భంగా వర్మీకంపోస్ట్ తయారీకి అవసరమైన స్థల ఎంపిక, తొట్టెల ఏర్పాటు, సేంద్రియ వ్యర్థాల సేకరణ, వాటి పొరల అమరిక, వానపాముల వినియోగం, తగిన తేమను నిర్వహించడం, ఎరువును సేకరించే విధానం తదితర అంశాలపై గ్రామ పంచాయతీ సిబ్బందికి తగిన సూచనలు చేశారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.రాగిమానిపల్లె, స్వర్ణ గ్రామంలో వర్మీకంపోస్ట్ తయారీ ప్రక్రియను ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ మేరకు రానున్న పది రోజుల్లో వర్మీకంపోస్ట్ తయారీ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ పి. శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసి, ఇతర గ్రామాలకు కూడా ఆదర్శంగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

# మంత్రి సవిత, బీటెక్ రవిల వ్యాఖ్యలు హాస్యాస్పదం: లింగాల వైసీపీ నేతలు

**రైతులకు మీరేం చేశారో చెప్పండి - చిత్రావతిలో 10 టీఎంసీలు ఎందుకు నింపలేకపోయారు**

**గాలి,వానకు రెండేళ్లుగా అరటి రైతులు నష్టపోతుంటే పట్టించుకోని కూటమి ప్రభుత్వం**

ప్రజాభూమి, పులివెందుల



రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తున్నామంటూ మంత్రి సవిత, పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి మతిభ్రమించి మాట్లాడుతున్నారని లింగాల మండల వైసీపీ నేతలు మండిపడ్డారు. గురువారం జగన్ క్యాంపు కార్యాలయంలో లింగాల మండల కన్వీనర్ బాబురెడ్డి, తాలూకా రైతు విభాగ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, నాగేంద్రా రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, సాయినాథ్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు.కూటమి ప్రభుత్వం వచ్చాక రెండేళ్లుగా గాలివానతో లింగాలలో వేల ఎకరాల అరటి పంట నేలకొరిగితే, మంత్రి సవిత పరిశీలనకే పరిమితమై ఒక్క రూపాయి పరిహారం ఇవ్వలేదని విమర్శించారు. వైఎస్ జగన్, ఎంపీ అవినాష్ రెడ్డి సొంత నిధులతో హెక్టారుకు రూ.20 వేలు ఇచ్చి రైతులను ఆదుకున్నారని గుర్తుచేశారు. వైసీపీ హయాంలో చిత్రావతి డ్యాంకు రూ.250 కోట్లతో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి 10 టీఎంసీల నీరు నింపి 1.10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామన్నారు. కూటమి హయాంలో 10 టీఎంసీలు ఎందుకు నింపలేకపోయారో చెప్పాలని డిమాండ్ చేశారు.చెరువులకు నీరు వదలాలంటే మోటార్లు పనిచేయవు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయని సాకులు చెప్పి, ఎంపీ అవినాష్ రెడ్డి మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు బాగుచేస్తే కనెక్షన్లు ఇవ్వకుండా అడ్డుకున్నారని ఆరోపించారు.పాపాగ్నిలో ఇసుక అక్రమ రవాణాతో భూగర్భ జలాలు అడుగంటి, అడ్డుకున్న రైతులపైనే కేసులు పెట్టారని, ఇదేనా రైతులపై మీ చిత్తశుద్ధి అని ప్రశ్నించారు. గండికోట నుంచి చిత్రావతికి 10 టీఎంసీలు, పైడిపాలెం రిజర్వాయర్‌కు 6 టీఎంసీల నీరు నింపాలని డిమాండ్ చేశారు.

# జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల విజయం

## - మూడు విభాగాల్లో ప్రథమ బహుమతులు.. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ప్రజాభూమి, వేంపల్లె

యోగి వేమన విశ్వవిద్యాలయం, కడపలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలు--2026లో ఆర్జీయూకేటీ ఆర్కే వ్యాలీ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి మూడు విభాగాల్లో ప్రథమ బహుమతులు సాధించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్, ఎస్‌టీఈపీ, వైఎస్సార్ కడప ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జానపద గీతాలు, జానపద నృత్యం, నుక్కడ్ నాటక్ విభాగాల్లో ప్రథమ బహుమతులు సాధించారు. దీంతో విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వైఎస్సార్ కడప జిల్లా తరఫున విద్యార్థులు ప్రాతినిధ్యం వహించనున్నారు. ప్రతి విభాగంలో ఏడుగురు విద్యార్థులు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. డి. కోనప్ప విద్యార్థులకు దిశానిర్దేశం చేయగా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో అవసరమైన శిక్షణ అందించారు. విద్యార్థుల విజయంపై ఆర్కే వ్యాలీ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ ప్రకాష్, ఏవో, డీన్, డీఎస్‌డబ్ల్యూ అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన ఎన్ఎస్ఎస్ విభాగం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు.

# బీసీ రిజర్వేషన్లలో చంద్రబాబు కుట్ర బట్టబయలు: హైకోర్టు తీర్పుతో తేటతెల్లం

## బీసీలకు వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వం - వైసీపీ బీసీ సెల్ వైస్ ప్రెసిడెంట్ వరప్రసాద్

ప్రజాభూమి, పులివెందుల



బీసీ రిజర్వేషన్ల విషయంలో చంద్రబాబు కుట్ర హైకోర్టు తీర్పుతో బట్టబయలైందని రాష్ట్ర బీసీ సెల్ వైస్ ప్రెసిడెంట్, మాజీ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ అన్నారు.గురువారం పాత ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఆయన మాజీ కో-ఆప్షన్ సభ్యుడు దాసరి చంద్రమౌళి, వల్లెపు శ్రవణ్ తో కలిసి విలేకరులతో మాట్లాడారు.34% రిజర్వేషన్లు ఇస్తున్నామని గొప్పగా చెప్పిన ప్రభుత్వం, దాన్ని చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా ఎందుకు అమలు చేయలేకపోయిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట అని చెప్పి, చివరకు న్యాయపరమైన చిక్కులు వచ్చేలా వ్యవహరించడం బీసీలకు అన్యాయమని విమర్శించారు.ఈ విధానంపై వైఎస్ జగన్ ఆనాడే హెచ్చరించారని, కూటమి ప్రభుత్వం బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తోందని అన్నారు. బీసీల ఓట్లతో గద్దెనెక్కి బీసీలనే చిన్నచూపు చూడటం సరికాదని, విస్మరిస్తున్న బీసీలే మళ్లీ గద్దె దింపుతారని హెచ్చరించారు. బీసీలకు న్యాయం జరిగే వరకు వైసీపీ పోరాడుతుందన్నారు.

# ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాల సాగుతో భూమికి బాగు

ప్రజాభూమి,పులివెందుల



భూమిని సజీవంగా ఉంచడంతో పాటు నేల సారాన్ని పెంపొందించేందుకు ప్రకృతి వ్యవసాయంలో పీఎండీఎస్ ను రైతులు అవలంబించాలని ఫార్మర్ మాస్టర్ ట్రైనర్ యామినిలత సూచించారు. పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు ఎం. రత్నాకర్ రెడ్డికి చెందిన ఐదు ఎకరాల భూమిలో పీఎండీఎస్ విధానంలో నవధాన్యాల సాగును చేపట్టారు.ఈ సాగులో భాగంగా ఐదు ప్రధాన పంటలతో పాటు 18 నుంచి 25 రకాల జీవవైవిధ్య పంటల విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేసి, వరుస పద్ధతిలో విత్తనాలు వేశారు. ఈ సందర్భంగా యామినిలత మాట్లాడుతూ ఎల్నినో ప్రభావంతో ఎదురయ్యే వాతావరణ మార్పులను తట్టుకునేందుకు, భూమిలో తేమశాతాన్ని కాపాడేందుకు, ప్రధాన పంటలకు అవసరమైన స్థూల, సూక్ష్మ పోషకాలను అందించేందుకు పీఎండీఎస్ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.ప్రతి రైతు ఎకరాకు 25 నుంచి 30 రకాల నవధాన్య విత్తనాలను సాగు చేసి, ఏడాది పొడవునా భూమిని పంటలతో కప్పి ఉంచాలని సూచించారు. పీఎండీఎస్ పంటలను 45 రోజుల తర్వాత పశువుల మేతగా వినియోగించుకోవచ్చని తెలిపారు. పోషక విలువలతో కూడిన పచ్చిమేత పశువుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు పాల ఉత్పత్తి, పాలలో వెన్న శాతం పెరిగేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.వివిధ రకాల పంటల వేర్లు భూమిలోకి చొచ్చుకెళ్లడం వల్ల నేల గుల్లబారి మృదువుగా మారుతుందని, వర్షపు నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుందని వివరించారు. నేలలో సాయిల్ ఆర్గానిక్ కార్బన్ శాతం పెరగడంతో పాటు పంటలకు అవసరమైన స్థూల, సూక్ష్మ పోషకాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.రైతులు ఖాళీగా ఉన్న భూముల్లో పీఎండీఎస్ సాగు చేపట్టి భూసారాన్ని కాపాడుకోవడంతో పాటు ఎల్నినో ప్రభావాలను అధిగమించేందుకు కృషి చేయాలని యామినిలత కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంఎంటీ యామినిలత, రైతులు, ఐసీఆర్‌పీ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం మహాదానం - విద్యార్థినులకు అవగాహన

ప్రజాభూమి, పులివెందుల




జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్స వం సందర్భంగా పులివెందుల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళా శాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి, ఎన్ఎస్ఎస్, ఆర్ఆర్సీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపల్ శ్రీనిత అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథి నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రక్తానికి ప్రత్యామ్నాయంలేదని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఐసీటీసీ కౌన్సిలర్లు వెంకటసుబ్బయ్య, బాదల్ వల్లి సురక్షిత రక్తదానంపై వివరించారు. సేవాసమితి అధ్యక్షుడు మొమ్మెల రాజు విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు.

# ముళ్ల పొదలతో ప్రజలకు భయం



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని చలమారెడ్డి కొట్టాలు గ్రామం బీసీ కాలనీలో రహదారులకు ఇరువైపులా ముళ్ల పొదలు, కంపచెట్లు పెరిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమీప అటవీ ప్రాంతం నుంచి విషపురుగులు, వన్యప్రాణులు సంచరిస్తుండటంతో కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రమాదాలు జరగకుండా రహదారుల వెంట పెరిగిన ముళ్ల పొదలను వెంటనే తొలగించాలని గ్రామస్తులు కోరారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి లలితను వివరణ కోరగా, సమస్యను స్పెషల్ ఆఫీసర్ మెహతాబ్ యాస్మిన్ దృష్టికి తీసుకెళ్లి, కూలీలతో రహదారుల ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించే చర్యలు చేపడతామని తెలిపారు.

# సీఎం పర్యటనకు రెండు బస్సులు ఏర్పాటు



ప్రజాభూమి, సిద్ధవటం: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం మదనపల్లిలో నిర్వహించనున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కార్యక్రమానికి రైతులు హాజరై కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సిద్ధవటం మండల తహసీల్దార్ విజయ్‌కుమార్ కోరారు. ఈ సందర్భంగా సిద్ధవటం, మాధవరం గ్రామాల నుంచి రైతులను తరలించేందుకు రెండు బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్సులు శుక్రవారం ఉదయం 4 గంటలకు బయలుదేరుతాయని, ఆసక్తి ఉన్న రైతులు కార్యక్రమానికి తరలివెళ్లాలని ఆయన సూచించారు.

# వీధి దీపాల మరమ్మతులకు చర్యలు

## - ప్రజల ఫిర్యాదులపై స్పందించిన పంచాయతీ అధికారులు



ప్రజాభూమి, సిద్ధవటం: మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలో వీధి దీపాలు వెలగడం లేదని ప్రజలు చేసిన వినతిపై పంచాయతీ అధికారులు స్పందించారు. ఇంచార్జ్ పంచాయతీ కార్యదర్శి నాన్సీ సమస్యను ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లగా, ఆమె ఆదేశాల మేరకు గురువారం వీధి దీపాల మరమ్మతు పనులను చేపట్టారు. ముందుగా మాధవరం-1, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో పనిచేయని వీధి దీపాలను గుర్తించి మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కార్యదర్శి నాన్సీ మాట్లాడుతూ, తమ దృష్టికి వచ్చిన వీధి దీపాలను మరమ్మతు చేయిస్తున్నామని తెలిపారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో లైట్లు వెలగడం లేదని ప్రజలు తెలియజేశారని, వాటిని కూడా త్వరలోనే సరిచేస్తామని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు తమ సమస్యలను పంచాయతీ దృష్టికి తీసుకువస్తే, ఉన్నతాధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె తెలిపారు.

# యువత రక్త దానం చేయడానికి ముందుకు రావాలి

## డి.ఎం.హెచ్.ఓ డాక్టర్.యుగంధర్

ప్రజా భూమి, కడప సిటీ:




యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని రక్తదానం ఒకరికి ప్రాణదానం అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి. యుగంధర్ అన్నారు. అక్టోబర్ 1 జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా గురువారం వారి కార్యాలయంలో రక్తదాన పోస్టర్లను విడుదల చేయడం జరిగినది. ప్రతి సంవత్సరం తమవంతుగా రక్తదానంపై ప్రచారం చేస్తూ సేవలందిస్తున్న రక్తదాన ప్రచార సేవకుడు అబ్దుల్ రాయల్ కరీముల్లా కు అభినందించారు. ఈ కార్యక్రమంలో జె కే యూత్ ఖాదర భాష. డాక్టర్ ప్రవీణ్ కుమార్. డాక్టర్ ఆరిఫ్ భాష. తదితరులు పాల్గొన్నారు.

# పులివెందులలో ఇంటింటికీ వైసీపీ.. ఎన్నికల సమీపవేళ ఆప్యాయ పలకరింపు

**ఓటర్లను కలిసిన మున్సిపల్ ఇన్‌చార్జులు మనోహర్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి**

ప్రజాభూమి, పులివెందుల



స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ పులివెందులలో వైసీపీ ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేసింది. గురువారం మున్సిపల్ ఇన్‌చార్జులు వైఎస్ మనోహర్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకుని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ బలపరిచిన చైర్మన్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో పులివెందుల మున్సిపాలిటీ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, పెండింగ్ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని వారు విమర్శించారు.అంతకుముందు బంగారు అంగడి వ్యాపారి పట్టాభి నివాసంలో ఇన్‌చార్జులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్ర మంలో మాజీ చైర్మన్లు వరప్రసాద్, రసూల్, పట్టణ అధ్యక్షుడు హెచ్. గంగాధర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, దేరంగుల చంద్రమౌళి, కొత్త రవికుమార్, నూరుల్లా, నవీన్, రామ్మోహన్, దాసరి చంద్రమౌళి, కనక, దాసరి ఈశ్వరయ్య, హరి, చెన్నూరు కార్తీక్, సుంకర రవికుమార్, ఐటీఐ సాయి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో గాయపడిన బంగారు వ్యాపారి సాగర్ ను పరామర్శించిన వైసీపీ ఇన్‌చార్జులు

ప్రజాభూమి, పులివెందుల



పట్టణంలోని బంగారు వ్యాపారి సాగర్ కాలు విరిగి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకుని మున్సిపల్ వైసీపీ ఇన్‌చార్జులు వైఎస్ మనోహర్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి గురువారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.వారి వెంట మాజీ చైర్మన్లు వరప్రసాద్, రసూల్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు దాసరి చంద్రమౌళి, అంకాలమ్మ దేవస్థాన చైర్మన్ ప్రసాద్, చెన్నూరు కార్తీక్, సుంకర రవికుమార్ తదితరులు ఉన్నారు.

# ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

శుక్రవారం 02 అక్టోబరు 2026


## నైపుణ్యాలు పెంపొందించు కోవాలి



ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం

విద్యార్థుల భవిష్యత్ అవసరాలకను గుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని తిరుపతి రామకృష్ణ మిషన్ ఆశ్రమ సెక్రటరీ స్వామి సుకృతానందాజీ అన్నారు. రామచంద్రపురం మండలం వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో బి. ఫార్మసీ. ఫార్మా. డి మొదటి సంవత్సరం లో ప్రవేశం పొందిన విద్యార్థులకు గురువారం ఓరియంటేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్వామి సుకృతానందాజీ ముఖ్య అతిధిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పిల్లల భవిష్యతను తీర్చి దిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ యం. నిరంజన్ బాబు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, స్కిల్ డెవలప్మెంట్ ప్రాధాన్యత వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్న రాజు, వివిధ విభాగాధిపతులు, మొదటి సంవత్సరం విద్యార్థిని వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించిన పూజ శ్రీ ప్రతాప్ స్వామీజీ



ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం

దసరా పర్వదినాలను పురస్కరించుకుని రామచంద్రపురం మండలం సూరవారి పల్లి గ్రామ సమీపాన సురభి గో సంరక్షణ శాలలో నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ తెలిపారు. భక్తులతో కలిసి దసరా ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా 10రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, శ్రీ చక్ర నవా వరణ పూజ, ధుని పూజ అలంకరణలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు మరియు 24 గంటలు అన్నసంతర్పణ చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. దసరా ఉత్సవాలకు ప్రజలందరికి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు భక్తులు పాల్గొన్నారు.

## బాక్సింగ్‌లో మెరిసిన తొండవాడ విద్యార్థి రిషి..!



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

చంద్రగిరి మండలం, తొండవాడ బీఎన్ఆర్ జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న వి. రిషి బాక్సింగ్‌లో సత్తా చాటుతున్నాడు. పాఠశాల పీఈటీ శ్రీమన్నారాయణ రెడ్డి మార్గదర్శకత్వంలో అండర్--17 విభాగంలో 80 కిలోలకు పైబడిన బరువు కేటగిరీలో జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో రిషి బంగారు పతకం సాధించాడు. ఈ ప్రతిభతో ప్రస్తుతం రాష్ట్ర స్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌కు



ఎంపికయ్యాడు. తొండవాడలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన రిషి జిల్లా స్థాయిలో స్వర్ణ పతకం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. రిషి విజయాన్ని పురస్కరించుకుని నందకుమార్, ఆయన సతీమణి సాయి చందన రిషిని అభినందించి, ప్రోత్సాహకంగా బాక్సింగ్ గ్లౌవ్స్‌ను అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు. రిషిని బాక్సింగ్‌లో ప్రోత్సహిస్తూ, అతని విజయానికి సహకరిస్తున్న తల్లిదండ్రులు అనంత కుమార్, శ్యామల దంపతులను కూడా నందకుమార్, సాయి చందన అభినందించారు. రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్‌లో రిషి ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, తొండవాడ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు ఆకాంక్షించారు.

## పదో తరగతి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి- డీఈఓ కె.వి.ఎన్. కుమార్



ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం

ప్రభుత్వ పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపదింపజేసి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కేబీఎన్ కుమార్ కోరారు. గురువారం మండలంలోని నెత్తకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈఓ కె.వి.ఎన్. కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి ఎస్ ఎస్ సి మిషన్ మార్చ్ 2027 కార్యక్రమాల అమలును పరిశీలించారు. పరీక్షలపై భయాన్ని వీడి



ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలని, ప్రతిరోజూ పాఠాలను పునశ్చరణ చేసుకోవాలని, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. గణిత పరీక్షల మూల్యాంకన పత్రాలను పరిశీలించి ఉపాధ్యా యులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా 6వ తరగతి విద్యార్థులు ధరణ్ తేజ్, శరణ్య పాఠశాలకు హాజరు కాకుండా బయట తిరుగుతున్న విషయాన్ని డీఈఓ గుర్తించారు. వెంటనే వారి తల్లిదండ్రులతో మాట్లాడి, కారణం లేకుండా విద్యార్థులను పాఠశాలకు దూరంగా ఉంచవద్దని సూచించారు. విద్యార్థుల హాజరుపై ప్రధానోపా ధ్యాయులు, తరగతి ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు అందిస్తున్న బియ్యం, చిక్కీలు, కోడిగుడ్లను పరిశీలించారు. పాఠశాల మరుగుదొడ్లు, తరగతి గదుల పరిశుభ్రతతో పాటు టాయిలెట్ క్లీనింగ్ మెటీరియల్‌ను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎం. తులసికుమారి, గణిత ఉపాధ్యాయురాలు రమణమ్మ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అభయ క్షేత్రంలో వయోవృద్ధులకు ఆరోగ్య సంరక్షణ పై అవగాహన





ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

ప్రపంచ వృద్ధుల దినోత్సవం అక్టోబర్ ఒకటి సందర్భంగా రేణిగుంట మండల వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి ఆదేశాల మేరకు హెల్త్ సూపర్వైజర్ కామరాజు మరియు ఎమ్ఎల్హెచ్పీ రేఖ రేణిగుంట బిస్మిల్లానగర్ నగర్ లోని అభయక్షేత్రం వృద్ధులను కలిసి ఆరోగ్య సంరక్షణ, ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం వారు తీసుకోవలసిన తగిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. వృద్ధుల ఆరోగ్య సంరక్షణ,సంక్షేమం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్వైజర్ కామరాజు అక్కడ పని చేసేవారికి,యాజమాన్యానికి సూచించారు. వృద్ధాప్యంలో ఎదురయ్యే అనారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి,తగిన వైద్య చికిత్స పొందడం ద్వారా ఆరోగ్యకర జీవితాన్ని గడపవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా వృద్ధుల ఆరోగ్యపరిరక్షణకు సంబంధించి వృద్ధులు క్రమం తప్పకుండా రక్తపోటు,మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు,పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సూచనల మేరకు అవసరమైన చికిత్స పొందాలని,సమతుల పోషకాహారం తీసుకోవడం, ఆకుకూరలు,కూరగాయలుపండ్లు,పప్పు ధాన్యాలు, పాలు,గ్రుడ్డు వంటి ఆహార పదార్థాలను తగిన మోతాదులో తీసుకుంటూ,శరీర సామర్థ్యాన్ని బట్టి ప్రతిరోజూ నడక లేదా ఇతర తేలికపాటి వ్యాయామాలు చేయాలని కోరారు. దీనివల్ల కండరాల బలం,శారీరక చురుకుదనం మెరుగుపడతాయన్నారు. వైద్యులు సూచించిన మందులను నిర్ణీత సమయానికి తీసుకోవాలని,సొంతంగా మందులు వాడటం లేదా వైద్యుల సలహా లేకుండా మందులు ఆపడం చేయకూడదని పేర్కొన్నారు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలిని శుభ్రమైన నీటిని తాగాలని, ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. నిద్ సమ సంప్ఏ చిన్న సమస్యను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఆరోగ్య సేవలను వినియోగించుకోవాలని, అవసరమైనప్పుడు వైద్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు. వృద్ధుల ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా,వారికి సమయానికి వైద్య సేవలు అందించడంతో పాటు ప్రేమాభిమానాలు,గౌరవం కల్పించాలని సూచించారు. వృద్ధుల ఆరోగ్య సంరక్షణ అనేది కుటుంబ సభ్యులకే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన తెలిపారు. వృద్ధులు ఆరోగ్యంగా, ఆనందంగా జీవించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్వైజర్ కామరాజు కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారు తమ అభయక్షేత్రానికి అందిస్తున్న వైద్య ఆరోగ్య సహాయానికి క్షేత్ర సంరక్షణ బాధ్యురాలు శ్రీ మతి తస్లీమా భాను కృతజ్ఞతలు తెలియజేశారు.

## స్థానిక సమరంలో 'కేడర్ పవర్' చూపించాలి..!

- 12 పంచాయతీల్లో పట్టు కోసం పకడ్బందీగా కార్యాచరణ..
- ప్రలోభాలకు తలవంచితే..ఎప్పటికీ తెలెత్తుకోలేరు..
- ప్రలోభాలకు లొంగకుండా ప్రతిపక్షంలో పోరాడిన వారే నాయకులు
- ప్రతి వార్డులో పార్టీ జెండా ఎగరాలి: చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి







ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి

'అతి త్వరలో రానున్న స్థానిక సమరంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 'క్యాడర్ పవర్' చూపించాలి.. ఎన్నికలకు ఇప్పటి నుంచే సర్వసన్నద్ధమవ్వాలి.. ప్రలోభాలకు ఇప్పుడు తల వంచితే.. భవిష్యత్తులో ఎప్పటికీ తలెత్తుకోలేరు.. ఎంత ప్రలోభ పెట్టినా లెక్క చేయకుండా పార్టీని నమ్మిన నాయకత్వానికి అండగా నిలబడితే రాజకీయాల్లో మంచి భవిష్యత్తు కలుగుతుంది.. అందుకు నిదర్శనమే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి రాజకీయ ప్రస్థానం.. సామాన్య కార్యకర్తగా వైఎస్ఆర్ కుటుంబంతో తిరుగుతూ ఆనాటి జడ్పీటీసీ సభ్యునిగా గెలిచి చంద్రబాబు సీఎం హోదాలో ఆయనను ప్రలోభపెట్టినా లెక్కచేయక పోవడం వల్లనే ఎమ్మెల్యేగా రెండు సార్లు గెలవడవే కాకుండా జగనన్న నాయకత్వంలో ప్రభుత్వ విప్ గా పనిచేసే అవకాశం దక్కింది.. ఆయనే మనందరికీ ఆదర్శం.." అంటూ రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎర్రావారిపాళెం మండలంలోని ఎర్రావారిపాళెం, కమల్ల, చింతగుంట, కూరపర్తివారిపల్లి, వీఆర్ అగ్రహారం, బోడేవాండ్లపల్లి, చెరుకువారిపల్లి పంచాయతీల్లో గురువారం చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికలను సాధారణ ఎన్నికలుగా కాకుండా పార్టీ గ్రామ స్థాయి బలాన్ని చాటుకునే కీలక సమరంగా భావించి ప్రతి కార్యకర్త ఇప్పటి నుంచే రంగంలోకి దిగాలని పిలుపునిచ్చారు. ఎర్రావారిపాళెం మండలంలోని 12 పంచాయతీల్లో సర్పంచ్, వార్డు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల వారీగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ప్రతి గ్రామం, ప్రతి పంచాయతీ, ప్రతి వార్డుపై ప్రత్యేక దృష్టి పెట్టి పార్టీ కేడర్‌ను సమన్వయం చేసుకోవాలన్నారు.

**ఏ వార్డునూ వదులుకోవద్దు**

ప్రతి వార్డూ పార్టీకి ముఖ్యమేనని, ప్రతి గెలుపునూ కీలక విజయంగా మలచేలా కృషి చేయాలని హర్షిత్‌రెడ్డి సూచించారు. ఏ వార్డునూ ఏకగ్రీవంగా వదులుకోవద్దని, ప్రజాస్వామ్యబద్ధంగా ప్రతి స్థానంలో పార్టీ అభ్యర్థులు బరిలో ఉండేలా చూడాలన్నారు. ఏకగ్రీవాల పేరుతో జరిగే ప్రలోభాలకు తావులేకుండా పార్టీ బలాన్ని ప్రతి మండలంలో చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

**విభేదాలకు స్వస్తి.. ఐక్యతే బలం**

నాయకులు, కార్యకర్తల మధ్య ఉన్న చిన్నచిన్న విభేదాలను పక్కనపెట్టి పార్టీ కోసం ఐక్యంగా పనిచేయాలని హర్షిత్‌రెడ్డి కోరారు. పార్టీ ఎవరికైతే అవకాశం ఇస్తుందో వారి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. వ్యక్తిగత అభిప్రాయాలు, విభేదాల కంటే పార్టీ ప్రయోజనాలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేస్తే స్థానిక ఎన్నికల్లో పార్టీ బలాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చన్నారు.

**కార్యకర్తలకు అండగా ఉంటాం**

కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ నాయకత్వం, పార్టీ శ్రేణులు, చెవిరెడ్డి కుటుంబం అండగా ఉంటాయని హర్షిత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ప్రజల్లో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని, ప్రతి గ్రామంలో పార్టీ బలాన్ని పెంచేలా కార్యాచరణ చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ నాయకులు, ఆయా పంచాయతీల పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి పంచాయతీలో పార్టీ జెండా ఎగరాలి

-- స్థానిక సమరానికి ఇప్పటి నుంచే కేడర్ సన్నద్ధం కావాలి-ఒక్క చోట కూడా ఏకగ్రీవం కావడానికి వీలు లేదు

-ప్రతి కార్యకర్త, నాయకుడు ఒక నెల రోజులు ఎన్నికలపై చొరవ చూపాలి: చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి





ప్రజా భూమి ప్రతినిధి పాకాల

స్థానిక ఎన్నికల్లో ప్రతి పంచాయతీలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలి.. ఎన్నికల్లో పోటీ చేయడానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలి.. ఒక్కచోట కూడా ఏకగ్రీవం కావడానికి వీలు లేదు.. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీని బలోపేతం చేస్తూ ప్రతి పంచాయతీలో పార్టీ అభ్యర్థి గెలిచేలా కేడర్ సమష్టిగా పనిచేయాలని చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికలను చివరి నిమిషంలో ఎదుర్కొనే పరిస్థితి లేకుండా ప్రతి గ్రామం, ప్రతి వార్డు స్థాయిలో పక్కా కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. పాకాల మండలంలోని దామలచెరువు పంచాయతీలో గురువారం సాయంత్రం పంచాయతీ పార్టీ నాయకులతో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకాల మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షించుకుని కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ప్రతి పంచాయతీలో బూత్ స్థాయి నుంచి కేడర్‌ను సమన్వయం చేసుకుని ఎన్నికల్లో పాల్గొనేలా సమాయత్తం చేయాలన్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రతి వార్డు కీలకమేనని, ఏ స్థానాన్నీ తేలిగ్గా తీసుకోకుండా అభ్యర్థుల ఎంపిక నుంచి ఎన్నికల ప్రచారం వరకు ముందస్తు ప్రణాళికతో వ్యూహాత్మకంగా పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవాలని, వాటి పరిష్కారం కోసం ప్రజల తరఫున అధికారులను నిలదీయాలన్నారు.

**కేడర్‌కు అండగా నాయకత్వం**

కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు నాయకత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మోహిత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. కార్యకర్తలు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంచుకుని ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని సూచించారు.

**విభేదాలకు తావివ్వొద్దు**

వ్యక్తిగత అభిప్రాయాలు, అంతర్గత విభేదాలను పక్కనపెట్టి పార్టీ ప్రయోజనాల కోసం, ఎన్నికల్లో అభ్యర్థి గెలుపు కోసం ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో బలమైన సమన్వయంతో పనిచేస్తే స్థానిక ఎన్నికల్లో పార్టీ శ్రేణుల బలం మరింత స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి పంచాయతీకి ప్రత్యేక బాధ్యతలు, ప్రతి వార్డుకు కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని మోహిత్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల, జిల్లా, రాష్ట్ర పార్టీ నాయకులు, పంచాయతీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విషమవుతున్న ప్లాస్టిక్ రక్కసి.. మానవ మనుగడకే ముప్పు

### ప్లాస్టిక్ రహిత నాయుడుపేట కు ప్రజలంతా సహకరించాలి: కమిషనర్



ప్రజ భూమి ప్రతినిధి నాయుడుపేట

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం మానవ మనుగడకు తీవ్రమైన ముప్పుగా మారిందని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజ్లులుల్లా అన్నారు. ప్లాస్టిక్ సంచులు, బాటిళ్లు నేల, నీరు, గాలిని కలుషితం చేస్తున్నాయని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలు మైక్రోప్లాస్టిక్స్‌గా మారి ఆహారం, నీరు, పాల ద్వారా మానవ శరీరంలోకి చేరుతున్నాయని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తినడంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని దహనం చేయడం వల్ల వెలువడే విషవాయువులు శ్వాసకోశ వ్యాధులకు దారితీస్తాయని హెచ్చరించారు. నాయుడుపేటను పరిశుభ్రంగా, ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ఇళ్ల వద్దే తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. ప్లాస్టిక్ సంచులకు బదులుగా కాటన్, జనపనార సంచులను వినియోగించాలని కోరారు. టీ కప్పులు, కవర్లు, వాటర్ బాటిళ్ల వంటి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో, కాలువల్లో వేయకుండా మున్సిపల్ వాహనాల్లోనే వేయాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# అట్టహాసంగా ప్రారంభమైన శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవము

- అమ్మవారికి ప్రభుత్వ లాంఛనాలతో పట్టు వస్త్రాలను సమర్పించిన దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి
- రాష్ట్ర పండుగగా వైభవంగా పోలేరమ్మ జాతర • జాతర నిర్వహణకు రూ.50 లక్షలు -- తొలి విడతగా రూ.40 లక్షలు విడుదల
- ఆలయ ఖాతాలో రూ.1.70 కోట్ల ఎఫ్‌డీ, రూ.25 లక్షలు జమ :దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి





ప్రజా భూమి ప్రతినిధి,వెంకటగిరి/తిరుపతి,
శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ జాతర సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణలతో కలిసి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రభుత్వ లాంఛనాలతో అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. వెంకటగిరి శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ తల్లి జాతరను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్న నేపథ్యంలో గురువారం భక్తిశ్రద్ధలతో జాతర కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి, తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, దేవాదాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి మాట్లాడుతూ, శ్రీ పోలేరమ్మ తల్లి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్రంలో పలు ప్రముఖ ఆలయాల ఉత్సవాలను రాష్ట్ర పండుగలుగా నిర్వహిస్తున్నామని, వాటి నిర్వహణకు దేవాదాయ శాఖ తరఫున ప్రతి పండుగకు ఏటా రూ.50 లక్షల వరకు నిధులు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా పోలేరమ్మ జాతరకు ఈ ఏడాది రూ.50 లక్షలు మంజూరు చేసి, తొలి విడతగా రూ.40 లక్షలు విడుదల చేసినట్లు చెప్పారు. ఆలయ ఖాతాలు, ఖర్చుల వివరాలు సమర్పించిన అనంతరం మిగిలిన రూ.10 లక్షలు విడుదల చేస్తామని వెల్లడించారు. శ్రీ పోలేరమ్మ ఆలయానికి భక్తులు, దాతల సహకారంతో బంగారు కిరీటం, పాదాలు, హస్తాలు, స్వర్ణహారాలు తదితర ఆభరణాలు సమకూరినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆలయానికి రూ.1.70 కోట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా ఉంచడంతో పాటు, ఎస్బీఐ ఖాతాలో రూ.25 లక్షలు జమ చేసినట్లు చెప్పారు. కొలితోట ప్రాంతానికి సంబంధించిన నిధులను కూడా భద్రపరుస్తామని, అవసరమైన సమయంలో ప్రభుత్వ అనుమతులతో అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తామని తెలిపారు. ఆలయ నిధులు సక్రమంగా వినియోగించేలా పూర్తి పారదర్శకతతో వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. వెంకటగిరి నియోజకవర్గంలోని నాలుగు ఆలయాలకు ధూపదీప నైవేద్యాల కింద ఏటా రూ.4.80 లక్షలు, మూడు ఆలయాల అభివృద్ధికి రూ.7.05 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 13 ఆలయాల నిర్మాణానికి రూ.4.60 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. వెంకటగిరి నియోజకవర్గంలోని అటవీ ప్రాంతంలో ఉన్న శ్రీ చెంచులక్ష్మి అమ్మవారి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తున్న నేపథ్యంలో అక్కడ మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. రాపూరు మండలంలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని దత్తత ఆలయంగా అనుసంధానం చేయడం ద్వారా చెంచులక్ష్మి ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులను వినియోగించుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. జాతర అనంతరం జిల్లా కలెక్టర్లు, అటవీ శాఖ అధికారులు, స్థానిక ఎమ్మెల్యేతో కలిసి కొలితోట ప్రాంతాన్ని పరిశీలించి అవసరమైన అభివృద్ధి చర్యలు చేపడతామని తెలిపారు. వెంకటగిరి ఎమ్మెల్యే మాట్లాడుతూ, శ్రీ పోలేరమ్మ తల్లి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధి, అమరావతి నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా క్యూ లైన్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. భక్తులు ఎండలో ఎక్కువసేపు వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా, క్రమపద్ధతిలో దర్శనం కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారన్నారు. క్యూ లైన్లలో భక్తులు గంటకు పైగా వేచి ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ పాటించి అధికారులకు సహకరించాలని, భక్తుల దర్శనానికి ప్రాధాన్యతనిస్తూ క్యూ లైన్లను సక్రమంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ, శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ జాతరకు వచ్చే ప్రతి భక్తుడికి సురక్షితమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే జిల్లా యంత్ర...

## పాకాల మండలంలో స్వచ్ఛత సేవ కార్యక్రమం..



ప్రజాభూమి ప్రతినిధి, పాకాల: (చంద్రగిరి)

తిరుపతి జిల్లా, పాకాల మండలం, కావలివారిపల్లి గ్రామంలో స్వచ్ఛత శ్రమదానము బుధవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ క్రిష్ణమనేని సావిత్రి,ప్రజా ప్రతినిధులు,ప్రజలు,మరియు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొని కార్యక్రమము విజయవంతం చేశారు.ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 16వ తేదీ నుండి మొదలై అక్టోబర్ 2వ తేదీన ముగుస్తుంది.ఇలాంటి కార్యక్రమములు వల్లన గ్రామ పంచాయతీ పరిసరాలు పరిశుభ్రత చేయబడి మన చుట్టు ప్రక్కల గల పర్యావరణం కలుషితం కాకుండా ఆరోగ్యవంతంగా మారుతుంది అని సింగిల్ విండో చైర్మన్ తెలియజేశారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేసిన సింగల్ విండో చైర్మన్ కృష్ణమనేని సావిత్రి..!

ప్రజా భూమి ప్రతినిధి, పాకాల: (చంద్రగిరి)



తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలం, కావలివారిపల్లి,గాండ్లపల్లి, లింగంపల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సూచనలతో సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు పాకాల సింగల్ విండో చైర్మన్ కృష్ణమనేని సావిత్రి చేతుల మీదుగా ఇంటింటికి వెళ్లి బుధవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేశారు.ఎన్టీఆర్ భరోసా పెన్షన్ తీసుకున్న లబ్ధిదారులు ప్రభుత్వం పట్ల హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు,సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

# రక్తదానానికి విద్యార్థినిల ముందడుగు - 40 మంది స్వచ్ఛందంగా రక్తదానం



ప్రజాభూమి, హిందూపురం టౌన్
రక్తదానం చేయడంలో విద్యార్థినిలు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని శ్రీ సత్యసాయి జిల్లా డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీక్రాంతి, ఎన్టీఆర్ వైద్యసేవల జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సమాజంలో రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించి, యువతలో సేవాభావాన్ని పెంపొందించడంలో విద్యార్థినిలు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. స్థానిక ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్, ప్రభుత్వ వైద్యశాల రక్తదాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.అంజలీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వైద్యాధికారులు మాట్లాడారు. ఆపద సమయంలో అవసరమైన వారికి రక్తం అందించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని, రక్తదానం ప్రాణదానంతో సమానమని తెలిపారు. మహిళా కళాశాలలో నిర్వహించిన శిబిరానికి విద్యార్థినిలు పెద్ద సంఖ్యలో స్పందించి స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ప్రత్యేకంగా నిలిచింది. సుమారు 40 మంది విద్యార్థినులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా రక్తదానానికి ముందుకు రావడం పట్ల నిర్వాహకులు అభినందనలు తెలిపారు. మహిళలు రక్తదానం చేయకూడదనే అపోహలకు చెక్ పెడుతూ విద్యార్థినీలు చూపిన చొరవ స్ఫూర్తిదాయకమన్నారు. రక్తదానంపై అవగాహన పెంచేందుకు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తమ వంతు కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో రక్తదానంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ హరీష్‌బాబు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ యశోదారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు, వైద్య సిబ్బంది తంజూమ్, చిట్టిబాబు, నందగోపాల్, సోమశేఖర్, హెచ్ఐవీ--ఎయిడ్స్ విభాగం సిబ్బంది తిప్పేస్వామి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, రెడ్ రిబ్బన్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్మికులకు సంక్షేమ బోర్డు ప్రయోజనాలు అందించాలి

**ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంచాలి..**
**-సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వీఆర్ రాము డిమాండ్**



ప్రజాభూమి, హిందూపురం టౌన్
బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా నిర్మాణరంగ కార్మికులకు నిజమైన ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వీఆర్ రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హిందూపురం ఏఎల్‌ఓ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రమణారెడ్డికి సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్ రాము మాట్లాడుతూ, కార్మికులు సుదీర్ఘ పోరాటాల అనంతరం 2026 మార్చి 1 నుంచి బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును ప్రభుత్వం పునఃప్రారంభించిందన్నారు. అయితే గతంలో అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను తిరిగి ప్రారంభించకుండా కొద్దిపాటి ప్రయోజనాలను మాత్రమే అందిస్తుండటంతో అత్యధిక మంది నిర్మాణరంగ కార్మికులకు సంక్షేమ పథకాలు అందని పరిస్థితి నెలకొందన్నారు. బోర్డులో రూ.4,500 కోట్లకు పైగా నిధులు ఉన్నట్లు అసెంబ్లీలో ప్రభుత్వం వెల్లడించినప్పటికీ ఆ నిధులు కార్మికుల సంక్షేమానికి పూర్తిస్థాయిలో వినియోగం కావడం లేదని విమర్శించారు. నిర్మాణరంగంలో ప్రమాదాలు నిత్యం జరుగుతున్నాయని, ప్రమాదాల కారణంగా అనేకమంది కార్మికులు ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరు శాశ్వతంగా అంగవైకల్యానికి గురవుతున్నారని తెలిపారు. ప్రమాదాలకు గురైన కార్మికులకు బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా తగిన ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో నిర్మాణరంగ కార్మికులకు రూ.10 లక్షల వరకు ప్రమాద బీమా అమలు చేస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ నిర్మాణరంగ కార్మికులకు తక్షణమే రూ.10 లక్షల ప్రమాద బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలన్నింటిని పునరుద్ధరించి, బోర్డులోని నిధులను కార్మికుల సంక్షేమానికి వినియోగించాలని కోరారు. నిర్మాణరంగ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును సమర్థవంతంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అనిల్‌కుమార్, మారుతికిషోర్, వెంకట్, నాగరాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**-పర్మినెంట్ చేయాలి -పీఆర్సీ అమలు చేయాలి -కనీస వేతనం చెల్లించాలి**




ప్రజాభూమి, హిందూపురం టౌన్
మున్సిపల్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ చాంబర్ ఎదుట నిరసన వ్యక్తం చేసి అసిస్టెంట్ కమిషనర్ క్రాంతికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలని, 12వ పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేసి మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలని కోరారు. కరువు భత్యం, మధ్యంతర భృతి చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు అమలు చేయడంతోపాటు కాంట్రాక్టు మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. పట్టణ విస్తీర్ణం పెరగడంతో పారిశుధ్య, ఇతర మున్సిపల్ సేవలపై పనిభారం పెరిగిందని, అందుకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని తెలిపారు. శాశ్వత స్వభావం కలిగిన పనుల్లో శాశ్వత కార్మికులను నియమించాలని హైకోర్టు తీర్పును అమలు చేయాలని కోరారు. పర్మినెంట్ మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న సరెండర్ సెలవులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని, పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించడంతోపాటు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి తక్షణమే ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తే రానున్న రోజుల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మురళి, అధ్యక్షుడు నరసింహమూర్తి, కే.బాలాజీ, మంజునాథ్, శ్రీరాములు, చంద్రశేఖర్, రామాంజనప్ప, ఈశ్వరమ్మ, గంగ, రత్నమ్మ, కవితమ్మ, మహేశ్వరమ్మ, చంద్ర మూర్తి, మల్లయ్య, అనిల్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే 'పేదల సేవలో' లక్ష్యం

**-అర్హులందరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు**
**-ప్రత్యేక అధికారి చక్రపాణి**

ప్రజాభూమి, హిందూపురం టౌన్




అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించి, అవసరమైన సహకారం అందించాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జిల్లా అటవీ శాఖ అధికారి చక్రపాణి సూచించారు. హిందూపురం మండలం మణేసముద్రం గ్రామ పంచాయతీలో గురువారం నిర్వహించిన పేదల సేవలో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత ఉన్నప్పటికీ అవగాహన లేక ప్రయోజనాలకు దూరమవుతున్న వారిని గుర్తించి, వారికి పథకాలపై పూర్తి సమాచారం అందించాలని సూచించారు. పి4 కార్యక్రమం, బంగారు కుటుంబాలు, మార్గదర్శి, హెల్పింగ్ హ్యాండ్స్, స్వయం సహాయక సంఘాలు తదితర కార్యక్రమాలతోపాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి వర్తించే పథకాల ద్వారా ప్రయోజనం చేకూరేలా అధికారులు మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు వీరయ్య, బాలాజీ, సురేంద్ర, మార్కెట్‌యార్డు చైర్మన్ అశ్వత్థరెడ్డి పాల్గొన్నారు. వారి ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వ పింఛన్లను పంపిణీ చేశారు. పథకాల అమలులో అర్హత కలిగిన ఒక్క లబ్ధిదారుడు కూడా మిగిలిపోకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దామోదరమ్మ, ఈఓఆర్డీ శివకుమార్, వివిధ శాఖల మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, గ్రామస్థులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మోహన్ బాబు యూనివర్సిటీలో ' ఐ ఆర్ పి బి ఎం ఎస్ -2026' అంతర్జాతీయ సదస్సు..!



ప్రజాభూమి ప్రతినిధి, చంద్రగిరి:
చంద్రగిరి మండలం, రంగంపేట సమీపం లోని మోహన్ బాబు యూనివర్సిటీకి చెందిన ఎం.బి. స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లోని ఫార్మసీ ప్రాక్టీస్ విభాగం ఆధ్వర్యంలో అక్టోబర్ 7 నుంచి 9వ తేదీ వరకు 'ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఇన్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, బయోసైన్సెస్ అండ్ మెడికల్ సైన్సెస్' ( ఐ ఆర్ పి బి ఎం ఎస్ -2026) 4వ అంతర్జాతీయ సదస్సు వైభవంగా జరగనుంది. ఔషధ, జీవశాస్త్ర, వైద్య రంగాల్లో నూతన పరిశోధనలను ప్రోత్సహించడంతో పాటు ప్రజలకు మెరుగైన ఆరోగ్య సంరక్షణనందించే ఆధునిక చికిత్సా విధానాలపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు వైస్ ఛాన్సలర్ పివి రమణ తెలిపారు.?"అంతరశాఖల సమన్వయంతో వ్యక్తిగత అవసరాలకు అనుగుణమైన వైద్యచికిత్సలు" అనే ప్రత్యేక ఇతివృత్తంతో రూపుదిద్దుకున్న ఈ వేదికపై వైద్యులు, ఫార్మసిస్టులు, పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని తమ పరిశోధనా అనుభవాలను పంచుకోనున్నట్లు ఆయన తెలిపారు. నేటి ఆధునిక కాలంలో వ్యక్తిగత వైద్య విధానాల ప్రాధాన్యత ఎంతగానో పెరిగిందని తెలిపారు. ప్రతి వ్యక్తి వయస్సు, ఆరోగ్య పరిస్థితి, జన్యుపరమైన లక్షణాలు, జీవనశైలి, వినియోగిస్తున్న ఇతర ఔషధాలను పరిగణనలోకి తీసుకుని సరైన చికిత్సను అందించడంపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చించనున్నారు. సైడ్ ఎఫెక్ట్స్ తగ్గించి, చికిత్స ఫలితాలను మరింత మెరుగుపరచడంపై అంతర్జాతీయ నిపుణులు తమ పరిశోధనాంశాలను ఇక్కడ పంచుకుంటారని ఆయన వెల్లడించారు.

## సౌర దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి

**-పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి**
**-అసిస్టెంట్ కమిషనర్ క్రాంతికుమార్**



ప్రజాభూమి, హిందూపురం టౌన్
సౌర విద్యుత్ ఏర్పాటుకు ప్రజలు చేసుకున్న దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేసి, పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ క్రాంతికుమార్ సూచించారు. గురువారం హిందూపురం మున్సిపల్ కార్యాలయంలో సౌర దరఖాస్తులపై సంబంధిత శాఖల అధికారులు, బ్యాంకు మేనేజర్లు, సూర్యఘర్ విక్రేతలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ సూర్యఘర్ పథకం కింద అందుతున్న దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి దరఖాస్తు పురోగతిని పరిశీలించాలన్నారు. వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని,దరఖాస్తుదారులకు బ్యాంకు రుణాలు, విద్యుత్ శాఖ అనుమతులు, సౌర పరికరాల ఏర్పాటు తదితర అంశాల్లో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. దరఖాస్తుల ప్రస్తుత స్థితి, పెండింగ్‌లో ఉన్న కేసులు, పరిష్కారానికి ఎదురవుతున్న సమస్యలు, పురోగతిని మరింత మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా నిరంతరం సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో విద్యుత్ శాఖ డీఈ చంద్రనాయక్, ఏడీఈ నాగన్న, ఎంపీడీఓ దామోదరమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ శివకుమార్, నారాయణ, మెప్మా డీఎంసీ గంగులయ్య, మెప్మా సీఓలు, బ్యాంకు మేనేజర్లు, సూర్యఘర్ విక్రేతలు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 10

శుక్రవారం 02 అక్టోబరు 2026


# భారతజాతి గుండె చప్పుడు మహాత్మా గాంధీ

**- మహాత్మా గాంధీ,లాల్ బహదూర్ శాస్త్రిల అడుగుజాడల్లో నడుద్దాం - గడికోట శ్రీకాంత్‌రెడ్డి**

ప్రజా భూమి ప్రతినిధి రాయచోటి

భారతజాతి గుండె చప్పుళ్లుగా నిలిచిన మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిల ఆశయాలు, ఆదర్శాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు అర్పించారు. సత్యం, అహింసలను గాంధీజీ తన ఆయుధాలుగా చేసుకుని బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగించిన పోరాటం ప్రపంచ చరిత్రలోనే ఒక విశిష్ట అధ్యాయమని అన్నారు. సహాయ నిరాకరణ, సత్యాగ్రహం వంటి శాంతియుత ఉద్యమాలతో స్వాతంత్ర్య సమరాన్ని ప్రజా ఉద్యమంగా మలిచారని పేర్కొన్నారు. చేతిలో కర్ర, ఒంటిపై ఖాదీ, చేతిలో చరఖా స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇస్తూ మురికివాడలను శుభ్రం చేయడం, అన్ని మతాలు సమానమేనని చాటిచెప్పడం ద్వారా గాంధీజీ ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని తీసుకొచ్చారని గుర్తుచేశారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో గాంధీజీ విగ్రహాలు నెలకొల్పడం ఆయన సిద్ధాంతాలకు ఉన్న విశ్వవ్యాప్త ఆదరణకు నిదర్శనమని అన్నారు. తమ హయాంలో రాయచోటి పట్టణంలో గాంధీజీ విగ్రహాన్ని నెలకొల్పామని ఆయన గుర్తుచేశారు. సత్యం, అహింస, శాంతి మార్గంలో ప్రపంచానికి గాంధీజీ చూపిన బాట నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. లాల్‌బహదూర్ శాస్త్రి దేశానికి రెండో ప్రధానిగా తన సరళత, నిజాయితీ, చిత్తశుద్ధి, దేశభక్తితో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. నిరాడంబర జీవితం,



అంకితభావంతో ప్రజాసేవకు కొత్త నిర్వచనం ఇచ్చిన మహనీయుడిగా శాస్త్రిజీని కొనియాడారు. ఆ మహనీయుల దేశభక్తి, చిత్తశుద్ధి, నిజాయితీ, సేవాభావాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, వారి ఆశయాలను ఆచరణలో పెట్టడమే వారికి అందించే నిజమైన నివాళి అని శ్రీకాంత్‌రెడ్డి అన్నారు.

**గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యానికి వైఎస్ జగన్ కృషి**

మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్య సాధన దిశగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని గుర్తుచేశారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా పరిపాలనను ప్రజల గడప వద్దకే తీసుకెళ్లడం జరిగిందన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో ఈ వ్యవస్థ కీలకంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ సచివాలయాలకు కూటమి ప్రభుత్వం పేర్లు మార్చిందన్నారు.

# ప్రభుత్వ భూమి.... గ్రామ కంఠం భూమి ఆక్రమణలను తొలగించండి

**గ్రామ కంఠంలో పేదలకు ఇంటి పట్టాలు ఇప్పించండి.**

ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రాపురం



మండలంలోని అనుపల్లి పంచాయతీ గోకులాపురం, ఉప్పలివంక గ్రామాల సమీపంలోని గ్రామ కంఠం, ప్రభుత్వ భూములను యదేచ్ఛగా కబ్జా చేసిన భూముల్లో పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేసి, సొరకాయలచేండ్ల లోని పొలాలకు వెళ్లేందుకు దారి కల్పించాలని గ్రామస్తులు గురువారం తహశీల్దార్ యు మధుసూదన్ రావుకి రైతులు ఫిర్యాదు చేశారు. అనుపల్లి రెవిన్యూ లో గోకులాపురం గ్రామంలో సర్వేనెంబర్ 50/3 లో 0.90 సెంట్లు గ్రామ కంఠం భూమి, 4/2 సర్వే నెంబర్ లోని 0.49 సెంట్ల ప్రభుత్వ భూమిని గోకులాపురం గ్రామానికి చెందిన కే రామచంద్రారెడ్డి ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశారు. కబ్జాదారుడు కే రామచంద్రారెడ్డి కబ్జా చేసిన భూమి విలువ సుమారు రూ. 40 లక్షల రూపాయలు విలువ ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సొరకాయలచెండ్లలో ఉన్న వ్యవసాయ భూములకు దారిలేకుండా ప్రభుత్వ భూమిని కబ్జా చేసి రామచంద్రారెడ్డి కంచె ఏర్పాటు చేస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి వెంటనే కంచెను తొలగించి రైతుల పొలాలకు దారి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 50/3 సర్వే నెంబర్ లోని గ్రామ కంఠంలో ఇంటి స్థలాలు లేని నిరుపేదలకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని గ్రామ ప్రజలు కోరారు. ఉప్పలివంక సమీపంలో ప్రభుత్వం ఎం ఎస్ ఎం ఈ పార్కు ఏర్పాటు చేస్తామని సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో కబ్జాదారులకు ప్రభుత్వ భూములపై కన్నేసి కబ్జా చేస్తున్నారు. దీనిపై తహశీల్దార్ యు మధుసూదన్ రావు స్పందిస్తూ ఆక్రమణకు గురైన గ్రామకంఠం, ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటాం, గ్రామ కంఠంలో పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేస్తాం, ప్రభుత్వం భూమిలో దారి ఏర్పాటు ఏర్పాటుచేసి మిగిలిన ప్రభుత్వ భూమికి కబ్జా కాకుండా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బండి రమణారెడ్డి, కె విజయ భాస్కర్ రెడ్డి, నరసింహారెడ్డి, జేజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# సెప్టెంబరులో నేరాలపై పోలీసుల ఉక్కుపాదం...

**-జూదం, బెట్టింగ్, ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా**

ప్రజా భూమి ప్రతినిధి- కడప లీగల్



నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు కడప జిల్లా పోలీసులు సెప్టెంబరులో విస్తృత స్థాయిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు బీఎన్ఎస్ఎస్ 126, 128, 129 సెక్షన్ల కింద 627 కేసుల్లో 2,994 మందిపై బైండోవర్ చర్యలు తీసుకున్నారు. వీరిలో 609 మంది రౌడీలు, 708 మంది అనుమానితులు, 529 మంది ట్రబుల్ మేకర్లు ఉన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన కేసుల్లో రూ.1.60 లక్షల జరిమానా విధించారు. సైబర్ నేరాలపై 227 ఫిర్యాదులు నమోదయ్యాయి. బాధితులు కోల్పోయిన రూ.2.02 కోట్లలో రూ.51.34 లక్షలను నిలుపుదల చేశారు. సీఈఐఆర్ ద్వారా 425 ఫిర్యాదులు అందగా 151 మొబైల్ ఫోన్లను, సుమారు రూ.33 లక్షల విలువైన ఆస్తిని రికవరీ చేశారు. జూదం, మట్కా, క్రికెట్ బెట్టింగ్‌పై 48 కేసులు నమోదు చేసి 275 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.7.14 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై ఐదు కేసుల్లో 105 దుంగలు, 2,353 కిలోల ఎర్రచందనం, ఎనిమిది వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌డీపీఎస్, నిత్యావసర వస్తువుల చట్టాల కింద కూడా కేసులు నమోదు చేశారు. నేరస్తులు, రౌడీషీటర్లు, అనుమానితుల కదలికలపై నిఘా కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

# మోడ మీద పల్లె సమస్యలు పరిష్కరిస్తాం

**-కూటమి ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఇవ్వాలి: ఎమ్మెల్యే మాధవరెడ్డి**

ప్రజా భూమి ప్రతినిధి కడప అర్బన్



నగరంలోని దేవుని కడపలోని మోడ మీద పల్లెలో నెలకొన్న మౌలిక సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని కడప ఎమ్మెల్యే మాధవరెడ్డి తెలిపారు. గురువారం వృద్ధులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్, డివిజన్ ఇన్‌చార్జి ఏవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు తెదేపా జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు దళితవాడలో ఏళ్లుగా సీసీ రోడ్డు నిర్మాణం జరగకపోవడం, తాగునీరు సక్రమంగా అందకపోవడం, పాఠశాలకు సరైన పెయింటింగ్ లేకపోవడం, పిల్లలు ఆడుకునేందుకు మైదానంలో గ్రావెల్ లేకపోవడం వంటి సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. సాధ్యమైన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యువరాజు, బండ్ల నాగేశ్వరరావు, శశి, గోపాల్, లలి, బాలకృష్ణ, శ్రీధర్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులే సమాజానికి మార్గదర్శకులు...

ప్రజా భూమి ప్రతినిధి కడప లీగల్




వృద్ధులు సమాజానికి మార్గదర్శకులని, వారి అనుభవాలు భావితరాలకు ఎంతో విలువైనవని జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రామగోపాల్ అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గాంధీనగర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ శాఖల స్టాళ్లను ఏర్పాటు చేసి వృద్ధులకు అందుతున్న సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రామగోపాల్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, తాతయ్యలు, నానమ్మల పట్ల చిన్ననాటి నుంచే ప్రేమాభిమానాలు, గౌరవభావం పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. వృద్ధుల హక్కులను గౌరవిస్తూ వారికి రక్షణ, ఆదరణ కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ వృద్ధుల త్యాగాలు, సేవలను ఎప్పటికీ మరువరాదన్నారు. వృద్ధులను కుటుంబానికి మూలస్తంభాలుగా భావించి ప్రేమతో చూసుకోవాలని సూచించారు. ప్రభుత్వం, న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సేవలు, వృద్ధుల సంక్షేమానికి సంబంధించిన చట్టాలపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్, ఆర్డీఓ ఎ. మురళి, డీఎస్పీ ఇ. బాలస్వామిరెడ్డి, డీఈఓ ఎస్. షంషుద్దీన్, మున్సిపల్ కమిషనర్ పి. భవానీ ప్రసాద్, పలువురు అధికారులు, వృద్ధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# స్వచ్ఛంద రక్తదానంతో బాధితుల్లో భరోసా నింపుదాం

**యువత పెద్దఎత్తున రక్తదానానికి ముందుకు రావాలి- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.పి.యుగంధర్**

ప్రజా భూమి ప్రతినిధి-కడప అర్బన్

రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడటంతో పాటు, బాధిత కుటుంబాల్లో భరోసా నింపవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.పి.యుగంధర్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా సేవలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ఏపీఎస్ఏసీఎస్ ఆదేశాల మేరకు కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రక్తనిధి కేంద్రం సహకారంతో గురువారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. పి. యుగంధర్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ మరియు క్షయ నివారణ అధికారి డా. ఎస్. రవి బాబు, ఉమ్మడి జిల్లాల ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ కార్యక్రమ అధికారి వేంపల్లి భాస్కర్ తదితరులు శిబిరాన్ని ప్రారంభించారు. ప్రతి సంవత్సరం అక్టోబరు 1న జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని



నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు 14 రోజుల పాటు స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా కూడా యువత పెద్దఎత్తున రక్తదానం చేయాలని డా. యుగంధర్ కోరారు. రక్తదానం చేయదలచిన వారు అర్హతా ప్రమాణాలను పాటించాలని అధికారులు సూచించారు. సాధారణంగా 18 నుంచి 65 సంవత్సరాల మధ్య వయస్సు, తగిన శరీర బరువు, సాధారణ రక్తపోటు, హిమోగ్లోబిన్ స్థాయిలతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నవారు రక్తదానం చేయవచ్చని తెలిపారు. జలుబు, జ్వరం వంటి అనారోగ్య పరిస్థితులు, ఇటీవల టాటూలు లేదా పియర్సింగ్‌లు చేయించుకోవడం, కొన్ని రకాల దీర్ఘకాలిక మందుల వినియోగం వంటి పరిస్థితుల్లో రక్తదానాన్ని తాత్కాలికంగా వాయిదా వేయాల్సి ఉంటుందని వివరించారు. డా. ఎస్. రవి బాబు మాట్లాడుతూ స్వచ్ఛంద రక్తదాతల సేవలను అభినందిస్తూ, రక్తదానం ప్రాముఖ్యతపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యంగా ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా రక్తదానం చేసేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. వేంపల్లి భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తించిన రక్తనిధి కేంద్రాల్లోనే రక్తదానం చేయాలని సూచించారు. సురక్షితమైన రక్తం అందుబాటులో ఉండేందుకు గుర్తింపు పొందిన రక్తనిధుల ద్వారా మాత్రమే రక్తదానం, రక్తసేకరణ జరగాలని తెలిపారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రక్తనిధి కేంద్రం వైద్యాధికారులు డా. సింధుజ, డా. రాజేంద్ర, డా. సంధ్య, డా. వినయ్, డీఐఎస్‌హెచ్‌ఏ సిబ్బంది, రక్తనిధి సిబ్బంది విశ్వనాథ్ రెడ్డి, రాజ్ ఖాన్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సీఎం పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి- జిల్లా కలెక్టర్

ప్రజా భూమి ప్రతినిధి- ప్రొద్దుటూరు

జలజీవన్ మిషన్ ప్రాజెక్టుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 5 న ప్రొద్దుటూరుకు రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి, అధికారులను ఆదేశించారు. గురువారం ప్రొద్దుటూరులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శాసన సభ్యులు నంద్యాల వరదరాజుల రెడ్డి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా తదితరులతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి సభా ప్రాంగణం, వేదిక, బారికేడింగ్, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, భద్రత తదితర ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఎలాంటి లోటుపా



ట్లు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకలు, పార్కింగ్ ప్రాంతాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. శాసన సభ్యులు నంద్యాల వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలిసారిగా ప్రొద్దుటూరు కు వస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం అయ్యేలా అధికారులు పనిచేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టేలా ఏ శాఖకు కేటాయించిన విధులు ఆ శాఖ అధికారులు ఎక్కడా పొరపాట్లకు తావివ్వకుండా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపి షేక్స్ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వి ఎస్ ముక్తియార్, ప్రొద్దుటూరు ఏఎస్పి కృష్ణ, జమ్మలమడుగు, కడప, బద్వేల్, పులివెందుల ఆర్డీఓ లు శిరీష, చంద్రశేఖర్, చిన్నయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్ ఇర్విన్, డిఆర్డిఎ పిడి రాజ్యలక్ష్మి, ఆర్డబ్ల్యూఎస్, ఆర్.అండ్.బి, ఎస్ పిడిసిఎల్, ఎస్ఈ లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. తొలుత జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి, శాసన సభ్యులు ఎన్ వరదరాజుల రెడ్డి, జిల్లా ఎస్పీ షేల్కే నచికేత విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ డా నిధి మీనా, జిల్లా అధికారులతో కలిసి బహిరంగ సభ ప్రదేశం, హెలిప్యాడ్ ప్రదేశాలను పరిశీలించి అధికారులకు తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

# లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ల పంపిణీ..

**పూతలపట్టు నియోజకవర్గం లోని మాధవరం పంచాయతీ స్వస్తిక్ నగర్‌లో ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్లను పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు :

పూతలపట్టు నియోజకవర్గం లోని మాధవరం పంచాయతీ స్వస్తిక్ నగర్ లో ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్లను పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పరిశీలించారు. గురువారంప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పథకం కింద సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పాల్గొని, లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లను పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగ కలెక్టర్ లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నెలనెలా పెన్షన్లను పంపిణీ చేస్తున్నారా, ఎవరైనా డబ్బులు ఆడిగారా అంటూ ఆరా తీశారు. పెన్షన్ల పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# సమాఖ్య ప్రతినిధులను అభినందించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు: చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆధునీకరణ, మౌలిక వసతుల కల్పనలో భాగంగా చిత్తూరు జిల్లా పండ్ల పరిశ్రమల సమాఖ్య ప్రతినిధులు గురువారం కలెక్టరేట్లోని నాగార్జున ఐఏఎస్ వీడియో కన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కోసం రూ.10,50,000 (పది లక్షల యాభై వేల రూపాయలు) విలువైన చెక్కును జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఈ నిధులను ప్రభుత్వ ఆసుపత్రిలోని ప్రసూతి మరియు ఆర్థోపెడిక్ విభాగాల ఆధునీకరణతో పాటు అవసరమైన వైద్య పరికరాల సమకూర్పునకు వినియోగించనున్నట్లు సమాఖ్య ప్రతినిధులు తెలిపారు. సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి సహకరించిన పండ్ల పరిశ్రమల సమాఖ్య ప్రతినిధులను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల ప్రతినిధులు రఘురాం చౌదరి, కట్టమంచి బాబి, సిద్ధార్థ్, మనోహర్, సుదర్శన్, చంద్రమోహన్, ఈశ్వర్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.



# స్వచ్ఛాంధ్ర అవార్డ్స్--2026 జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవం

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛాంధ్ర అవార్డ్స్--2026 జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని అక్టోబర్ 2న నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు రాష్ట్రవ్యాప్తంగా పారిశుద్ధ్య రంగంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారిని గుర్తించి, ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర అవార్డ్స్--2026ను అందిస్తోంది. ఇందులో భాగంగా 2026 ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 28 వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కాలంలో చేపట్టిన పారిశుద్ధ్య కార్యకలాపాల పనితీరు, వాటి మూల్యాంకనం ఆధారంగా అవార్డు విజేతలను ఎంపిక చేశారు. పారిశుద్ధ్య రంగంలో ప్రశంసనీయమైన సేవలు, అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఎంపికైన విజేతలకు జిల్లా స్థాయి అవార్డులు అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.



## ఏకలవ్య పోస్టుల భర్తీ ప్రకటనలో సవరణ

ప్రజాభూమి ప్రతినిధి, అడ్డతీగల
పోలవరం జిల్లాలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నిర్వహించనున్న వాక్–ఇన్ ఇంటర్వ్యూలకు సంబంధించి అధికారులు సవరణ ప్రకటన జారీ చేశారు. ఈ నెల 29న జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్‌కుమార్ విడుదల చేసిన ప్రకటనలో మొత్తం 26 పోస్టులకు వాక్–ఇన్ ఇంట ర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొనగా.. గురు కులం కార్యదర్శి ఈ నెల 30న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు మూడు పోస్టులను తొలగించారు. మూడు పోస్టులు తొలగింపుతొలుత ప్రకటించిన 26 పోస్టుల్లో టీజీటీ, పీజీటీ తెలుగు–2, పీజీటీ ఇంగ్లిష్–1 పోస్టులను తాజాగా తొలగించినట్లు అధికారులు తెలిపారు. దీంతో అభ్యర్థులు సవరించిన పోస్టుల వివరాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.అడ్డతీగలలో అక్టోబర్ 3న..సవరించిన ఖాళీలకు సంబంధించి అక్టోబర్ 3న అడ్డతీగల ఏకలవ్య పాఠశాలలో వాక్–ఇన్ ఇంటర్వ్యూలు నిర్వ హించనున్నారు. అలాగే అక్టోబర్ 6న చింతూ రు ఏకలవ్య పాఠశాలలో ఇంటర్వ్యూలు జరుగుతాయని జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ తెలిపారు.అర్హత కలిగిన అభ్యర్థులు పోస్టుల తొలగింపుతో పాటు సవరించిన ఖాళీల వివరాలను గమనించి, నిర్ణీత తేదీల్లో సంబంధిత ఏకలవ్య పాఠశాలల్లో నిర్వహించే వాక్–ఇన్ ఇంటర్వ్యూలకు హాజరు కావాలని అధికారులు సూచించారు.

## మళ్లీ వాయిదా పడ్డ ఎస్ఎంసీ ఎన్నికలు



ప్రజా భూమి,ప్రతినిధి, అడ్డతీగల
అడ్డతీగల మండలం ఎల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించాల్సిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు రెండోసారి వాయిదా పడ్డాయి. గురువారం నిర్వహించాల్సిన ఎన్నికలకు అవసరమైన కోరం లేకపోవడంతో ఎన్నికల ప్రక్రియను వాయిదా వేశారు. ఎస్ఎంసీ ఎన్నికల కోసం మొత్తం 110 మంది సభ్యులు హాజరు కావాల్సి ఉండగా.. 90 మంది మాత్రమే హాజరయ్యారు. దీంతో ఎన్నికల నిర్వహణకు అవసరమైన కోరం పూర్తి కాకపోవడంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఇప్పటికే ఒకసారి ఎన్నికలు వాయిదా పడగా, తాజాగా మరోసారి వాయిదా పడటం గమనార్హం.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్ ఎఫ్ఏసీ మాట్లాడుతూ.. ఎస్ఎంసీ ఎన్నికలు పాఠశాల అభివృద్ధిలో ఎంతో కీలకమైనవని తెలిపారు. పాఠశాలలో మౌలిక వసతుల మెరుగుదలతో పాటు విద్యార్థుల విద్యా ప్రగతికి తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరమన్నారు. ప్రతి తల్లిదండ్రి ఎన్నికల ప్రక్రియకు సహకరించి, పాఠశాల అభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందించాలని కోరారు.



## రాష్ట్ర స్థాయి పోటీల నేపథ్యంలో క్రీడా పోటీల నిర్వహణ తేదీల్లో మార్పు

**అక్టోబర్ 3వ తేదీన కాకినాడ, కోనసీమ జిల్లాలో పోటీలు నిర్వహణ**

ప్రజాభూమి ప్రతినిధి, రంపచోడవరం
రాష్ట్ర స్థాయి పోటీల తేదీలు ఖరారైన నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో నిర్వహించాల్సిన క్రీడా పోటీల తేదీల్లో మార్పులు చేసినట్లు యు/19 ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ వెంకట రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.కరాటే, టేబుల్ టెన్నిస్ పోటీలు అక్టోబర్ 3న నిర్వహించనున్నట్లు తెలిపారు. కరాటే పోటీలు కాకినాడ జిల్లా పిఠాపురంలో, టేబుల్ టెన్నిస్ పోటీలు కాకినాడ డీఎస్ఏలో జరుగుతాయని పేర్కొన్నారు.అదేవిధంగా బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీలు డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం జి. వేమవరం గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠ శాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత క్రీడాకారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయు లు, పీఈటీలు ఈ మార్పులను గమనించి పోటీలకు హాజరుకావాలని సూచించారు.మరిన్ని వివరా ల కోసం +91 94402 70583 నంబరులో సంప్రదించాలని ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ వెంకట రమణ తెలిపారు.

## భవన నిర్మాణ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

### పెండింగ్‌లో ఉన్న బీమా నగదు వెంటనే విడుదల చేయాలని డిమాండ్



ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల
భవన నిర్మాణ కార్మికుల న్యాయ మైన డిమాండ్లను ప్రభుత్వం వెంట నే పరిష్కరించాలని వినాయక తాపీ పనివాళ్ల సంక్షేమ సంఘం నాయ కులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం అడ్డతీగల మండల కేంద్రంలో కార్మికు లు భారీ ర్యాలీ నిర్వహించారు.స్థానిక వినాయక తాపీ పనివాళ్ల సంక్షేమ సంఘం భవనం నుంచి ప్రారంభమైన ర్యాలీ అడ్డతీగల పురవీధుల మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుంది. అనంతరం భవన నిర్మాణ కార్మికుల కార్యదర్శి గుల్లాల సురేష్‌బాబు ఆధ్వర్యంలో తహ సీ ల్దార్ తేజస్వినికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల బీమా సొమ్మును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు.కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం వైస్ ప్రెసిడెంట్ చాగంటి ఆదినారాయణ, లింగం పెద్దకాపు, శ్రీను, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దెంగేటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నివారణపై అవగాహన




ప్రజా భూమి ప్రతినిధి అడ్డతీగల
బాల్య వివాహాల రహిత గ్రామాలుగా తీర్చిదిద్దే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎలర్ట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సూచించారు. అడ్డతీగల-4 అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికల తల్లిదండ్రులకు బాల్య వివాహాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై పడే ప్రభావాలపై తల్లిదండ్రులకు వివరించారు. బాలికలకు సరైన వయసులో వివాహం జరిగేలా చూడడంతో పాటు, వారి విద్యను కొనసాగించేందుకు తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రభుత్వ యంత్రాంగంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కె. లక్ష్మి, ఎం. విజయకుమారి, ఇ. వరలక్ష్మి, కె. రాజులమ్మ, ఏఎన్ఎం పి. సత్యవతి, ఆశా కార్యకర్త బి. దేవుడమ్మ, ఎలర్ట్ సంస్థ సభ్యులు ఎం. చిన్నారెడ్డి, ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన రోజునే రక్తదానం చేసిన సబ్ కలెక్టర్



ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం.
చింతూరు సబ్ కలెక్టర్ గా గురువారం బాధ్యతలు స్వీకరించిన చిట్టాపులి నరేంద్ర పడాల్ అదే రోజు రక్త దానం చేసి ప్రజల మన్ననలు పొందారు. సబ్ కలెక్టర్ లో ఉన్న సేవా దృక్పథాన్ని చూసి ప్రజలు ప్రశంసిస్తున్నారు. రక్తదాన దినోత్సవం సందర్భంగా చింతూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో సబ్ కలెక్టర్ చిట్టాపులి నరేంద్ర, సిఆర్పిఎఫ్ 42వ బెటాలి యన్ అసిస్టెంట్ కమాండెంట్ సంతోష్ కుమార్, ఇన్స్పెక్టర్ అంబు సీజన్, డాక్టర్ స్పందన పాల్గొ న్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న అధికారులు సిబ్బంది రక్తదానం ప్రాముఖ్యతను వివరిం చారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రమాద బాధితు లకు, శస్త్ర చికిత్సలు చేయించుకునే రోగులకు, వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ రక్తం అవసరమైన వారికి రక్తదానం ఎంతో ఉపయో గ పడుతుందని పేర్కొన్నారు. ఒకరు చేసే రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడేందుకు దోహద పడుతుందని తెలి పారు. రక్తదానం పై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, స్వచ్ఛందంగా రక్తదానం చేసేం దుకు యువత ముందుకు రావా లని ఈ సంద ర్భంగా పిలుపునిచ్చారు. రక్తం అవసరమైన సమయంలో సకాలంలో అందుబాటులో ఉండేలా స్వచ్ఛంద రక్తదాతలు తమ వంతు సహకారం అందిం చాలని సూచించారు. సమాజ సేవలో భాగంగా నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో సేవా భావాన్ని పెంపొందించడంతో పాటు ప్రాణాలను కాపాడడంలో కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రక్తదానం పట్ల ఉన్న అపోహలను తొలగించి, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా వైద్యుల సూచనల మేరకు రక్తదానానికి ముందుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ అధికారులు, వైద్య సిబ్బంది, ఇతర సిబ్బంది పాల్గొని రక్తదాన శిబిరం నిర్వహణలో తమ సహకారం అందించారు.

## ముర్ల నాగేశ్వరరావు దంపతులకు ఘనంగా వీడ్కోలు



ప్రజాభూమి ప్రతినిధి
రంపచోడవరం
ప్రజలకు ఏ ప్రభుత్వ ఉద్యోగైన మంచి సేవలు అందించిన ఎడల ప్రజల్లోనూ ప్రభుత్వ అధికారులలో మంచి గుర్తింపు ఉందని రంపచోడవరం ఐటీడీఏ ఎపీఓ జనరల్ డివిన్వి రమణ పేర్కొన్నారు. గురు వారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాల్లో ఐటీడీఏ కార్యాలయంలో అటెం డర్‌గా విధులు నిర్వహిస్తూ పద వీ విరమణ పొందిన ముర్ల నాగేశ్వరరావు దంపతులకు ఘనంగా వీడ్కో లు కార్యక్రమం నిర్వహించారు.ఈ సంద ర్భంగా ఏపీఓ జనరల్ డివిన్వి రమణ మాట్లా డుతూ సుమారు 36 సంవత్సరాల పాటు ప్రభు త్వ సేవల్లో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందడం అభినందనీయమన్నారు. విధి నిర్వ హణలో క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచే సిన ఆయన సేవలను ఆదర్శప్రాయం అని అ న్నారు. అనంతరం నాగేశ్వరరావును శాలు వాతో సత్కరించి, పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా సన్మానించారు.పదవీ విరమణ అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవిం చాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, పీహెచ్ఓ నరేంద్ర కుమార్, ఐటీడీఏ పరిపాలన అధికారి ఎర్రం శెట్టి రాజు, పిఏఓ ఎల్ రాంబాబు, ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ గొర్రె శ్రీకాంత్, సీనియర్ సహాయకులు శ్రీనివాస రావు, డి. ప్రభాకర్ రావు అధికారులు, సూపరిండెంట్ రాజారెడ్డి, వేదవతి, నర్సింగరావు, నాగభూషణం, దారా రాజు, నాగేంద్ర,శివ వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధుల హక్కులు, సంక్షేమ పథకాలపై అవగాహన




ప్రజాభూమి ప్రతినిధి
రంపచోడవరం
రంపచోడవరం మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని గురువారం రాష్ట్ర కవుల, కళాకారుల తెలుగుతల్లి వృద్ధాశ్రమంలో నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, జె.ఎఫ్.సి. మేజిస్ట్రేట్ శ్రీ ఎం. మురళి గంగాధర రావు పాల్గొని వృద్ధులకు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందుతున్న సీనియర్ సిటిజన్ల హక్కులు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వృద్ధా శ్రమంలోని వసతులను పరిశీలించి, వృద్ధుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వృద్ధ మహిళలకు చీరలు, పురుషులకు లుంగీలు, పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. వృద్ధుల హక్కుల పరిరక్షణకు అందుబాటులో ఉన్న న్యాయ సహాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో న్యాయ వా దులు ఎం.వి.ఆర్. ప్రకాష్, యాళ్ల శ్రీనివాస్ రావు, చుక్క సంతోష్ కుమార్, డి. లక్ష్మీనారాయణ, టి. వీరబాబు, గౌరీశంకర్, వృద్ధాశ్రమం కమిటీ యాజమాన్య ప్రతినిధి నటరాజ్, కోర్టు సూపరింటెండెంట్ నాగభూషణం, పోలీసు సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## విఆర్ పురం జెడ్పీ హైస్కూల్ ఎస్ ఎం సీ కమిటీ ఎన్నిక

ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం.
విఆర్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ ఎం సి కమిటీ ఎన్నిక సజావుగా జరిగింది. జరిగిన ఈ ఎన్నికల్లో చైర్మన్ గా ముత్యాల సీతామహాలక్ష్మి, వైస్ చైర్మన్ గా మోదుగు వెంకన్నబాబు, కమిటీ సభ్యులుగా వల్లి సుందరం, సున్నం రాజు, పోసి సుధాకర్, పి రమణ, ప్రియాంక, మంగతాయారు, బద్రమ్మ, కే రమేష్, సిహెచ్ శాంతలు ఎన్నికయ్యారు. వీరితో పాఠశాల హెచ్ ఎం అజయ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. తదుపరి కమిటీ సభ్యులు తొలి సమావేశం ఏర్పాటు చేశారు. పాఠశాల అభివృద్ధి విధి విధానాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పల్లె పండగ ద్వారా పల్లెల ప్రగతి మరింత వేగవంతం



ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం.
రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.11,085 కోట్లు కూటమి ప్రభుత్వం కేటాయించిందని, పల్లె పండగ 3.0 ద్వారా ఈ కార్యక్రమం ద్వారా పల్లెల ప్రగతి మరింత వేగవంతం అవుతుందని, టీడీపీ మండల అధ్యక్షుడు బొర్రా నరేష్ కుమార్, జనసేన మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ అన్నారు. గురువారం రేకపల్లి గ్రామపంచాయతీ ఉమ్మడివరం గ్రామంలోని రెడ్డి గుంపు గ్రామంలో వి బి జి రామ్ జి పథకంలో పల్లె పండగ 3.0 కార్యక్రమంలో భాగంగా మేకల షెల్టర్ శంకుస్థాపన కార్యక్రమంను నిర్వహిం చారు.



ఈసందర్భంగా టిడిపి మండల అధ్యక్షుడు, జనసేన మండల అధ్యక్షుడు మాట్లాడుతూ గత ప్రభు త్వంలో విధ్వంసానికి గురైన గ్రామాలకు 'పల్లె పండగ'తో ఊపిరి పోస్తున్నాయని, ప్రధాని మోదీ సహకారం, చంద్రబాబు అనుభ వం, పవన్ కల్యాణ్ హుషారుతో పల్లెకు పట్టాభిషేకం చేస్తున్నాయని, సుస్థి ర ప్రభుత్వంతోనే నిరంతర అభివృద్ధి సాధ్యమని, మంచికి ప్రజలు మద్దతుగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఇతర గ్రామ సభ్యులు, సిబ్బంది, గ్రామ కార్యదర్శి ప్రసాద్, ఏపీవో రెడ్డి బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రంపచోడవరం నూతన సబ్ కలెక్టర్ డి.పృద్వి రాజ్ కుమార్



ప్రజాభూమి ప్రతినిధి
రంపచోడవరం
రంపచోడవరం సబ్ డివిజన్ పరిధిలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం నూతన సబ్ కలెక్టర్ డి.పృద్వి రాజ్ కుమార్ పేర్కొన్నారు.రంపచోడవరం నూతన సబ్ కలెక్టర్‌గా డి. పృద్వీరాజ్ కుమార్ గురువారం సబ్ కలెక్టర్ వారి కార్యాలయంలో నూతన సబ్ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ డి.పృద్వి రాజ్ కుమార్ మాట్లాడుతూUPSC -2023 లో 493వ ర్యాంకు సాధించడం జరిగిందనీ ఆయన తెలిపారు.2024 బ్యాచ్ IAS అధికారి గతంలో శ్రీకాకుళం జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్ గా శిక్షణ పొందడం జరిగిందని ఆయన తెలిపారు.పోలవరం జిల్లా రంపచోడవరం డివిజన్ పరిధిలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు,ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని సబ్ కలెక్టర్ డి. పృద్వీరాజ్ కుమార్ తెలిపారు.

రంపచోడవరం డివిజన్లోని ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలతో పాటు రెవిన్యూ శాఖకు సంబంధించిన సమస్యలు ప్రభుత్వం నిబంధనల ప్రకారం పరిష్కారం కొరకు కృషి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ వారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ వారి ఆదేశాలు సూచనలు ఎప్పటికప్పుడు పాటిస్తూ ఈ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వివిధ సంక్షేమ పథకాలు అందించే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. నూతన సబ్ కలెక్టర్ గా ఈరోజు ఉదయం 10 గంటలకు పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా 8 మండలాలకు సంబంధించిన తాసిల్దార్లు, డిప్యూటీ తాసిల్దార్లు కార్యా లయ సిబ్బంది తదితరులు నూతన సబ్ కలెక్టర్ వారిని బొకేలు అందజేసి సాదరంగా ఆహ్వానిం చడం జరిగింది. ఈ కార్యక్రమం లో తహసీల్దార్లు సీ హెచ్.బాలాజీ, ఎ.సత్యనారాయణ,స్వామి, సిహెచ్. శ్రీనివాసరావు, అమ్మాజీ, తేజస్విని, రామచంద్రరావు, శ్రీరాములు,సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో ఎ. సత్యనారాయణ, డిప్యూటీ తాసిల్దార్ శ్రీధర్, సీనియర్ సహాయకులు డి. ఇందిరా బాయ్, అలెగ్జాండర్, యూనిస్, రామకృష్ణ,అశోక్, దాసు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# గాంధీ ఆశయ సాధనకు కృషి చేస్తాం

## లేడీ యాంప్తిల్ కళాశాల విద్యార్థినులు, అధ్యాపకుల సామూహిక ప్రతిజ్ఞ

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి :

అహింసా సిద్ధాంతం, సత్యాగ్రహం, సత్యమేవ జయతే అనే నినాదాలతో దేశ స్వాతంత్ర్య సాధనకు మహాత్మా గాంధీ చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు ప్రతిజ్ఞ చేశారు.గాంధీ జయంతిని పురస్కరించుకుని కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురు వారం కళాశాల ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. లక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థినులు కలిసి గాంధీజీ ఆశయాల సాధనకు కృషి చేస్తామని సామూహికంగా ప్రతిజ్ఞ చేశారు.

**స్వాతంత్ర్య ఉద్యమంలో మచిలీపట్నం పాత్ర కీలకం...**కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీ చూపిన అహింసా మార్గం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. మచిలీపట్నం ప్రాంతానికి కూడా స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు.మహాత్మా గాంధీ చేపట్టిన ఉప్పు సత్యాగ్రహంలో మచిలీపట్నం సమీపంలోని చిన్నాపురం గ్రామం కీలక పాత్ర పోషించిందని లంకిశెట్టి బాలాజీ పేర్కొన్నారు. నాటి చిన్నాపురం గ్రామస్తులు స్వాతంత్ర్య ఉద్యమానికి తమ వంతు సహకారం అందించేందుకు ఒంటిపై ఉన్న బంగారాన్ని సైతం సమర్పించి దేశభక్తిని చాటారని తెలిపారు.గాంధీజీ మచిలీపట్నంలోని ఆంధ్ర జాతీయ కళాశాలను సందర్శించడం ఈ ప్రాంత చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టమన్నారు. మచిలీపట్నంలో జన్మించిన భోగరాజు పట్టాభి సీతారామయ్య ఆల్ ఇండియా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎంపిక కావడం మచిలీపట్నం ప్రజలకు గర్వకారణమని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఈ ప్రాంత ప్రజలు, నాయకులు అందించిన సేవలను నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**యువతకు గాంధీజీ జీవితం ఆదర్శం...**కళాశాల ప్రిన్సిపాల్ పి. లక్ష్మి మాట్లాడుతూ మహాత్మా గాంధీజీ నిరాడంబర జీవితం నేటి యువతరానికి ఆదర్శప్రాయంగా ఉందని అన్నారు. గాంధీజీ ఆచరించిన సత్యం, అహింస, ప్రేమ, సేవా భావాలను విద్యార్థులు తమ జీవితాల్లో అనుసరించాలని సూచించారు.సత్యం మాట్లాడటం, తోటి వారిని ప్రేమించడం, ఇతరులకు హాని కలిగించకుండా జీవించడం, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడం వంటి మంచి లక్షణాలను విద్యార్థులు అలవర్చుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. గాంధీజీ జీవితం కేవలం చరిత్ర పాఠంగా కాకుండా ప్రతి ఒక్కరికీ ఆచరణీయమైన సందేశంగా నిలవాలని అన్నారు.

**త్యాగాల ఫలితమే నేటి స్వాతంత్ర్యం...**ఎంసీపీఎల్ డైరెక్టర్ కొల్లు జ్ఞానసాయి మాట్లాడుతూ నీతి, నిజాయితీ, అహింసా సిద్ధాంతాలతో స్వాతంత్ర్య సంగ్రామంలో తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుల్లో మహాత్మా గాంధీజీ అగ్రగణ్యులని అన్నారు.దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీతో పాటు అనేకమంది స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలు మరువలేనివని పేర్కొన్నారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాతావరణంలో జీవిస్తున్నామని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగ స్ఫూర్తిని నేటి యువత ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

**సామూహిక ప్రతిజ్ఞ...**అనంతరం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినులు, అధ్యాపకులు గాంధీజీ ఆశయాలను ఆచరిస్తామని, సత్యం-అహింసా మార్గంలో నడుస్తామని, సమాజంలో శాంతి, సోదరభావం, సేవా భావాలను పెంపొందించేందుకు కృషి చేస్తామని సామూహికంగా ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరినాథ్ బాబు, అధ్యాపకులు విజయశ్రీ, మున్వర్, సురేష్, ఇతర అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# వృద్ధుల కళ్లల్లో ఆనందం నింపిన వెలుగు ఫౌండేషన్

## ఘనంగా ప్రపంచ వృద్ధుల దినోత్సవ వేడుకలు.. ప్రత్యేక వైద్య శిబిరం

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి:

వృద్ధులు సమాజానికి అమూల్యమైన సంపదని, 60 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఒక చరిత్ర పుస్తకంతో సమానమని మచిలీపట్నం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి. లీలా ప్రసాద్ అన్నారు. వారి అనుభవాల్లో ఎన్నో జీవిత పాఠాలు, వారి చిరునవ్వు వెనుక ఎన్నో త్యాగాలు దాగి ఉంటాయని పేర్కొన్నారు.ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈడేపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమంలో వెలుగు ఫౌండేషన్ అధ్యక్షుడు చందమామ బాబు ఆధ్వర్యంలో గురువారం వేడుకలను ఘనం గా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ టి. లీలా ప్రసాద్ మాట్లాడుతూ వృద్ధులను సన్మానించడం మాత్రమే కాకుండా వారి ఆరోగ్యం, ఆత్మగౌరవం, సంక్షేమం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలను అధిగమించేందుకు తేలికపాటి వ్యాయామం, మానసిక ప్రశాంతత ఎంతో అవసరమని సూచించారు. వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు.

**వృద్ధులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత...**చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ టి. ఉష్మ మాట్లాడుతూ తమ పిల్లలు బాగుండాలని కోరుకుంటూ జీవితాంతం ఎన్నో త్యాగాలు చేసిన మాతృమూర్తులు, పితృదేవతలు అభినందనీయులని అన్నారు. వృద్ధులను గౌరవించడం, వారితో మానవత్వంతో మెలగడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా గుర్తించాలని సూచించారు. వృద్ధుల సంక్షేమం కోసం వెలుగు ఫౌండేషన్ చేస్తున్న సేవలను ఆమె అభినందించారు.ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో జీవించాల్సి వచ్చినంత మాత్రాన వృద్ధులు నిరాశ, నిస్పృహలకు లోను కావాల్సిన అవసరం లేదన్నారు. ఆత్మవిశ్వాసంతో, ఉత్సాహంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. పండుగలు, పర్వదినాల సందర్భంగా వృద్ధాశ్రమానికి వచ్చి వృద్ధులతో కలిసి ఆనందాన్ని పంచుకుంటామని తెలిపారు.

**వృద్ధులతో కేక్ కట్.. పండ్లు, మిఠాయిల పంపిణీ..**వేడుకల్లో భాగంగా వృద్ధుల చేత కేక్ కట్ చేయించి, వారికి పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. వృద్ధులకు అవసరమైన సబ్బులు, టూత్‌పేస్టులు తదితర నిత్యావసర సామగ్రిని వెలుగు ఫౌండేషన్ అధ్యక్షుడు చందమామ బాబు అతిథుల చేతుల మీదుగా అందజేశారు.డాక్టర్ టి. ఉష్మ వృద్ధాశ్రమ నిర్వహణ కోసం సుమారు రూ.30 వేల విలువైన మందులను అందజేశారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధుల కోసం చేపడుతున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు.

**వృద్ధులకు ప్రత్యేక వైద్య పరీక్షలు...**వృద్ధుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ టి. లీలా ప్రసాద్, డాక్టర్ టి. ఉష్మ, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ తోట వీరేంద్రనాథ్ తదితర వైద్యులు వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి అవసరమైన మందులు, వైద్య సలహాలు, ఆరోగ్య పరిరక్షణ సూచనలు అందించారు.కార్యక్రమంలో వైద్య, సంక్షేమ శాఖ అధికారులు కళ్యాణి, లక్ష్మీ దుర్గ, వీవీఎస్ రమేష్, వెలుగు ఫౌండేషన్ ఉపాధ్యక్షులు రేపల్లె వెంకట వీర వసంతరావు, డీజే జగ్గారావు, నారాయణపురం పీహెచ్‌సీ సిబ్బంది, వృద్ధాశ్రమ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



***దశాబ్దాల సమస్యలకు కూటమి ప్రభుత్వంలో పరిష్కారం*తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, కాలువల అభివృద్ధికి పెద్దపీట*సీతారాంపురంలో, పల్లె పండుగ-3.0'లో మంత్రి కొల్లు రవీంద్ర**

# ప్రగతి పథంలో మచిలీపట్నం

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మచిలీపట్నం నియోజకవర్గంలో అభివృద్ధి పను లు వేగవంతమయ్యాయని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, కాలువల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.'పల్లె పండుగ-3.0' కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం రూరల్ మండలం సీతారాంపురంలో గురువారం మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో చేపట్టిన అభి వృద్ధి పనుల వివరాలతో ఏర్పాటు చేసిన ప్రగతి రథాన్ని పరిశీలించారు. సీతారాంపురంలో రూ.14. 70 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు.త్వరలోనే అన్ని గ్రామా ల్లో మురుగునీటి కాలువలను శుభ్రం చేయడంతో పాటు తాగునీటి పైప్‌లైన్ పనులను పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. గత ఏడాది రూ.54 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశామని, తాజాగా మరో రూ.80 కోట్లు మంజూ ర య్యాయని చెప్పారు. గ్రామాల వారీగా అవసరాలను గుర్తించి మౌలిక వసతు ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

**అభివృద్ధి పనులపై పరిశీలన...**మచిలీపట్నం మూడు స్తంభాల సెంటర్ రోడ్డులో జరుగుతున్న వాటర్ పైప్‌లైన్ మరమ్మతు, రోడ్డు అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు. పనుల నాణ్యత, పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేసేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

అనంతరం సీతారాంపురంలో నిర్వహించిన గ్రామసభలో ప్రజల తో కలిసి పాల్గొన్న మంత్రి గ్రామ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. గ్రామంలో 870 మంది రైతులకు రూ.1.20 కోట్ల మేర 'అన్నదాత సుఖీభవ' ప్రయోజనం, 254 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, 215 మందికి 'తల్లికి వందనం', 16 మందికి 'ఆటోడ్రైవర్ల సేవలో', 27 మందికి హార్టికల్చర్ ద్వారా ఆర్థిక సహాయం అందు తోందని తెలిపారు.గ్రామంలో రూ.88 లక్షల వ్యయంతో మంచినీటి సౌకర్యం, రోడ్లు, డ్రైనేజీ, ఇంటింటికీ కుళాయి వంటి మౌలిక వసతులు కల్పించినట్లు మం త్రి వివరించారు. ఉచిత బస్సు తదితర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కూడా వివరించారు.

**బందరు పోర్టుతో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు...**బందరు పోర్టు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. పోర్టుకు అనుబంధంగా పరిశ్రమలు, పెట్టుబడులు రావడంతో ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఒక సంస్థను ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టేలా ఏడాది కాలంగా కృషి చేశామని, ఫలితంగా రూ.8,000 కోట్ల పెట్టుబడితో పాటు సుమారు 10 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ప్రాజెక్టుకు మార్గం సుగమమైందన్నారు. దీనికి అనుబంధంగా మరిన్ని పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

**గ్రామ స్వరాజ్యానికి ప్రాధాన్యం..**జీ రాంజీ పథకం ద్వారా మంజూరైన రూ.44 లక్షల విలువైన పను లకు శంకుస్థాపన చేసినట్లు మంత్రి తెలిపారు. 'పల్లె పండుగ' కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ.11 వేల కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. గ్రామ స్వరాజ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, తాగు, సాగునీటి పథకాలను ప్రారంభిస్తున్నామని చెప్పారు.మచిలీపట్నం ప్రాంతానికి రూ.80 కోట్ల నిధులు మంజూరు కావడం సంతోషకరమన్నారు. వైద్యారోగ్య రంగంలో మార్పులకు చర్యలు చేపడుతున్నామని, ఈ ప్రాంతానికి మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మం జూరు కావడం ఇందుకు నిదర్శనమన్నారు. హార్టికల్చర్‌పై ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తూ రైతులకు అవసరమైన అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రకాశం బ్యారేజీకి ఎగువన ఒక బ్యారేజీ, దిగువన మరో బ్యారేజీ నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా అభివృద్ధి పనులను కార్యరూపంలో చూపిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, రూరల్ పార్టీ అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.












# సామాజిక బాధ్యతలో భాగంగా హంసలదీవిలో ఏపీజీబీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ హంసలదీవి:



ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ( ఏపీజీబీ ) ప్రాంతీయ కార్యాలయం, గుడివాడ ఆధ్వర్యంలో, కోడూరు శాఖ మార్గదర్శకత్వంలో మరియు అటవీ శాఖ సహకారంతో హంసలదీవిలో విజిలెన్స్ అవగాహన మరియు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రాంతీయ మేనేజర్ కె.ఆంజనేయులు , మచిలీపట్నం మేనేజర్ శ్రీ సీహెచ్. అశోక్ సాయి , ఆర్. జగదీశ్ కుమార్ (రీజినల్ విజిలెన్స్ ఆఫీసర్), ప్రాంతీయ కార్యాలయానికి చెందిన సీనియర్ మేనేజర్లు, కోడూరు శాఖ మేనేజర్ వినయ్ , స్థానిక శాఖల మేనేజర్లు పవన్, ప్రదీప్ కుమార్ తదితరులతో పాటు మొత్తం 50 మంది ఏపీజీబీ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.హంసలదీవి బీచ్ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన పెంపొందించడం వంటి కార్యక్రమాల్లో బ్యాంకు సిబ్బంది చురుకుగా పాల్గొన్నారు. బ్యాంకింగ్ సేవలకే పరిమితం కాకుండా, సమాజం మరియు పర్యావరణం పట్ల తమ సామాజిక బాధ్యతను నిర్వర్తించడంలో ఏపీజీబీ ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు.కార్యక్రమంలో ఏపీజీబీ సిబ్బంది చూపిన ఉత్సాహభరితమైన భాగస్వామ్యాన్ని అటవీ శాఖ అధికారులు అభినందించారు. ఇంత పెద్ద సంఖ్యలో ఏపీజీబీ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని, ఇలాంటి స్వచ్ఛతా కార్యక్రమంలో చురుకైన భాగస్వామ్యం చూపడం ఇదే తొలిసారి అని వారు పేర్కొన్నారు. సిబ్బంది చూపిన గొప్ప సహకారం, అంకితభావం మరియు సమష్టి భాగస్వామ్యానికి అటవీ శాఖ అధికారులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రాంతీయ మేనేజర్ కె. ఆంజనేయులు మాట్లాడుతూ, సమాజ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత వంటి అంశాల్లో కూడా బ్యాంకు తన సేవలను సామాజిక బాధ్యతగా సమర్థవంతంగా నిర్వహిస్తుందని అని పేర్కొన్నారు.ఏపీజీబీ సిబ్బంది సమష్టి భాగస్వామ్యంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. సామాజిక బాధ్యతను తన కార్యకలాపాల్లో అంతర్భాగంగా చేసుకుని, సమాజ సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న సంస్థగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ తన నిబద్ధతను మరోసారి చాటిచెప్పింది.



# గ్రంథాలయాల ఆధునీకరణకు ప్రాధాన్యం

***2026-27 బడ్జెట్‌కు ఏకగ్రీవ ఆమోదం**

***సీసీ కెమెరాలు, పోటీ పరీక్షల పుస్తకాల కొనుగోలుకు నిర్ణయం**

మచిలీపట్నం ప్రజాభూమి ప్రతినిధి:

ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌కు సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. గురువారం మధ్యాహ్నం సంస్థ చైర్మన్ ఎం. ఎస్. బేగ్ అధ్యక్షతన చైర్మన్ ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు.సమావేశంలో పౌర గ్రంథా లయ శాఖ సంచాలకులు కేటాయించిన 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌పై సభ్యులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. జిల్లాలోని గ్రంథాలయాలను ఆధునీకరించి, పాఠకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయిం చారు. ఇందులో భాగంగా జగ్గయ్యపేట ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయాన్ని ఆధునీకరించడంతో పాటు అవసరమైన గ్రంథాలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే మచిలీపట్నంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం, విజయవాడలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆధునీకరణ పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలకు సమావేశం ఆమోదం తెలిపింది.వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు, ఉద్యోగార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 'ఆన్ డిమాండ్' విధానంలో పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను కొనుగోలు చేసి గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. దీంతో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి అవసరమైన అధ్యయన సామగ్రి మరింత సులభంగా లభించనుంది.గ్రంథాలయాల అభివృద్ధికి పుస్తకాలు, ఇతర సామగ్రిని విరాళంగా అందిస్తున్న దాతలకు చైర్మన్ ఎం.ఎస్. బేగ్ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రజలు, దాతలు గ్రంథాలయాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని కోరారు. ఆధునిక సౌకర్యాలతో గ్రంథాలయాలను అభివృద్ధి చేసి విద్యార్థులు, ఉద్యోగార్థులు, పాఠకులకు మరింత మెరుగైన సేవలు అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని చైర్మన్ ఎం.ఎస్. బేగ్ తెలిపారు.ఈ సమావేశంలో సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్, విద్యాశాఖ నుంచి విద్యాలత, పంచాయతీ శాఖ నుంచి ఎం.ఏ. అబ్బాస్, వయోజన విద్యాశాఖ నుంచి ఎం.డి. హసీం బేగ్, ఇతర జిల్లా శాఖల అధికారులు, డిప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ ఎల్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో దళారులను ప్రోత్సహించేది లేదు

***సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేస్తున్నాం *సంక్షేమానికి తోడు ఆర్థికంగా బలపడేందుకు అనువైన ప్రోత్సాహం అందిస్తాం*గత పాలనలో శ్రీకాకుళం పూర్తిగా నష్టపోయింది*ప్రభుత్వ భవనాల నిర్మాణం అసంపూర్తిగా మారింది *అర్హులైన పేదలకు నివాసయోగ్యం కాని స్థలాలు చూపించారు*లే- అవుట్ల మెరక పేరుతో విపరీతమైన మట్టి దోపిడీకి పాల్పడ్డారు*జగనన్న కాలనీల పేరుతో విపరీతమైన దోపిడీకి పాల్పడ్డారు *దోపిడికి పాల్పడిన నాయకులు బాగానే ఉన్నారు - అధికారులు బలయ్యారు*అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్**

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

నియోజకవర్గంలో దళారులను ప్రోత్సహించేది లేదని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. ఉద్యోగాలు, పింఛన్లు, ప్రభుత్వం ద్వారా అయాచిత లబ్ధి ఇప్పిస్తామని చెప్పే దళారుల మాటలు నమ్మవద్దని పిలుపునిచ్చారు. గురువారం ఘంటసాల మండలం శ్రీకాకుళం స్వర్ణ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పేదల సేవలో 2.0 అభివృద్ధి సంక్షేమం ప్రజల భాగస్వామ్యం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మా ట్లాడుతూ పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంచేం దుకు కూటమి ప్రభుత్వం సంక్షేమ పరిపాలన అందిస్తోందన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, స్త్రీ శక్తి ద్వారా మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, దివ్యాంగ శక్తి ద్వారా దివ్యాంగులకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, మత్స్యకారుల సేవలో, ఆటో డ్రైవర్ల సేవలో, చేనేత భరోసా, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల ఉచిత గ్యాస్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం, అన్నా క్యాంటీన్లు ఇలా మరెన్నో సంక్షేమ కార్యక్రమాల ద్వారా పేదలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది అన్నా రు. దీంతో పాటు పేదలు ఆర్థికంగా ఎదిగేందుకు, డ్వాక్రా మహిళలను కోటీశ్వరులుగా, పారిశ్రా మిక వేత్తలుగా మార్చేందుకు వారి ఆసక్తికి అనుగుణంగా తగిన వ్యాపారాలు పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకునేందుకు అనువుగా స్త్రీ నిధి ద్వారా రుణ ప్రోత్సాహాలు, ప్రారంభించే పనిని బట్టి శాఖల వారీగా సబ్సిడీ ప్రోత్సాహాలు కూటమి ప్రభుత్వం అందిం చేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఉపాధి సర్వే ద్వారా పేదల ఆలోచనలు ఆకాం క్షలు తెలుసుకొని వారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. అభివృద్ధి పరంగా చూస్తే శ్రీకాకుళం గ్రామంలో గత ప్రభుత్వంలో చేపట్టిన ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ఎంపిక చేసిన స్థల సమస్య కారణంగా లక్షల రూపాయలు వృధాగా మారాయన్నారు. అప్పటి ప్రజా ప్రతినిధి అవగాహన రాహిత్యం కారణంగా శ్రీకాకుళం గ్రామ ప్రజలకు తీవ్ర నష్టం కలిగింది అన్నారు. జగనన్న కాలనీల పేరిట ఎంపిక చేసిన స్థలం నివాస యోగ్యం కాకపోవడం పేదలు తమకు ఇచ్చిన పట్టాలని తిరిగి ఇచ్చేయడంతో ఆ కార్యక్రమం కూడా విఫలమై, అర్హులైన పేదలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. మరోవైపు పేదలు ఇల్లు నిర్మించుకునేందుకు సిద్ధమైన లే-అవుట్లలో తీవ్రమైన అవినీతి, అక్రమాలు జరిగాయన్నారు. గృహ నిర్మాణాలకు కేటాయించిన ఇనుము, సిమెంటు దారి మళ్ళించి నాయకులు సొమ్ము చేసుకుంటే నాయకుల తప్పిదాలకు అధికారులు బలయ్యారన్నారు. జగనన్న కాలనీల మెరక పేరుతో విపరీతమైన మట్టి దోపిడికి పాల్పడి అప్పటి నాయకులు కోట్లు దండుకున్నారన్నారు. మెరక పనులు సక్రమంగా చేయకపోవడంతో నేటికీ అనేక కాలనీలు పల్లపు ప్రాంతాలుగా మారి నివాసితులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం పేదలకు మేలు చేసేందుకు కేటాయించిన నిధుల్లో అవినీతితో పేదలకు అన్యాయం జరిగింది అన్నారు.తమ కూటమి ప్రభుత్వంలో పల్లె పండుగ పేరుతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో రూ.పదివేల కోట్లతో గత రెండేళ్లలో సిమెంట్ రోడ్లు, తారు రోడ్లు పెద్ద ఎత్తున నిర్మించారన్నారు. ఈ గ్రామంలో ఇప్పటికే రూ.48 లక్షలతో సీసీ రోడ్లు, సూరపనేనివారిపాలెం గ్రామంలో పాఠశాల కు ప్రహరీ గోడ నిర్మించామన్నారు. తాజాగా పల్లె పండుగ మూడో విడత అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. సూరపనేనివారిపాలెం గ్రామానికి నూతన ప్రధాన రహదారి నిర్మించేందుకు రూ.3.20 కోట్లు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ విద్యార్థినులు రైతులకు ఎల్-నీనో నేపథ్యంలో పాటించవలసిన జాగ్రత్తలు ప్రయోగాత్మకంగా వివరించారు. పొగాకు కషాయం, తయారీ ప్రయోజనాలు వివరించా రు. అనంతరం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు లబ్ధిదారులకు అందించారు. సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుముడి సాయిబాబు, తహసీల్దార్ విజయ ప్రసాద్, ఎంపీడీఓ సుబ్బారావు, ఎంఈఓ మోమిన్, ఏఓ డీ.అనూష, హెచ్ఓ రమేష్, డిప్యూటీ ఎంపీడీఓ కే.వెంకటేశ్వరరావు, గ్రామ ప్రత్యేక అధికారి యార్లగడ్డ శివ రామ ప్రసాద్, మాజీ సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్, ఎస్ఐ వేమన చందన, పంచాయతీ కార్యదర్శి నాగ నాంచారమ్మ, వివిధ శాఖల అధికారులు, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.




Printed and Published and owned by A.RAMAMOHANREDDY, Printed at sri lakshmi narasimha artprinters, H.NO. 28-5-257,housing board colony, Anantapur-515001, Andhra Pradesh.and Published from H.NO. 28-5-257,housing board colony, ANANTAPUR-515001, Andhra Pradesh. Editor : A.RAMAMOHANREDDY.RNI NO:APTEL/2023/90641, Cell: 9502116677

## కత్తిపూడిలో ఘనంగా మెగా జాబ్ మేళా: ఉద్యోగార్థులకు నియామక పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



ప్రజాభూమి ప్రతినిధి–ప్రత్తిపాడు

యువతలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారికి ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రత్తిపాడు నియోజకవర్గ శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ రాజా అన్నారు. కాకినాడ జిల్లా, శంకవరం మండలం కత్తిపూడిలోని సీతారామ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీమతి వరుపుల సత్యప్రభ ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగ నియామక (ఆఫర్) పత్రాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు కార్పొరేట్, ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం జాబ్ మేళాలు, నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతోందన్నారు. యువత ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

## యువతే రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది: ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

### కత్తిపూడి సీతారామ కళాశాలలో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించిన శాసనసభ్యురాలు



ప్రజాభూమి ప్రతినిధి–ప్రత్తిపాడు

యువతే రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది అని, విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యురాలు శ్రీమతి వరుపుల సత్యప్రభ రాజా అన్నారు. "యువత భవితకు భరోసా" కార్యక్రమంలో భాగంగా శంఖవరం మండలం కత్తిపూడిలోని సీతారామ జూనియర్ ఓ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ఆమె ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి, వారి ఆశయాలు, భవిష్యత్ లక్ష్యాలు, విద్యా మరియు ఉపాధి అవకాశాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం యువత సంక్షేమం, నైపుణ్యాల పెంపుదల, ఉద్యోగ–ఉపాధి అవకాశాల కల్పనకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. యువత ఆశయాలకు అండగా నిలిచి వారి భవిష్యత్తుకు భరోసా కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు చిన్నతనం నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించడం ద్వారా సమాజాభివృద్ధిలో చురుగ్గా భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు కూటమి నాయకులు, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవ వేడుకలు

### చదరంగం పోటీ విజేతలకు బహుమతులు అందజేత



ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

వయోవృద్ధులు అంటే కేవలం వయస్సు పెరిగి ఏమీ చేయలేని నిస్సహాయకులు మాత్రమే కాదని, సుమారు 40 సంవత్సరాల పాటు ఎన్నో కష్టాలను ఎదుర్కొని తమ శక్తియుక్తులను ధారపోసి, జీవితానుభవంతో కుటుంబానికి, సమాజానికి ఎంతో శ్రమ, త్యాగం చేసి మన అభివృద్ధికి బాటలు వేసిన విజయ సారథులు అని సీనియర్ సిటిజెన్స్ సంక్షేమ సంఘ అధ్యక్షులు యర్రంశెట్టి వెంకట రత్నం అన్నారు. ఈరోజు అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నామని అందులో భాగంగా పాలకొల్లు నియోజకవర్గం సీనియర్ సిటిజెన్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పెన్షనర్స్ భవనం నందు చదరంగంపోటీలునిర్వహిస్తున్నామని యర్రంశెట్టి వెంకట రత్నం తెలియజేసారు. ఈ చదరంగం పోటీలలో 16 మంది వయో వృద్ధులు పాల్గొనగా... వర్ధినీడి సూర్య వెంకట రత్నాజీ రావు ( ప్రథమ) మానెం ధన గణేష్ (ద్వితీయ) కలిదిండి వెంకటపతి వర్మ (తృతీయ) ర్యాలీ విష్ణు మూర్తి (ప్రోత్సాహక) బహుమతులు గెలుసుకున్నారు.

సంఘ ప్రధాన కార్యదర్శి జి ఎస్ ఎన్ మూర్తి, కోశాధికారి డా. పేరిచర్ల సత్య ప్రతాప్ రాజుల పర్యవేక్షణ లో దివి సూర్యనారాయణ మాస్టారు న్యాయ నిర్ణేతగా వ్యవహారించారు. ఈసందర్భంగా...సంఘానికి గొప్పసేవ చేస్తున్న వయో వృద్ధులు పెనుగొండ సూర్యనారాయణ, గోపరాజు గోపి గార్లను సంఘ గౌ.అధ్యక్షులు వంగా నరసింహ రావు, కొండ్రెడ్డి సూర్యనారాయణలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డా. సంగీనీడి వెంకట రంగారావు శృంగారపు కృష్ణ ప్రసాద్ మాస్టారు,గెద్దాడ పనీంద్రుడు,యర్రా అజయ్ కుమార్, యర్రమిల్లి నరసింహ రావు (కంచి వి వి సత్యనారాయణబోనం మునసబు, ముచ్చర్ల రామ కృష్ణ ప్రసాద్, పేరిచర్ల రామరాజు, ఈదర నాగేశ్వరరావు,పేరిచర్ల వెంకట సత్య మార్తండ వర్మ,ఏలూరి శ్రీనివాసరావు,మండెల పెద్ద, వాకలపూడి బాబ్జి తదితరులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేసారు.

## యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

### ప్రొహిబిషన్, ఎక్సైజ్ సి.ఐ. ఏం రామశేషయ్య



ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

పాలకొల్లు రూరల్ మండలం ఎస్.చిక్కాల హైస్కూల్‌లో పాలకొల్లు ప్రొహిబిషన్ ఓ ఎక్సైజ్ స్టేషన్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు మరియు సైకోట్రోపిక్ పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన 275 మంది విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది, అలాగే పాలకొల్లు ప్రొహిబిషన్ ఓ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పాలకొల్లు ప్రొహిబిషన్ ఓ ఎక్సైజ్ సి.ఐ. ఏం రామశేషయ్య మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు, సైకోట్రోపిక్ పదార్థాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక మరియు సామాజిక దుష్ప్రభావాల గురించి విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, చెడు స్నేహాలు మరియు మాదకద్రవ్యాల వినియోగానికి దారితీసే అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల విద్య, ఆరోగ్యం, కుటుంబ జీవితం మరియు భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు పడే అవకాశం ఉందని వివరించారు. మాదకద్రవ్యాలకు బానిస కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, క్రీడలు, విద్య మరియు సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. అలాగే, మాదకద్రవ్యాల విక్రయం, అక్రమ రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసినట్లయితే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ప్రధాన ఉపాధ్యాయులు, ఇతర బోధన మరియు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## కిసాన్ మేళాలో సమగ్ర పంట యాజమాన్యంపై అవగాహన

### పంట నమోదు తప్పనిసరి.. కౌలు రైతులు సీసీఆర్‌సీ పొందాలి



ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

ఆగిరిపల్లి గ్రామంలో గురువారం జిల్లా వనరుల కేంద్రం, ఏలూరు ఆధ్వర్యంలో, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ, కృష్ణా జిల్లా సౌజన్యంతో కిసాన్ మేళా నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ ఉప సంచాలకులు జి. వెంకటమణి మాట్లాడుతూ వరి పంటలో కాండం తొలుచు పురుగు నివారణకు రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఈనిక దశలో పురుగు ఉధృతి అధికంగా ఉంటుందని తెలిపారు. పంటలో తెల్లకంకులు కనిపిస్తే సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని, కౌలు రైతులు పంట సాగుదారుల హక్కు పత్రం (సీసీఆర్‌సీ) పొందిన అనంతరం పంట నమోదు చేయించుకుంటే వ్యవసాయ శాఖ పథకాలకు అర్హత పొందవచ్చని వివరించారు. నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు మామిడిలో మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తూ సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారం, చెట్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. మామిడిలో సూక్ష్మపోషకాలైన జింక్, బోరాన్‌ను అవసరాన్ని బట్టి వినియోగించాలని, బెట్ట పరిస్థితులకు గురైన చెట్లకు పొటాషియం ఆధారిత ఎరువులు ఉపయోగించాలని సూచించారు. ప్లాంట్ గ్రోత్ రెగ్యులేటర్లను అధికంగా వినియోగించకుండా పరిమితంగా ఉపయోగించాలని, పూత సమయంలో తేనెమంచు పురుగు నివారణకు ముందస్తుగా జిగురు అట్టలు ఏర్పాటు చేసి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ఎం. ఉషాకుమారి, మామిడి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె. ఉమామహేశ్వరి, కీటక శాస్త్రవేత్త డాక్టర్ జి. షాలిరాజు, మండల వ్యవసాయ అధికారిణి జె. భవాని, మండల ఉద్యాన శాఖ అధికారిణి కె. జ్యోతిప్రియాంక, రైతు సేవా కేంద్ర సిబ్బంది, పొన్నం వెంకట రామచంద్రరావు మరియు గ్రామాల రైతులు పాల్గొన్నారు

## మోడరన్ డిగ్రీ కాలేజీలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజా భూమి ప్రతినిధి–రామచంద్రపురం.




రామచంద్రపురం పట్టణంలో ప్రముఖ విద్యా సంస్థ లయన్ జి. వి. రావు డిగ్రీ కాలేజీ ఫ్రెషర్స్ డే వేడుకలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా సీనియర్ స్టూడెంట్స్ , జూనియర్ స్టూడెంట్స్ ని ఆత్మీయంగా స్వాగతిస్తూ కోలాహలంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో టాపర్స్ గా నిలిచిన 22 మంది మోడరన్ డిగ్రీ ర్యాంకర్స్ ను అధినేత డాక్టర్ లయన్ జి. వి. రావు, ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు, అకాడమిక్ ఇంచార్జ్ జి మాణిక్యం ,ఇతర అధ్యాపక బృందం అభినందన పూర్వకంగా సత్కరించారు. అనంతరం విద్యారంగంలో నేటికీ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రిన్సిపాల్ పి. వెంకటేశ్వర్లును అధినేత జి.వి.రావు సమక్షంలో అధ్యాపకులు, విద్యార్థులు అత్యంత ఘనంగా సన్మానించారు. సాంస్కృతిక ప్రదర్శనలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన "అష్టాదశ పీఠాల" ప్రదర్శన అందరిలో ఆధ్యాత్మిక భావాన్ని నింపి, కార్యక్రమానికి హైలెట్ గా నిలిచింది. ఈ సందర్భంగా అధినేత జి. వి.రావు మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న అంతర్గత, సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీయడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని, ఆ ఉద్దేశంతో ప్రతి విద్యా సంవత్సరం క్రమం తప్పకుండా ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ పి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటి విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం చూపిస్తే అద్భుతాలు సృష్టించగలరని వ్యాఖ్యానించారు. విద్యార్థులు లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ కె.సాయిరాం చౌదరి, మోడరన్ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## 'పేదల సేవలో 2.0'తో అట్టడుగు వర్గాలకు ఆర్థిక భరోసా: కలెక్టర్

- కత్తిపూడిలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్
- డ్వాక్రా మహిళలు, పేద కుటుంబాల స్వయం సమృద్ధికి యంత్రాంగం కృషి



ప్రజాభూమి ప్రతినిధి–ప్రత్తిపాడు

ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరి, వారి సమగ్ర ఆర్థిక పురోగతికి బాటలు వేసేలా జిల్లా యంత్రాంగం నిరంతరం పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గం, శంఖవరం మండలం కత్తిపూడి గ్రామంలో గురువారం నిర్వహించిన "పేదల సేవలో 2.0" కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ రాజాతో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సహాయాన్ని కేవలం నిత్యావసర ఖర్చులకే పరిమితం చేయకుండా, స్థిరమైన ఆర్థికాభివృద్ధికి పెట్టుబడిగా మార్చుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ముఖ్యంగా కార్యక్ర మం ద్వారా అట్టడుగు వర్గాలకు అవసరమైన మార్గదర్శకత్వం, నైపుణ్యాలు, విత్త సహాయం అందించి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. డ్వాక్రా మహిళలకు అందిస్తున్న బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకుని సూక్ష్మ, కుటీర పరిశ్రమలు, వ్యాపారాలు ప్రారంభించేందుకు అధికారుల యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మాట్లాడుతూ, ప్రతి నిరుపేద కుటుంబం స్వయం సమృద్ధి సాధించాలనే సంకల్పంతో ప్రభుత్వం ౫4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. పేదలకు మార్గదర్శకులను అనుసంధానిస్తూ ఆర్థిక, సామాజిక భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్, ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రత్యేక అధికారి, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బిస్ స్కూల్ బస్సు బోల్తా, ముగ్గురు చిన్నారులకు తీవ్ర గాయాలు

ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు



నూజివీడు పట్టణంలోని బిస్ స్కూలుకు సంబంధించిన బస్సు ఆగిరిపల్లి చుట్టుపక్కల గ్రామాల నుండి విద్యార్థులను స్కూలుకి తీసుకువస్తుండగా ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి, బైక్ ని ఢీ కొట్టిన క్రమంలో అదుపుతప్పి, 30 మంది చిన్నారులతో సహా బస్సు బోల్తా పడిన దుర్ఘటన అగిరిపల్లి మండలం వడ్లమాను గ్రామం వద్ద చోటుచేసుకుంది. ఈ ఘటనతో గ్రామ స్తులు ఒక్కసారిగా నిర్ఘాంత పోయారు, హుటాహుటిన గ్రామస్తులు బస్సులో చిక్కుకుపోయిన చిన్నారులను బోల్తా పడిన బస్సులో నుంచి కాపాడడంలో వారి వంతు సాయం చేశారు,ఈ ఘటనలో బిస్ స్కూల్ బస్సు లో ఉన్న 30 మంది చిన్నారుల్లో,ముగ్గురు చిన్నారులకు తీవ్ర గాయాలు కాగా,బిస్ స్కూల్ బస్సు కు ఎదురుగా వచ్చిన వాహనాన్ని బస్సు ఢీకొనడంతో ఆ వాహనం పైనున్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు కావడంతో స్కూల్ బస్సులోని చిన్నారులతో సహా గాయపడిన వారందరినీ,నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో, పరిస్థితి విషమంగా ఉన్న వారిని మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించినట్లు సమాచారం. బైక్ పై ప్రయాణం చేస్తున్న వ్యక్తుల యొక్క వివరాలు తెలియాల్సి ఉంది,ఈ విషయం తెలుసుకున్న మంత్రి కొలుసు పార్థసారథి స్పందించి ప్రమాదంలో గాయపడిన వారందరిని వైద్య సిబ్బంది దగ్గరే ఉండి పర్యవేక్షించాలని వారికి మెరుగైన వైద్యాన్ని అందించాలని ఆదేశాలు ఇచ్చారు.

## ప్రముఖ పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్ కి రాష్ట్రస్థాయి స్వర్ణాంధ్ర అవార్డు.

ప్రజాభూమి ప్రతినిధి–పెదపాడు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే గర్వకారణం అయ్యేలా ప్రముఖ పారిశ్రామికవేత్త, సేవాతత్పరులు పుట్టగుంట సతీష్ సంస్థ 1947 ఐ ఎన్ సి కు అత్యంత ప్రతిష్టాత్మకమైన రాష్ట్ర స్థాయి స్వచ్ఛాం ధ్ర అవార్డు లభించింది. గాంధీ జయంతి సందర్భంగా 02 న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోనున్నారు .పారిశ్రామిక రంగంలోనే కాకుం డా స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాల్లో 1947 ఐ ఎన్ సి సంస్థ చేస్తున్న కృషికి ఈ అవార్డు కు ఎంపిక అయ్యింది. యువ పారిశ్రామికవేత్తగా ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్న సతీష్ 1947 ఐ ఎన్ సి ఎదుట గత 18 ఏళ్లుగా భవాని భక్తులకు అన్నదా నం, వసతి, వైద్యసేవ అందిస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిం చాలని ఈ సందర్భంగా సతీష్ కుమార్ కి మిత్రులు అభిమానులు శ్రేయోభిలాషులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

## జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు



మోదీ మరియు అమిత్ షా తమ పదవుల నుండి తప్పుకోవాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోళ్ళ పవన్ కుమార్ డిమాండ్ చేశారు. 2024 ఎన్నికల్లో 400 సీట్లు గెలుస్తామని ప్రచారం చేసినప్పటికీ, చివరికి లోక్‌సభలో బీజేపీ 240 సీట్లకే పరిమితమైంది. వీటిలో 79 లోక్‌సభ స్థానాలను ఎన్నికల అక్రమాల ద్వారా గెలుచుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. అంతే కాకుండా, ఎన్నికల సంఘం సహకారంతో ఎన్నికల ప్రక్రియను తారుమారు చేయడం ద్వారానే మోదీ అధికారంలోకి వచ్చారని కూడా ఆరోపిస్తున్నారు. ఇప్పుడు, 2029 ఎన్నికల్లో గెలవలేమని భావించి, సర్ (ప్రత్యేక సమగ్ర సవరణ – స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ) ప్రక్రియ ద్వారా ఓటర్ల పేర్లను తొలగించడానికి మరియు మరిన్ని ఎన్నికల అక్రమాలకు పాల్పడటానికి వారు ప్రయ త్నిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి. ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించాలి.

## పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తాం చైర్మన్ ఎండి నయీం.

ప్రజాభూమి ప్రతినిధి–వేలేరుపాడు.



వేలేరుపాడు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించగలనని నూతనంగా ఎన్నికైన చైర్మన్ పేర్కొన్నారు. గురువారం టిడిపి పార్టీ మండల అధ్యక్షుడు అమర వరపు అశోక్ ఆదేశానుసారం పాఠశాల పరిస్థితులను స్వయం గా పరిశీలించారు ఈ సందర్భంగా పాఠ శాల సిబ్బంది పలు రకాల సమస్యలను నూతన అధ్యక్షుడు దృష్టికి తీసుకురాగా త్వరితగతినే ఈ సమస్యలన్నీ పరిష్కరించగలనని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి కట్టం రాంబాబు, ఉపాధ్యక్షుడు కురిమల్ల కృష్ణ, యూత్ ప్రెసిడెంట్ చిట్టిపోతుల పోసి, నాగరాజు తదితరులు అంతా ఉన్నారు.

## బిజెపి శ్రేణుల ఆధ్వర్యంలో అంగన్వాడి ఉత్సవం.

ప్రజాభూమి ప్రతినిధి–రామచంద్రపురం



డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం జగన్నాయకులపాలెం అంగన్వాడీ కేంద్రంలో ప్రధాని మోదీ సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాల లో భాగంగా బిజెపి నేతల ఆధ్వర్యంలో అంగన్వాడీ ఉత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రాక్షారా మ అంగన్వాడీ పరిధిలోని వివిధ గ్రామాల అంగన్వాడీ కార్యకర్తలు ఈ ఉత్సవానికి హాజర య్యారు. ఈ కార్యక్రమానికి మండల బిజెపి అధ్యక్షులు ఆకేటి శ్రీకృష్ణ,జిల్లా అంగన్వాడీ ఉత్సవ కో కన్వీనర్,బి.ఎల్.ఏ1 సలాది శేఖర్,రామచంద్రపురం నియాజకవర్గ అంగన్వాడీ ఉత్సవ కన్వీనర్,బిజెపి సీనియర్ మహిళా నేత తలాటం అమ్మాజీ, జిల్లా సేవా సంకల్ప అభియాన్ కన్వీనర్,కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు, మండల బిజెపి ప్రధాన కార్యదర్శి పుల్లెల రామమూర్తి,మండల మహిళా మోర్చ అధ్యక్షురాలు బి పద్మావతి,ఉమా, బి.వి.బి.ఎల్ నారాయణ తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి నేతలు అంగన్వాడీ కేంద్రాలలో ప్రధాని మోదీ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అనేక పౌష్టిక ఆహార పదార్థాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ద్రాక్షారామ పరిధి అంగన్వాడీ కార్యకర్తల నాయకురాలు కె. జహీర్ ను బిజెపి నేతలు సత్కరించారు. అదేవిధంగా శ్రీ కృష్ణ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు కలములు,చిన్నారులకు బిస్కెట్లు అందజేశారు. బిజెపి నేతలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పోషక పదార్థాలు పిల్లలకు,గర్భిణీలకు బాలింతలకు సంక్రమంగా అందడంలోను పిల్లలకు విద్యా బుద్దులు నేర్పడంలోనూ అంగన్వాడీల కార్యకర్తల కృషి అభినందనీయమని కొనియాడారు. అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు,పిల్లలు,తల్లి తండ్రులు బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పోకెన్ హిందీ సర్టిఫికెట్ కోర్సు.



ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామచంద్రపురం నందు ఈరోజు విద్యార్థులకు స్పోకెన్ హిందీ నెలరోజుల పాటు నిర్వహించే కార్యక్రమం సర్టిఫికెట్ కోర్స్ ఇనాగరేషన్ జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.చిట్టిబాబు అధ్యక్షత వహించి విద్యార్థులు మాతృభాషతో పాటు ఇతర భాషల్లో కూడా ప్రావీణ్యత పొందాలని, హిందీ భాషని అధ్యయనం చేయడం ద్వారా దేశంలో ఏ రాష్ట్రానికి వెళ్లిన , ఎక్కడ ఉద్యోగాలు వచ్చిన భాషా పరమైన కష్టాలు లేకుండా ఉండడానికి వీలవుతుందని,ప్రతి ఒక్క విద్యార్థి కూడా ఆంగ్ల, హిందీ భాషల్లో చక్కగా మాట్లాడే నైపుణ్యాన్ని పొంది ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమం హిందీ విభాగఅదిపతి డాక్టర్ ఎన్వి రమణ ఆధ్వర్యంలో ప్రతిరోజు ఒక గంటపాటు విద్యార్థులకు తెలుగు మాధ్యమం ద్వారా హిందీ భాషని మాట్లాడటం నేర్పించే సర్టిఫికెట్ కోర్స్ ని మొదలు పెట్టారు. పాఠ్యాంశాలతో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకునే విద్యార్థులు ఇటువంటి కోర్సుల్లో చేరడం ద్వారా వారికి అనేక అవకాశాలు లభిస్తాయని.ప్రతి విద్యార్థి కూడా స్పోకెన్ హిందీ సర్టిఫికెట్ కోర్సులో చేరాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంగ్లీష్ విభాగఅదిపతి డాక్టర్ పంకజ్ , తెలుగు విభాగం నుంచి డాక్టర్ ఎన్ .సుజాత, లావణ్య విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చిన్నారులతో స్కూల్ బస్సు బోల్తా.

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



వడ్లమాను గ్రామ సమీపంలో సుమారు 30 మంది చిన్నారులతో వెళ్తున్న బీఐఎస్ స్కూల్ బస్సు మరో వాహనాన్ని దాటే క్రమంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొని కాలవ లోకి దూసుకెళ్లింది .ఈ ప్రమాదంలో ముగ్గురు చిన్నారులు, ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. గాయపడిన వారిని నూజివీడు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉన్న వారిని విజయవాడకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై నాగరాజు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి దర్యాప్తు చేపట్టారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సారథి ఆదేశించారు.

## కత్తిపూడిలో రూ.44 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

### 'ఎన్టీఆర్ భరోసా' సామాజిక పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ప్రజా భూమి ప్రతినిధి-ప్రత్తిపాడు

గ్రామాల సమగ్ర అభివృద్ధి, అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యురాలు శ్రీమతి వరుపుల సత్యప్రభ రాజా స్పష్టం చేశారు. కాకినాడ జిల్లా, శంఖవరం మండలం కత్తిపూడి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం-పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 'పల్లె పండుగ 3.0' నిధుల ద్వారా సుమారు రూ. 44 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆమె గురువారం శంకుస్థాపన చేశారు. ఎన్టీఆర్ 16 నుండి గాబు శ్రీను గారి ఇంటి వరకు మరియు గ్రామంలోని ఇతర అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు.అనంతరం గ్రామంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఎన్టీఆర్ భరోసా' సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్ సొమ్మును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, పింఛన్ల పెంపు ద్వారా వృద్ధులు, వికలాంగులు, వితంతువుల జీవితాల్లో కొత్త వెలుగులు నిండాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాలలో పంచాయతీరాజ్ మరియు రెవెన్యూ శాఖ అధికారులు, శంఖవరం మండల కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు కోరిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు



రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ గురువారం ఉండవల్లిలో కలిశారు.ఏలూరు పార్లమెంట్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఏలూరులో బీసీ హాస్టల్, జిల్లా గ్రంథాలయ నిర్మాణం, కొయ్యలగూడెం ఫైర్ స్టేషన్, నూజివీడు ఆధునికీకరణకు నిధులు కోరారు.దీనిపై లోకేష్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.అనంతరం జిల్లా రాజకీయ పరిస్థితులపై చర్చించిన ఎంపీ,గత రెండేళ్లలో ఏలూరు పార్లమెంట్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో రూపొందించిన పుస్తకాన్ని లోకేష్‌కు అందజేశారు.

## సమతుల ఆహారంతో ఆరోగ్యానికి భరోసా



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

అసంక్రమిత వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు ప్రజలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, సమతుల ఆహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డాక్టర్ మహిత, డాక్టర్ సంధ్యాప్రియ సూచించారు. బుధవారం ఆగిరిపల్లి, సగ్గూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని నూగండపల్లి, చొప్పరమెట్ల గ్రామాల్లో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాలు నిర్వహించారు. నూగండపల్లిలో జరిగిన కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు సంగా రంగారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఆరోగ్య సిబ్బంది సింధూరాణి, సంధ్యారాణి, రమ్య, హెచ్‌ఏఎస్ రమణ, ఏఎన్ఎం ధనమ్మ, జోషి, శాంతకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది పొన్నం రామచంద్రరావు, జలసూత్రం శేషగిరిరావు, మగదాటి వెంకటేశ్వరరావు, మట్టా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీ స్త్రీలు స్వల్ప వ్యాయామం చేస్తూ సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకోవాలి

### డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు





ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం.

గర్భిణీ స్త్రీలు స్వల్ప వ్యాయామం చేస్తూ సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకోవాలని రాష్ట్ర శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు ఆంధ్రప్రదేశ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహిళాభివృద్ధి మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగనవాడి ఉత్సవ్ సేవా సంకల్ప అభియాన్ అనే కార్యక్రమంలో భాగంగా స్థానిక కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం గ్రామంలో 9వ నంబర్ అంగన్వాడీ కేంద్రంలో పోషకాహారం ఆరోగ్యం బాలల వికాసం సమాజ భాగస్వామ్యం అనే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన పురస్కరించుకుని సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ ఏడో తారీఖు వరకు ప్రతిరోజు పైన తెలిపిన అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ పరిశుభ్రత సమతుల్యమైన ఆహారము సెల్ఫోన్ మరియు క్యాన్సర్ పై అవగాహన కల్పిస్తూ పిల్లలను సంస్కారం ఉండేలాగా పెంచాలని సూచించారుమన కూటమి ప్రభుత్వం తల్లులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ఇది ప్రజలంతా గమనించాలని కోరారు స్థానిక ఐసిడి ఎస్ కాకినాడరూరల్ ప్రాజెక్టు సిడిపిఓ ఎన్ లక్ష్మి మరియు సూపర్వైజర్ ఎన్ పద్మశ్రీ విశిష్ట అతిథులుగా పాల్గొని సిడిపిఓ లక్ష్మీ మాట్లాడుతూ ఆరోగ్యమైన బిడ్డలు అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్ మరియు వైవిధ్యభరితమైన పోషకాహారం అంగన్వాడిలో వేడిగా ఉండిన భోజనం సమాజ భాగస్వామ్యం మరియు బాధ్యతాయుతం పోషణ ప్రాథమిక విద్య బాలల వికాసం ప్రధానమంత్రి మాతృ వందన యోజన పిఎంఎంవివై అనే అంశాలను వివరించారు. బలమైన సమాజానికి ఆరోగ్యవంతమైన పిల్లలు కావాలని పిలుపునిచ్చారు సూపర్వైజర్ పద్మశ్రీ మాట్లాడుతూ న్యూట్రిషన్ మెటర్నల్ కేర్ ఇమినైజేషన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ ఉమెన్ ఎంపవర్మెంట్ కమ్యూనిటీ సర్వీసెస్ పై పూర్తిగా తల్లులకు గర్భిణులకు అవగాహన కల్పించారు తదుపరి ఎంత మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన అంగన్వాడి టీచర్ అనంతలక్ష్మి హెల్పర్ వరలక్ష్మి లను మరియు తల్లులను ఉచిత రీతిన సత్కరించడం జరిగింది అంగనవాడి కేంద్రం పరిధిలో గల గర్భిణీలు ,బాలింతలు, పిల్లలు పాల్గొనగా రేవతి నాగరాజు తదితరులు సహకరించారు

## మెగా జాబ్ మేళాలో 245 మంది ఎంపిక

- ఐటీ రంగంలో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ.
- రాష్ట్ర కార్మిక శాఖమంత్రి సుభాష్ వెల్లడి.





ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం.

రామచంద్రపురం నియోజవర్గంలో నిరుద్యోగ సమస్య నిర్మూలననే లక్ష్యంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక చొరవతో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్, వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. లచ్చారావు సమన్వయంతో రామచంద్రపురంలోని వీఎస్ఎం కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళా విశేష స్పందన లభించింది.ఈ జాబ్ మేళాకు దేశంలోని ప్రముఖ 25 మల్టీనేషనల్ కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించగా, మొత్తం 245 మంది యువత ఉద్యోగాలకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రామచంద్రపురం నియోజకవర్గంలో ఇప్పటివరకు 52 జాబ్ మేళాలను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఈ జాబ్ మేళాల ద్వారా వేలాది మంది నిరుద్యోగ యువత ఉపాధి పొందారని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం యువత నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, భవిష్యత్ ఉద్యోగ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఐటీ రంగంలో ఉద్యోగాలు కోరుకునే నిరుద్యోగులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్ తదితర ఆధునిక కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ శిక్షణ పొందేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు మంత్రి క్యాంపు కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కోర్సుల ద్వారా నాలుగు లక్షల నుంచి ఏడు లక్షల రూపాయల వార్షిక వేతన ప్యాకేజీలతో ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. యువత తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకుని ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

**నిరంతర ప్రక్రియగా జాబ్ మేళాలు**

రామచంద్రపురం నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య పూర్తిగా అంతరించిపోయే వరకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళాలను నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని ఫౌండేషన్ చైర్మన్, కూటమి సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం తెలిపారు. మెగా జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు ఆయన చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు.

**వికాస సంస్థ సేవలు అభినందనీయం.**

నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రముఖ కంపెనీలను తీసుకు వచ్చి జాబ్ మేళాలను విజయవంతం చేస్తున్న వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. లచ్చారావు సేవలను వాసంశెట్టి సత్యం ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సంస్థలను భాగస్వామ్యం చేసి యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు.వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. లచ్చారావు మాట్లాడుతూ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మరిన్ని జాబ్ మేళాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

## పోలీస్ ఆరోగ్య భద్రత పరిరక్షణ అవసరం

- ప్రతి ఒక్కరు ఇన్సూరెన్స్‌పై అవగాహన కలిగి ఉండాలి
- డి.ఎస్.పి సుధాకరరావు విజ్ఞప్తి




ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

ప్రతి నిత్యం ప్రజల సమస్యలపై స్పందిస్తూ సమాజంలో సేవలందిస్తున్న పోలీస్ శాఖలో పనిచేస్తున్న అధికారులు సిబ్బంది ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ వహించాలని, తమ కుటుంబాలను చూసుకోవలసిన బాధ్యత ఎంతైనా ఉందని నరసాపురం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి డిఎస్పి ఎం. సుధాకరరావు పేర్కొన్నారు. తమ డివిజన్ పరిధిలో పోలీస్ శాఖ ప్యాకేజీ బెనిఫిట్స్ ఇన్సూరెన్స్ తదితర అంశాలపై గురువారం స్థానిక సిహెచ్.సత్యవతి లయన్స్ కమ్యూనిటీ హాల్ నందు బ్యాంక్ అధికారులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డిఎస్పి సుధాకరరావు మాట్లాడారు. విధుల నిర్వర్తనలో కొన్ని సందర్భాల్లో పోలీసు అధికారులు సిబ్బంది వారితోపాటు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తూ చాలా ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల పట్ల అవగాహన లేకపోవడంవల్ల చాలా నష్టపోతున్నారని డి.ఎస్.పి ఆవేదన వ్యక్తం చేశారు. తమ డివిజన్ పరిధిలో అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించేందుకు వివిధ బ్యాంకు అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు డి.ఎస్.పి మీడియాకు వెల్లడించారు. ముఖ్యంగా ఆరోగ్య భద్రత, ఆరోగ్య పరిరక్షణ, ఇన్సూరెన్స్ పాలసీలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజర్వ్ ఇన్స్పెక్టర్ కె.ఇందుమతి సభా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ పాలసీల వివరాలను పోలీసు అధికారులకు సిబ్బందికి వెల్లడించారు. ఎస్బిఐ బ్యాంక్ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి జనజీవన బీమా యోజన, ప్రధానమంత్రి ఎస్బివై, అటల్ పెన్షన్, ఎన్. పి.ఎస్ -2 అధికారులు వివరించారు. బ్యాంక్ ఆఫ్ బరోడా ద్వారా రూ. 12 లక్షలు సాధారణ భీమా, రూ. కోటి వరకు ప్రమాద బీమా ఉందని, మిగిలిన జాతీయ బ్యాంకుల ద్వారా సాధారణ భీమా రు.10 లక్షలు ఉందని తెలియజేశారు. పీఎం జేజేబివై పథకానికి సంబంధించి 18 నుండి 50 వయసు కలిగిన పోలీస్ సిబ్బంది ఏడాదికి రూ.436లు ప్రీమియం చెల్లించినట్లయితే రెండు లక్షల వరకు జీవిత బీమా ఉంటుందన్నారు. ఏప్రిల్, మే నెలలో నమోదు చేసుకోవాలన్నారు. పిఎంఎస్. బివై పథకంలో 18 నుండి 70 ఏళ్ల లోపు వారు ఏడాదికి కేవలం రూ. 20 లు చెల్లించినట్లయితే రూ.రెండు లక్షలు సాధారణ భీమా వర్తిస్తుందని, రూ. లక్ష వరకు పాక్షిక అంగవైకల్యానికి భీమా లభిస్తుందన్నారు. అటల్ పెన్షన్ పథకంలో 18 నుండి 40 ఏళ్లలోపు పోలీస్ సిబ్బంది ఇన్కమ్ టాక్స్ పరిధిలో లేనివారు ఈ పథకానికి అర్హులుగా ఉంటారని, హోంగార్డ్స్ వారి కుటుంబ సభ్యుల పేర్లు కూడా నమోదు చేసుకోవచ్చని వివరించారు. ఎన్. పిఎస్ -2 పథకం ద్వారా రూ. 500 నుండి పెద్ద మొత్తంలో ప్రతినెల చెల్లించేవారు వారికి అవసరమైన సందర్భాల్లో రిటర్న్స్ తీసుకువచ్చని, పాన్ కార్డ్ ఐడి కార్డ్ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పథకాల గురించి బ్యాంక్ అధికారులు వివరించారు. పాలసీదారుడు భార్యతో పాటు 25 సంవత్సరాల లోపు ఇద్దరు పిల్లలకు పాలసీలు వర్తిస్తాయని బ్యాంక్ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు ఎస్బిఐ మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఎస్ వి రామకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ ఎన్విఎన్ పవన్ కుమార్, జనరల్ ఇన్సూరెన్స్ రీజియన్ హెడ్ రాజశేఖర్, బ్రాంచ్ కోఆర్డినేటర్ చలపతి, కస్టమర్ సేవా సారథి కిషోర్, సిఐలు కోలా రజినీకుమార్, గుత్తుల శ్రీనివాస్, ఆకుల రఘు, కుడిపూడి సతీష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ కె.ఇందుమతి, ఎస్సైలు జి.పృథ్వి, కే.సుధాకర రెడ్డి, రాజ్ కుమార్, ఎస్.ఎన్ ముత్యాలరావు, కే.గంగాధర్ రావు, కే.స్వామి, ఆర్. ప్రేమ రాజు, కె.శారద సతీష్, ఏఎస్.ఐ లు శివాజీ, కోదండ రామయ్య, ఏసుబాబు, రామకృష్ణ, హోంగార్డ్స్ సిసి ఎం.ఎస్.ఎన్. వి.సత్యనారాయణ, జిల్లా పోలీసు ఉద్యోగుల అధ్యక్షులు మోజెస్, సబ్ డివిజన్లో ఉన్న పలువురు పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఏలూరు కార్పొరేషన్‌లో రూ.1.04 కోట్ల రికవరీ

### కార్పొరేషన్‌లో రూ.1.04 కోట్ల రికవరీ



ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

మున్సిపల్ కార్పొరేషన్ ఖాతాల్లో జరిగిన సుమారు రూ. 1.31 కోట్ల నిధుల దుర్వినియోగం వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సస్పెండ్ అయిన ఐదుగురు ఉద్యోగుల్లో నలుగురు తమ వాటా సొమ్మును తిరిగి కార్పొరేషన్ ఖాతాలో జమ చేసినట్లు కమిషనర్ భాను ప్రతాప్ తెలిపారు.మేనేజర్ మూర్తి, అకౌంటెంట్ లింగేశ్వరి, బి1 రవికుమార్, అటెండర్ మోహన్‌లు తలా రూ.26 లక్షల చొప్పున మొత్తం రూ.1.04 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు.ప్రధాన నిందితుడిగా పేర్కొన్న షరాఫ్ గున్నాపు శ్రీనివాసరావుపై క్రిమినల్ చర్యలతో పాటు శాఖాపరమైన విచారణ కొనసాగుతుందని కమిషనర్ తెలిపారు.సొమ్ము తిరిగి చెల్లించినంత మాత్రాన తప్పు మాఫీ కాదని స్పష్టం చేశారు.భవిష్యత్తులో పన్నులు, రుసుముల సొమ్ము నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు చేపడుతున్నామని, కార్పొరేషన్‌లో ప్రత్యేక బ్యాంక్ బ్రాంచ్, ఏటీఎం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి పరిధిలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో విజయవాడ పరిసర ప్రాంతాలకు చెందిన వాసు నాయుడుకు తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. గాయపడిన వ్యక్తి అమరావతిలోని ఓ దుకాణంలో పనిచేస్తున్నట్లు ప్రాథమికంగా తెలిసిందని, పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

## ప్రభుత్వ భూమిపై ఆక్రమణకు చర్యలు

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



ఆగిరిపల్లి గ్రామంలోని ఆర్.ఎస్.నెం.83/1లోని 6 ఎకరాల భూమి రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదై ఉందని, ఈ భూమిని ఎవరికీ కేటాయించినట్లు లేదా ప్రైవేట్ వ్యక్తులకు బదలాయించినట్లు రికార్డుల్లో లేదని నూజివీడు సబ్‌కలెక్టర్ బి.వినూత్న తెలిపారు. 2013లో నమోదైన సేల్‌డీడ్‌లో ఆస్తి సర్వే నంబర్ ఆర్.ఎస్.నెం.86గా ఉండగా, 19-06-2026న నమోదైన రెక్టిఫికేషన్ డీడ్ ద్వారా సర్వే నంబర్‌ను ఆర్.ఎస్.నెం.83/1గా మార్చినట్లు పేర్కొన్నారు. సంబంధిత రెవెన్యూ రికార్డులను పూర్తిగా పరిశీలించకుండానే రెక్టిఫికేషన్ డీడ్ నమోదు చేసినట్లు విచారణలో గుర్తించామన్నారు. ఆర్.ఎస్.నెం.83/1లోని ప్రభుత్వ ఖాళీ భూమిని మాదల సునీత ఫెన్సింగ్ చేసి ఆక్రమించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రిజిస్ట్రార్, ఏలూరు విచారణ నిర్వహించి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్‌కు నివేదిక సమర్పించారని, ప్రభుత్వ భూమిని పరిరక్షించేందుకు రెవెన్యూ శాఖ అవసరమైన చర్యలు కొనసాగిస్తోందని సబ్‌కలెక్టర్ తెలిపారు.

ప్రజాభూమి
జనరల్ 15
శుక్రవారం 02 అక్టోబరు 2026

# ఓటర్ల జాబితా క్లెయిమ్‌లు, అభ్యంతరాల గడువు పరిశీలన అక్టోబర్ 10 వరకు పొడిగింపు

## : తుది ఓటర్ల జాబితా ప్రచురణ అక్టోబర్ 16న -: జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురము

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల పరిశీలన గడువును 2026 అక్టోబర్ 10వ తేదీ వరకు పొడిగించినట్లు చీఫ్ ఎలెక్టోరల్ అధికారి వారి ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే గతంలో నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీని 2026 అక్టోబర్ 9వ తేదీ నుంచి అక్టోబర్ 16వ తేదీకి రీ-షెడ్యూల్ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జుజ× లేఖ తేది 29.09.2026 మరియు జజూ లేఖ తేది 30.09.2026 మేరకు ముఖ్యాంశాలు నోటీసులు అందుకుని హాజరు కాని వారి నివాసానికి స్వయంగా వెళ్ళి బీఎల్వోలు విచారణ జరపాలి. ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే ఆన్‌లైన్ ద్వారా కూడా విచారణ చేపట్టాలి. వారి బంధువులు ఎవరైనా ఉండి సరైన ధృవ పత్రాలు సమర్పిస్తే కూడా తీసుకోవచ్చును. ఎస్.ఐ.ఆం వ్యవధిలో రాత్రి బస కేంద్రాలు (నైట్ షెల్టర్లు), కార్మిక శిబిరాలు (లేబర్ క్యాంప్‌లు), నిరుపేదల బస్తీలు/కాలనీలు, ఇళ్లు లేని నిరాశ్రయులు ఉండే ప్రాంతాలు (బస్ షెల్టర్లు, ఫుట్‌పాత్‌లు, రైల్వే స్టేషన్లు, నగరాల ప్రధాన కూడళ్లు) మరియు



ప్రత్యేకించి వెనుకబడిన గిరిజన సమూహాల వద్ద ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలి. ఓటరు జాబితా నిరంతర సవరణ ప్రక్రియ సమయంలో ఇప్పటివరకు పేర్లు నమోదు చేసుకోని లేదా మిగిలిపోయిన ఓటర్లు మరియు తొలిసారి అర్హత సాధించిన కొత్త ఓటర్ల నమోదు కోసం ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలి. డిక్లరేషన్ ఫారమ్ అనేది కేవలం ఎస్.ఐ.ఆర్ వ్యవధికి మాత్రమే వర్తిస్తుంది. నాన్-ఎస్.ఐ.ఆర్ వ్యవధిలో డిక్లరేషన్ లేకుండానే ప్రక్రియ ఉంటుంది. విచారణ దశలో భాగంగా ఇప్పటివరకు అనర్హులుగా అనంతపురం జిల్లాలో ప్రస్తుతానికి గుర్తించిన 23,439 మందికి సంబంధించి మరోసారి క్షేత్రస్థాయిలో పునఃపరిశీలన (రీ-వెరిఫికేషన్) చేసి అర్హులైన వారిని జాబితాలో చేర్చాలి.

# పులివెందుల అభివృద్ధిపై హామీలే తప్ప నిధుల్లేవు - 50 మెడికల్ సీట్ల రద్దుపై సమాధానం చెప్పాలి: వైసీపీ

## ఇంచార్జి మంత్రి సవిత వ్యాఖ్యలు హాస్యాస్పదం



ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల అభివృద్ధిపై ఇంచార్జి మంత్రి సవిత వ్యాఖ్యలు హాస్యాస్ప దంగా ఉన్నాయని, కూటమి నేతలది మాటల గారడీ అని వైసీపీ నేతలు విమర్శించారు. గురువారం విలేకరుల సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ నూర్ భాషా కార్పొరేషన్ చైర్మన్ ఓతురు రసూల్, పట్టణాధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, మాజీ వైస్ చైర్మన్ హాఫిజ్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పులివెందులకు లక్ష కోట్లు కాదు కదా, కనీసం లక్ష రూపాయలు కూడా ఇచ్చిన దాఖలాలు లేవని ఆరోపించారు. ఎన్నికలు వచ్చినప్పుడే మున్సిపాలిటీ గుర్తుకొస్తుందని, అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదన్నారు. ఎన్ని ఇబ్బందులు సృష్టించినా పులివెందుల ప్రజల మద్దతుతో మున్సిపాలిటీని వైసీపీనే కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇంటి రిజిస్ట్రేషన్ పేరుతో డ్రామాలు ఆడుతున్నారని, 8 వేల మంది పేదలకు ఒక్క రూపాయితో రిజిస్ట్రేషన్ పత్రాలు ఇచ్చిన ఘనత వైఎస్ జగన్ దేనని తెలిపారు. పేదలపై ప్రేమ ఉంటే హౌసింగ్ కాలనీల్లో ఒక్క ఇటుకైనా ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. పులివెందులపై కక్షతోనే వైద్య కళాశాలకు మంజూరైన 50 మెడికల్ సీట్లను రద్దు చేశారా అని, దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపెయిన్ సర్వీస్ పై సమీక్ష సమావేశం - డాక్టర్ ఎస్ రవిబాబు



ప్రజా భూమి,కడప సిటీ :

ఎల్సిడిసి సర్వేపై ఈరోజు కడప జిల్లా కుష్టు, ఎయిడ్స్ టీబి అధికారి కార్యాలయం లో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్స్ సమావేశం జరిగిం ది.జిల్లా లెప్రసీ ఎయిడ్స్ టీ బి అధికారి డాక్టర్ ఎస్ రవి బాబు మాట్లాడుతూ ఎల్ సి డి సి సర్వే సెప్టెంబర్ 11వ తేదీ నుంచి ఈరోజు వరకు కేవలం 26.5% మాత్రమే ఆన్లైన్లో చేశారు అన్నారు. లెప్రసీ డిటెక్షన్ క్యాంపెయిన్ సర్వే ఈనెల తొమ్మిదో తేదీ వరకు పొడిగించడం జరిగింది కాబట్టి పీహెచ్సీ వైద్యాధి కారులు అందరూ, ఆశా కార్యకర్తలకు సర్వే 100% ఆన్లైన్ లో చేయవలసిందిగా ఆదేశాలు తెలియజేశారు. హెల్త్ కమిషనర్ ఆదేశాను సారం ఆన్లైన్ సర్వే అందరూ తప్పనిసరిగా చేయవలెనని ఆయన తెలియజేశారు ఈ సమావేశంలో టి హెచ్ వైద్య ధికారులు డాక్టర్ గురువర్మ గవర్నమెంట్ జనరల్ ఆస్ప టల్ కడప, డాక్టర్ సౌజన్య రాజంపేట,డాక్టర్ మనోహర్ ఫిజియోథెరపీ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వైశ్య హాస్టల్ కాంపౌండ్లో వయోవృద్ధులకు పింఛన్లు పంపిణీ చేసిన ఎంపీ అంబిక



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా అనంతపురం నగరంలోని రాజు రోడ్డులోని వైశ్య హాస్టల్ కాంపౌండ్‌లో ఉన్న శ్రీ వాసవీ వృద్ధాశ్రమాన్ని సందర్శించి, అక్కడ ఆశ్రయం పొందుతున్న వయోవృద్ధులను కలిశాను. వారితో ఆత్మీయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నాను. ఈ సందర్భంగా అనంతపురం పార్లమెంట్ సభ్యులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వయోవృద్ధులకు నా చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశాను. దాతల సహకారంతో వృద్ధాశ్రమంలోని పెద్దలకు అవసరమైన బెడ్‌షీట్లు, వస్త్రాలు తదితర సామగ్రిని అందజేశాను. వయోవృద్ధులకు అవసరమైన వైద్య సహాయం, ఇతర సేవలు అందిస్తూ వాసవీ వృద్ధాశ్రమం పాలకవర్గం చేస్తున్న సేవలు అభినందనీయం. మన పెద్దల అనుభవం, ఆశీస్సులు సమాజానికి ఎంతో విలువైనవి. వయోవృద్ధులకు గౌరవం, ఆప్యాయత, భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత. వృద్ధాశ్రమం అధ్యక్షులు తలుపుల కృష్ణమూర్తి, ట్రెజరర్ గోపనపల్లి కృష్ణయ్య, జర్నలిస్ట్ ఇటికాల శివ రామాంజనేయులు, అనంతపురం కొత్తూరు ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి, అనంతపురం జిల్లా కమిటీ సెక్రటరీ జయంతి సత్యారామ్, ఫణి, నర్సేపల్లి నాగభూషణం, కృష్ణయ్య, కృష్ణమూర్తి, జయంతి సత్యారామ్ ఇతర పాలకవర్గ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఏపీ ఎన్జీవో బద్వేల్ తాలూకా అధ్యక్షునిగా అమర్నాథరెడ్డి

## అమర్నాథ్ రెడ్డిని సన్మానించిన వ్యవసాయ సంఘం జిల్లా సభ్యులు పోలయ్య



ప్రజాభూమి పోరుమామిళ్ళ :

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ బద్వేల్ తాలూకా నూతన అధ్యక్షునిగా కాశినాయన మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆర్. అమర్నాథరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కడప జిల్లా వ్యవసాయ సంఘ కమిటీ సభ్యుడు యంబడి పోలయ్య అమర్నాథరెడ్డిని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. 2019 నుంచి ఎన్జీవో అసోసియేషన్‌లో క్రియాశీలకంగా పనిచేస్తూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన అమర్నాథరెడ్డి, నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారని యంబడి పోలయ్య ఆకాంక్షించారు. తన ఎన్నికకు సహకరించిన ఉద్యోగులు, పెద్దలకు అమర్నాథరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యనమల సుధాకర్

ప్రజాభూమి పోరుమామిళ్ల :

పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హులైన లబ్ధిదారులకు అండగా నిలిచే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమం బలిచకోటలో జరిగింది. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి యనమల సుధాకర్, బూత్ కన్వీనర్ చెన్ను వెంకట రమణ, పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఈ సందర్భంగా నాయకులు లబ్ధిదారులను కలిసి పెన్షన్ అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వారి జీవనానికి ఆర్థిక భరోసాను కల్పిస్తున్నాయని వారు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ సర్పంచ్, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి యనమల సుధాకర్ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందుతోందన్నారు. పెన్షన్ లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన వారికి వాటి ప్రయోజనాలు అందేలా సహకరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# రామాపురంలో ఘనంగా అంగన్‌వాడీ ఉత్సవాలు





ప్రజాభూమి పోరుమామిళ్ల

కలసపాడు మండలం రామాపురం గ్రామంలో అంగన్‌వాడీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కలసపాడు సెక్టార్ సూపర్‌వైజర్ హరిప్రియ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బద్వేల్ ఏఎంసి చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ హాజరై అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను అభినందించారు. కలసపాడు మండల ఇన్‌చార్జ్ నారోజు రమణ చారి ఆహ్వానం మేరకు కార్యక్రమానికి హాజరైన నారిశెట్టి సుప్రజ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను ఘనంగా సన్మానించారు. అలాగే ఐసిడిఎస్ సిడిపిఓ లక్ష్మి, కలసపాడు సూపర్‌వైజర్ హరిప్రియలను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా బద్వేల్ ఏఎంసి చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న సేవలు ఎంతో ప్రశంసనీయమని అన్నారు. చిన్నారుల పోషణ, ఆరోగ్యం, విద్యాభివృద్ధికి అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న కృషిని అభినందించారు. అంగన్‌వాడీ వ్యవస్థ బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహకారం, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఆమె కొనియాడారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సమాజంలో కీలకమైన సేవలు అందిస్తున్నారని, వారి సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషణ, విద్యాభివృద్ధికి అంగన్‌వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. ముఖ్యంగా కలసపాడు మండలంలో అంగన్‌వాడీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ హరిప్రియ సేవలను అభినందించారు. ఐసిడిఎస్ అధికారులు అందిస్తున్న సహకారాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ ఏఎంసి చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ, బీజేపీ నాయకులు దుల్లా శ్రీనివాసరెడ్డి, నాగేంద్ర, సూపర్‌వైజర్లు రత్నకుమారి, మాధవి, కాశినాయన సూపర్‌వైజర్ చంద్రకళ తదితరులు, గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. రమణ చారి ఆధ్వర్యంలో జరిగిన ఈ అంగన్‌వాడీ ఉత్స వాలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి.

# పోరుమామిళ్ల నూతన పోలీస్ అధికారులను కలిసిన కూటమి నాయకులు



ప్రజాభూమి పోరుమామిళ్ల, :

పోరుమామిళ్ల సర్కిల్ పరిధిలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎ. విద్యాసాగర్ లను కూటమి నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ కలసపాడు మండల సీనియర్ నాయకులు ప్రహ్లాద రెడ్డి, భారతీయ జనతా పార్టీ కాశినాయన మండల ప్రధాన కార్యదర్శి ఎదురు భాస్కర్ రెడ్డి తదితర కూటమి నేతలు అధికారులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు, అసాంఘిక కార్యకలాపాల అణచివేతకు పోలీస్ యంత్రాంగానికి కూటమి తరపున పూర్తి సహకారం అందిస్తామని వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సామాన్య ప్రజలకు న్యాయం జరిగేలా, ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కూటమికి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల పట్ల బాధ్యతగా మెలగాలి

## -హక్కులపై అవగాహన పెంచుకోండి

## -అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మీ హారిక కోట



ప్రజాభూమి, హిందూపురం టౌన్

వయోవృద్ధుల పట్ల పిల్లలు బరువుగా కాకుండా బాధ్యతగా మెలగాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మీ హారిక కోట పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక రూపా వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వయో వృద్ధుల పరిరక్షణకు ప్రత్యేక చట్టాలు అమలులో ఉన్నాయన్నారు. వీటిపై వృద్ధులు అవగాహన పెంచుకొని న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. ఎవరైనా కుమారులు, కుమార్తెలు తల్లిదండ్రుల ఆస్తులను రాయించుకొని, వారి ఆలనా పాలన పట్టించుకోకపోతే నేరుగా ను సంప్రదించి న్యాయం పొందవచ్చన్నారు. అదేవిధంగా కుటుంబ సభ్యులు వయోవృద్ధుల పట్ల ప్రేమానురాగాలతో వ్యవహరించాలని

# న్యాయవాదులపై దాడి చేయడం శోచనీయం

## -కఠిన చర్యలు తీసుకోవాలని ర్యాలీ



ప్రజాభూమి, హిందూపురం టౌన్

న్యాయవాదులపై దాడి చేయడం తగదని హిందూపురం బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్, కృష్ణమూర్తి పేర్కొన్నారు. విజయవాడలో న్యాయవాదులపై పోలీసు అధికారులు దాడి చేయడాన్ని నిరసిస్తూ గురువారం స్థానిక న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో విధులను బహిష్కరించి ర్యాలీ నిర్వహించారు. స్థానిక బార్ అసోసియేషన్ నుండి ప్రారంభమైన ర్యాలీ పురవీధుల గుండా కొనసాగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ సర్కిల్ నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఎంతో కీలకమైనటువంటి న్యాయవాదుల పట్ల పోలీసు అధికారులు దాడులు చేయడం సమంజసం కాదన్నారు. దీనికి తోడు న్యాయవాదుల పట్ల అప్రజాస్వామికంగా, అవమానకర రీతిలో రౌడీషీట్లు తెరచి ఇబ్బందులకు గురి చేసే విధంగా వ్యవహరించడం తగదని పేర్కొన్నారు. న్యాయవాదులపై దాడి చేసిన పోలీస్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు న్యాయవాదుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రామచంద్రారెడ్డి, నాగరాజు రెడ్డి, సిద్దు, వెంకటేష్, జయరాం, జగదీష్, కదిరేష్, చెన్నప్ప, అబ్దుల్లా, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.




# వైఎస్ జగన్‌ను కలిసిన మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి



ప్రజాభూమి పోరుమామిళ్ల :

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి విజయవాడ తాడేపల్లిలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, తాజా పరిణామాలపై ఇరువురు చర్చించినట్లు తెలిపారు. అనంతరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత సజ్జల రామకృష్ణారెడ్డిని కూడా పోతిరెడ్డి నాగార్జున రెడ్డి కలసి ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. రాష్ట్ర రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై చర్చించడం జరిగిందన్నారు.

# ప్రజాభూమి

జనరల్ 16

శుక్రవారం 02 అక్టోబరు 2026


## ఆస్తి కోసం వీరబాబు హత్య.. ముగ్గురు కలిసి హతమార్చినట్లు డీఎస్పీ వెల్లడి

**వట్టిగడ్డలో ఘటన.. రాజవొమ్మంగి సీఐ ఆధ్వర్యంలో పోస్టుమార్టం.. ఫోరెన్సిక్ బృందం పరిశీలన**



**ప్రజా భూమి,రాజవొమ్మంగి**

అనకాపల్లి జిల్లా కృష్ణదేవిపేటకు చెందిన వీరబాబు రాజవొమ్మంగి మండలం తంతికొండ పంచాయతీ పరిధిలోని వట్టిగడ్డ గ్రామ సమీపంలో హత్యకు గురయ్యాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వట్టిగడ్డ గ్రామానికి చెందిన పల్లి శ్రీనివాసరావు అలియాస్ బుజ్జి, అతని సోదరుడు, అదే గ్రామానికి చెందిన మరో స్నేహితుడు కలిసి వీరబాబును హత్య చేసినట్లు డీఎస్పీ అష్రఫ్ అలీ వెల్లడించారు. ఆస్తి విషయంలో ఏర్పడిన వివాదమే హత్యకు కారణంగా పోలీసులు గుర్తించినట్లు తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ఇదిలా ఉండగా, గురువారం రాజవొమ్మంగి సీఐ సన్యాసి నాయుడు ఆధ్వర్యంలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. తహసీల్దార్ స్వామి సమక్షంలో అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన వైద్యాధికారులు పోస్టుమార్టం ప్రక్రియ చేపట్టారు. రాజమండ్రి నుంచి వచ్చిన ఫోరెన్సిక్ బృందం కూడా ఘటనాస్థలాన్ని పరిశీలించి కీలక ఆధారాలను సేకరించింది.పోస్టుమార్టం కార్యక్రమంలో రాజవొమ్మంగి ఎస్సై వెంకటరావు, జడ్డంగి ఎస్సై చినబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. హత్యకు సంబంధించిన ఆధారాలను ఫోరెన్సిక్ బృందం సేకరించినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ నివేదికల ఆధారంగా కేసులో తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

**ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి**

**మారేడుమిల్లిలో ఘనంగా 'స్వచ్ఛ పక్వాడ్' కార్యక్రమం**

**ఎస్పీ చక్రవర్తి పర్యవేక్షణలో శ్రమదానం చేసిన పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలు**

**స్వయంగా చీపురు పట్టి రోడ్లను శుభ్రం చేసిన ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్పర్సన్**



**ప్రజా భూమి, రాజవొమ్మంగి (మారేడుమిల్లి):**

పరిశుభ్రత అనేది కేవలం ఒక శాఖకు మాత్రమే పరిమితమైన అంశం కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్పర్సన్, శాసనసభ్యురాలు మిరియాల శిరీషాదేవి పిలుపునిచ్చారు.

గురువారం మారేడుమిల్లి మండల కేంద్రంలో 'స్వచ్ఛ భారత్ -- స్వచ్ఛ ఆంధ్ర'లో భాగంగా నిర్వహించిన 'స్వచ్ఛ పక్వాడ్' కార్యక్రమం పోలవరం జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి, డీఎస్పీ అష్రఫ్ అలీల పర్యవేక్షణలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు పోలీస్ అధికారులు, సిబ్బంది సాదర స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీషాదేవి మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతతో ఎన్నో ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని, పర్యావరణ పరిరక్షణలో స్వచ్ఛత అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఇలాంటి స్వచ్ఛతా కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. అనంతరం స్థానిక పోలీస్, సీఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి నిర్వహించిన 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, స్వయంగా చీపురు పట్టి రోడ్లను శుభ్రం చేస్తూ శ్రమదానం చేశారు. పోలీసు యంత్రాంగం కేవలం శాంతిభద్రతలకే పరిమితం కాకుండా సామాజిక సేవలో భాగస్వామ్యం కావడం అభినందనీయమంటూ సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులను ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రజలందరూ తమ ఇళ్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ స్వచ్ఛ ఆంధ్ర సాధనలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ సీఐ చెలముత్తు, మారేడుమిల్లి సీఐ బి. నరసింహమూర్తి, ఎస్ఐ కె. శ్రీనివాసరావు, పోలీస్, సీఆర్పీఎఫ్ సిబ్బంది మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వాల్మీకి నగర్‌లో తాగునీటి సమస్యపై కలెక్టర్ తక్షణ స్పందన

**క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన అధికారులు**

**డ్రైనేజీలో తాగునీటి పైపులైన్.. దుర్వాసనతో కూడిన మురుగునీరే గతి**

**కొత్త వాటర్ ట్యాంక్ నిర్మించాలని గ్రామస్థుల విజ్ఞప్తి**



ప్రజా భూమి,రాజవొమ్మంగి:

రాజవొమ్మంగి గ్రామం వాల్మీకి నగర్‌లో నెలకొన్న తాగునీటి సమస్యపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించారు. వాల్మీకి నగర్‌కు ప్రత్యేకంగా వాటర్ ట్యాంక్ మంజూరు చేయాలని కోరుతూ స్థానికులు సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)లో కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్.. సమస్యపై క్షేత్రస్థాయిలో పూర్తి విచారణ జరిపి తక్షణమే సమగ్ర నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత శాఖ అధికారులు గ్రామానికి చేరుకుని వాల్మీకి నగర్ ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాగునీటి పైపులైన్ డ్రైనేజీ కాలువలో ఉండటాన్ని అధికారులు స్వయంగా గుర్తించారు. రోజుకు కేవలం పది నిమిషాలు మాత్రమే నీరు వస్తుందని, అందులోనూ మొదటి ఐదు నిమిషాలు దుర్వాసనతో కూడిన మురుగునీరే సరఫరా అవుతోందని గ్రామస్థులు అధికారుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రంగా దెబ్బతిన్న డ్రైనేజీలను పునర్నిర్మించడంతో పాటు, కొత్త వాటర్ ట్యాంకు నిర్మించి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని కోరారు.జిల్లా కలెక్టర్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నారని గ్రామస్థులు కొనియాడారు. తమ గ్రామంలోని తాగునీటి ఎద్దడిని కూడా శాశ్వతంగా పరిష్కరించి, వాటర్ ట్యాంకు మంజూరు చేస్తారనే పూర్తి నమ్మకం ఉందని పేర్కొంటూ మీడియా ముఖంగా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి

**ప్రజా భూమి ప్రతినిధి అవనిగడ్డ**



అవనిగడ్డ మండలంలోని రామచంద్రపురం గ్రామంలోని కన్వెన్షన్ సెంటర్లో గురువారం సాయంత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ సింహాద్రి రమేష్ బాబు ఆధ్వర్యంలో జరుగుతున్న సమావేశంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు.దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి ప్రతిమకు పూలమాలలతో నివాళులు అర్పించిన నేతలు. ఈ సమావేశంలో పాల్గొన్న మచిలీపట్నం నియోజకవర్గ పార్టీ ఇన్ ఛార్జ్ పేర్ని కృష్ణమూర్తి, పెడన నియోజకవర్గ ఇన్ ఛార్జ్ ఉప్పాల రాము, పెనమలూరు ఇన్ ఛార్జ్ దేవభక్తుని చక్రవర్తి, యువనేత సింహాద్రి వికాస్, మచిలీపట్నం పార్లమెంటు పరిశీలకులు జెట్టి గురునాథం, అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కర్ణాటి రాంబాబు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక సమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

**వెల్ఫేర్ బోర్డు సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలి**

**డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన సీఐటీయూ, భవన నిర్మాణ కార్మికులు**



**ప్రజా భూమి,రాజవొమ్మంగి:**

భవన నిర్మాణ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించి, వెల్ఫేర్ బోర్డు ద్వారా పూర్తిస్థాయి సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. రామరాజు మాట్లాడుతూ.. కార్మికుల సుదీర్ఘ పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డును పునఃప్రారంభించినప్పటికీ, గతంలో అమలైన సంక్షేమ పథకాలన్నింటినీ పునరుద్ధరించకపోవడం దారుణమన్నారు. కేవలం కొన్ని ప్రయోజనాలకు మాత్రమే పరిమితం చేయడంతో అత్యధిక శాతం మంది కార్మికులు సంక్షేమానికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణ రంగంలో పనిచేస్తూ నిత్యం ఎందరో ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోవడం, అంగవైకల్యం బారిన పడటం జరుగుతున్నా బోర్డు నుంచి తగిన ఆర్థిక సాయం అందడం లేదని మండిపడ్డారు.వెల్ఫేర్ బోర్డులో సుమారు రూ.4,500 కోట్లకు పైగా నిధులు ఉన్నప్పటికీ కార్మికులకు అవి నిరుపయోగంగా మారాయని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక డిప్యూటీ తహశీల్దార్‌కు అందజేశారు.ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు ఎస్. వీరబాబు, దుర్గా, సత్తిబాబు, బుజ్జి, అప్పారావు, భద్రం, రమణ, కామరాజు, నూకరాజుతో పాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## రాజులపాటి గంగరాజు భౌతికకాయానికి కొనకళ్ల నారాయణరావు నివాళి



**మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి**

కొనకళ్ల సోదరుల అక్క అల్లుడు రాజులపాటి గంగరాజు కాలం చేయడంతో ఆయన భౌతికకాయానికి ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు నివాళులర్పించారు.ఈ సందర్భంగా గంగరాజు భౌతికకాయాన్ని సందర్శించిన కొనకళ్ల నారాయణరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ నాయకులు కొనకళ్ల బుల్లయ్య, యార్లగడ్డ సీతారామయ్య, బత్తిన దాసు, బాడిగా శంకర్, కట్టా దుర్గతో పాటు కొనకళ్ల కుటుంబ సభ్యులు పాల్గొని రాజులపాటి గంగరాజుకు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలిపారు.

## బీసీలంటే ఎందుకింత కక్ష జగన్ రెడ్డీ?

**జగన్ రెడ్డి కుట్రల కారణంగానే రిజర్వేషన్ ఇబ్బందులు**

**బీసీ నాయకత్వాన్ని అణచివేయడమే లక్ష్యంగా వైసీపీ కుట్రలు**

**ఎన్ని అడ్డంకులెదురైనా బీసీల హక్కుల కోసం పోరాడతామన్న మంత్రి కొల్లు రవీంద్ర.**



**మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి**

బలహీన వర్గాల రిజర్వేషన్ల విషయంలో జరిగిన పరిణామాలు చాలా దురదృష్టకరమని, బాధాకరమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బలహీన వర్గాల హక్కుల కోసం కూటమి ప్రభుత్వం న్యాయపోరాటం కొనసాగిస్తుందని, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు.౧౯ ఈ ౦ లో స్థానిక సంస్థల్లో బలహీన వర్గాలకు రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత అన్న నందమూరి తారక రామారావుకు దక్కుతుందని, తర్వాత ఆ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచడమే కాకుండా బలహీన వర్గాల్లో రాజకీయ చైతన్యం తీసుకొచ్చిన ఘనత చంద్రబాబు నాయుడు కు దక్కుతుందన్నారు . అదే సమయంలో అసెంబ్లీలో చట్ట సవరణ చేసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి బలహీన వర్గాల నాయకత్వాన్ని అణిచివేయాలనే ఉద్దేశంతో అనేక కుట్రలు చేసింది. అనేక మంది బీసీ నాయకులపై కేసులు పెట్టి, దాడులు చేశారు. బలహీన వర్గాలకు రిజర్వేషన్లు శాశ్వతంగా దక్కకుండా చేయడానికి కోర్టులో సరైన వాదనలు వినిపించకుండా మోసం చేశారు. రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడం ద్వారా బలహీన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం లేకుండా చేశారు. కోర్టుల్లో సరైన వాదనలు కూడా వినిపించకుండా మోసం చేశాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రిజర్వేషన్ల అంశాన్ని అసెంబ్లీలో చర్చించి ఆమోదించేందుకు అందరూ ముందుకు వచ్చారు. కానీ కోర్టులో కేసు వేయించి, 34 శాతం రిజర్వేషన్లను కోర్టులో కొట్టివేయించే పరిస్థితి తీసుకురావడం చాలా బాధాకరం. బీసీలంటే ఎందుకు ఇంత కక్ష జగన్ రెడ్డి? జగన్ రెడ్డి లాంటి బీసీ ద్రోహులు ఎన్ని కుట్రలు చేసినా.. ఎంత కక్ష గట్టినా.. బీసీ హక్కులను పోరాడి సాధించుకుంటాం. కూటమి ప్రభుత్వం సుప్రీంకోర్టులోనూ ఖచ్చితంగా పోరాడుతుంది. ఈ న్యాయపోరాటంలో విజయం సాధిస్తామనే పూర్తి నమ్మకం, విశ్వాసం ఉంది. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బలహీన వర్గాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. రాష్ట్ర జనాభాలో సుమారు 52 శాతం బీసీ వర్గాలు ఉన్నాయి. వారికి న్యాయం జరిగే విధంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది. న్యాయపోరాటం ద్వారా బీసీల హక్కులను కాపాడుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

## మానసిక దృఢత్వంతో ఒత్తిడికి చెక్

**- ఒత్తిడిని జయించేందుకు.. అవగాహన, ఆచరణ అవసరం**

**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**




**ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:**

ఉద్యోగ విధులు, కుటుంబ బాధ్యతలు తదితర కారణాలతో ఏర్పడే ఒత్తిడిని గుర్తించి, సమర్థవంతంగా నియంత్రించుకునే నైపుణ్యాలను ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మానసిక దృఢత్వంతో ఒత్తిడికి చెక్ పెట్టొచ్చని పేర్కొన్నారు.గురువారం ఆకర్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఉద్యోగులకు జరిగిన 18వ స్ట్రెస్ మేనేజ్‌మెంట్ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ డా. విమల ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడుతూ జీవితంలో ఒత్తిడి సహజమేనని.. ఉద్యోగం, కుటుంబం, పిల్లలు, భార్యాభర్తల సంబంధాలు వంటి వివిధ సందర్భాల్లో ఒత్తిడి ఏర్పడవచ్చని తెలిపారు. ముందుగా ఒత్తిడి అంటే ఏమిటి, అది మనపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే విషయాన్ని ప్రతిఒక్కరూ అర్థం చేసుకోవాలని సూచించారు. సమయ పాలన, ప్రవర్తనలో మార్పు, సంబంధాల నిర్వహణ వంటి అంశాలపై దృష్టిసారించడం ద్వారా ఒత్తిడిని సమర్థవంతంగా నియంత్రించుకోవచ్చని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆకర్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్ట్రెస్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా అనేక మంది ఉద్యోగులు ప్రయోజనం పొందుతున్నారని, సిబ్బంది నుంచి మంచి స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. ఉద్యోగుల మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నియంత్రణకు ఇటువంటి అవగాహనా కార్యక్రమాలు ఉపయోగకరంగా ఉంటాయని, భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాల నిర్వహణకు జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.సైకాలజిస్ట్ డా. టి.ఎస్.రావు, ఆకర్ష ఫౌండేషన్ చైర్మన్ డా. గర్రె శంకరరావు మాట్లాడుతూ ఒత్తిడి నిర్వహణతో పాటు మాదకద్రవ్యాల నిర్మూలన, వాటి వినియోగం నివారణపైనా ప్రభుత్వ శాఖలతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

## కృష్ణా జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయానికి రాష్ట్రస్థాయి ప్రథమ స్వచ్ఛ అవార్డు

**పరిశుభ్రత, పచ్చదనం, పారదర్శక పాలనలో విశిష్ట మార్పులు**

**ఒకే నాయకత్వంలో జిల్లాకు రెండు రాష్ట్రస్థాయి స్వచ్ఛ అవార్డులు**

**మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి**

పరిశుభ్రత, పచ్చదనం, ఉద్యోగుల సంక్షేమం, పారదర్శక పరిపాలనలో చేపట్టిన వినూత్న కార్యక్రమాలకు గుర్తింపుగా కృష్ణా జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయానికి రాష్ట్రస్థాయి ప్రథమ స్వచ్ఛ అవార్డు లభించింది. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ దివస్ సందర్భంగా నిర్వహించిన అవార్డుల ఎంపికలో 'స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాలు' విభాగంలో కృష్ణా జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం రాష్ట్రస్థాయిలో మొదటి స్థానాన్ని సాధించింది.ప్రతి ఏడాది అక్టోబర్ 2న స్వచ్ఛ దివస్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, పంచాయతీలు, పాఠశాలలు, ఆసుపత్రులు, వసతి పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, బస్సు స్టాండ్లు, రైతు బజార్లు, పరిశ్రమలు, ప్రభుత్వ కార్యాలయాలు తదితర 29 విభాగాల్లో పరిశుభ్రత, నిర్వహణ, పచ్చదనం, ప్రజలకు అందుతున్న సౌకర్యాలు తదితర అంశాలను పరిశీలించి రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు అవార్డులను ఎంపిక చేస్తారు.జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా డా. జె. అరుణ బాధ్యతలు స్వీకరించిన అనంతరం కార్యాలయ రూపురేఖలతో పాటు పరిపాలనా విధానాల్లోనూ అనేక మార్పులు చేపట్టారు. సిబ్బందికి, కార్యాలయానికి వచ్చే ప్రజలకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.బాధ్యతలు స్వీకరించిన కొద్దికాలంలోనే కార్యాలయానికి ఐఎస్ఓ 9001:2015 ధ్రువీకరణ లభించేలా చర్యలు చేపట్టడం ద్వారా జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయాన్ని నాణ్యమైన పరిపాలనకు ఒక నమూనాగా తీర్చిదిద్దారు.మహిళా ఉద్యోగుల సౌకర్యార్థం ప్రత్యేక విశ్రాంతి గదిని ఏర్పాటు చేయడంతో పాటు, ఉపయోగించిన శానిటరీ న్యాప్కిన్లను శాస్త్రీయ పద్ధతిలో నిర్వీర్యం చేసేందుకు ప్రత్యేక దహన యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ఉద్యోగుల పిల్లల కోసం ఆహ్లాదకరమైన వాతావరణం శీతలీకరణ సదుపాయాలతో బాలల సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే చర్యల్లో భాగంగా ప్లాస్టిక్ సీసాలకు బదులుగా ఉక్కు గ్లాసులు, గాజు సీసాలను వినియోగంలోకి తీసుకువచ్చారు. కార్యాలయ ఆవరణలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు ప్రత్యేక చెత్త డబ్బాలను ఏర్పాటు చేసి పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.కార్యాలయ ఆవరణలో కొబ్బరి, మామిడి తదితర మొక్కలను విస్తృతంగా నాటడంతో పచ్చదనాన్ని పెంపొందించారు. ఉద్యోగుల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నడక మార్గం, యోగా మందిరాన్ని ఏర్పాటు చేశారు.పరిపాలనలో పారదర్శకతను పెంపొందించేందుకు ఈ-కార్యాలయ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు, సూచనలు స్వీకరించేందుకు ఫిర్యాదు పెట్టెను కూడా అందుబాటులో ఉంచారు.జిల్లా ప్రజా పరిషత్‌కు చెందిన ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా, ఆక్రమణలకు గురైన ఆస్తులను గుర్తించి వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టారు. ఆదాయాన్ని పెంపొందించేందుకు షాపింగ్ సముదాయాలు, పెట్రోలు బంకులు ఏర్పాటు చేయడంతో పాటు మామిడి, కొబ్బరి తోటల అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించారు. ఈ చర్యల ద్వారా జిల్లా ప్రజా పరిషత్ ఆదాయాన్ని పెంచే దిశగా వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నారు.స్వచ్ఛ రథం నిర్వహణలో అత్యధికంగా పొడి వ్యర్థాలను సేకరించి విక్రయించినందుకు కృష్ణా జిల్లా బాపులపాడు మండలానికి రాష్ట్రస్థాయి స్వచ్ఛ రథం అవార్డు లభించింది. దీంతో ముఖ్య కార్యనిర్వహణాధికారి డా. జె. అరుణ నాయకత్వంలో కృష్ణా జిల్లాకు ఒకేసారి రెండు రాష్ట్రస్థాయి స్వచ్ఛ అవార్డులు దక్కడం విశేషంగా నిలిచింది.అక్టోబర్ 2న నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా డా. జె. అరుణ ఈ రెండు రాష్ట్రస్థాయి అవార్డులను స్వీకరించనున్నారు. కృష్ణా జిల్లాకు రాష్ట్రస్థాయిలో రెండు స్వచ్ఛ అవార్డులు దక్కడం పట్ల జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, శాసనసభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.పరిశుభ్రతతో పాటు పచ్చదనం, ఉద్యోగుల సంక్షేమం, పారదర్శక పరిపాలన, ఆస్తుల పరిరక్షణ, ఆదాయ వనరుల పెంపు వంటి విభిన్న అంశాల్లో చేపట్టిన చర్యలకు రాష్ట్రస్థాయి గుర్తింపు లభించడం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయానికి గర్వకారణంగా నిలిచింది.ద

## మాదక ద్రవ్యాల నిర్మూలన, సైబర్ భద్రత, మహిళల రక్షణపై విద్యార్థులకు అవగాహన

**మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి.. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: పోలీసు అధికారులు**

**మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి**




మాదక ద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాల నివారణ, మహిళలు, బాలికల భద్రతపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలని జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు సూచించారు. ఆయన ఆదేశాల మేరకు గురువారం మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాలలో పోలీసు శాఖ, ఈగల్ బృందం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో అదనపు ఎస్పీ వి.వి. నాయుడు, బందరు డీఎస్పీ ఎ. శ్రీనివాసరావు, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ వి. వెంకటేశ్వరరావు, నోడల్ అధికారి సీఐ చి. వెంకటేశ్వరరావు, ఈగల్ ఆర్ఎస్ఐ పి. రాంబాబు, సీనియర్ న్యాయవాది ముసలయ్య, బందరు తాలూకా ఎస్ఐ రమేష్, శక్తి బృందం సిబ్బంది, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. రేణుకాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడితే మాదక ద్రవ్యాల నియంత్రణ చట్టం--1985 ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని వివరించారు.మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమస్యలను దాచిపెట్టకుండా, మౌనం వీడి అవసరమైన సహాయం పొందాలని విద్యార్థులకు సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. సమస్యలను గుర్తించిన వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.ఆన్‌లైన్ మోసాలు, ఒకసారి వినియోగించే గోప్య సంకేతాల ద్వారా జరిగే మోసాలు, సామాజిక మాధ్యమాల దుర్వినియోగం, సైబర్ వేధింపుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.తెలియని వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, గోప్య సంకేతాలు, ధృవీకరణ సంకేతాలు ఇవ్వకూడదని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.మహిళలు, బాలికల రక్షణకు సంబంధించిన చట్టాలు, బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం, అత్యవసర పోలీసు సేవలు 112, మహిళా సహాయవాణి 181 తదితర సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఎక్కడైనా మహిళలు, బాలికల పట్ల వేధింపులు, అసభ్య ప్రవర్తన లేదా ప్రమాదకర పరిస్థితులు ఎదురైతే భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.ఈగల్ సంస్థ లక్ష్యాలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ద్వారా దేశ భద్రతకు ఎదురయ్యే ముప్పులను అధికారులు వివరించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసినప్పుడు ఈగల్ సహాయవాణి 1972కు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు.యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ, సైబర్ భద్రతపై అవగాహన పెంచుకుని, మహిళల గౌరవం, చట్టాల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీసు అధికారులు పిలుపునిచ్చారు."మాదక ద్రవ్యాలకు వద్దు.. జీవితానికి అవును" అనే సందేశంతో మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు.

